సోమవారం
26•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 260
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

పంట పెట్టుబడికి 12 వేల కోట్లు

2020 నాటికి కోటి ఎకరాలకు ప్రాజెక్టుల నీళ్లు

ప్రాజెక్టులు పూర్తయితే రైతుల వార్షికాదాయం 1.25 లక్షల కోట్లు

రైతాంగానికి ముందున్నదంతా స్వర్ణయుగమే

- రైతు సమన్వయ సమితులతో లక్షా 61వేల సైన్యం
- రైతు సమన్వయ సమితులే గ్రామ కథానాయకులు కావాలి
- రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి
- యాసంగి నాటికి ప్రీపెయిడ్ కార్డులద్వారా పెట్టుబడి సాయం
- సమస్యల పరిష్కారానికి సంకల్పబలంతో సాగుదాం
- యాభైశాతం సబ్సిడీపై ట్రాక్టర్లు ఇస్తాం
- పొలాల సోలార్ ఫెన్సింగ్‌కూ సబ్సిడీ
- రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో సీఎం కేసీఆర్
- తాను పంటకు పెట్టుబడి సహాయం తీసుకోబోనని ప్రకటన



ఆదివారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు సమన్వయ సమితుల అవగాహన సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరైన సభ్యులు. (ఇన్‌సెట్) సమితి అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్‌రెడ్డిని ప్రకటించి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.

పంట పెట్టుబడిసాయం అందించేందుకు 12వేల కోట్లు వెచ్చించనున్నట్టు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. రాష్ట్ర రైతాంగానికి ముందున్నది స్వర్ణయుగమేనని చెప్పారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన రైతు సమన్వయ సమితుల అవగాహన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితులతో రైతన్నల దశ, దిశ మారుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. 2020 నాటికి కోటి ఎకరాలకు ప్రాజెక్టుల ద్వారా నీళ్లిస్తామని, తద్వారా రాష్ట్ర రైతుల వార్షికాదాయం 1.25 లక్షల కోట్లు అవుతుందని చెప్పారు. అంత సంపద రైతుల వద్ద ఉండటం అంటే అదే బంగారు తెలంగాణ అని అన్నారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితికి గుత్తా సుఖేందర్‌రెడ్డిని చైర్మన్‌గా నియమిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు.

వివరాలు 2వ పేజీలో



శ్రీదేవి
1963 - 2018

దివికేగిన శ్రీదేవి!

జాబిలమ్మ జామురాతిరి మాయమైన

- దుబాయ్‌లో గుండెపోటుతో కన్నుమూత
- పెండ్లివిందులో పాల్గొన్న కొద్దిసేపటికే కుప్పకూలిన అందాలతార
- దవాఖానకు తరలించేలోపే తుదిశ్వాస
- నేడు భౌతికకాయం ముంబైకి తరలింపు
- విమానం పంపిన అనిల్ అంబానీ
- శోకసముద్రంలో అభిమానులు
- రాష్ట్రపతి, ప్రధాని, సీఎం కేసీఆర్ సంతాపం

వెండితెరలను వెలిగించిన నిండుచందమామ హఠాత్తుగా మాయమైపోయింది. పరిమళాలు వెదజల్లిన సిరిమల్లె పువ్వు వసివాడకముందే నేలరాలింది. అందానికి అందమై, కొలమానమై, నటనకు ప్రతిరూపమై, అపురూపమై వెలిగిన అభినేత్రి జీవితానికి అర్ధాంతరంగా తెరపడింది. అద్భుత సౌందర్యరాశి, బాలీవుడ్ లేడీ సూపర్‌స్టార్ శ్రీదేవి శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత దుబాయ్‌లో కన్నుమూశారు. అఖిలభారతావని అభిమాన నీరాజనాలందుకొన్న ప్రతిభామూర్తి కన్నుమూసి తెరిచేలోపు కానరాని లోకాలకు వెళ్లిపోయారు. రస్-అల్-ఖైమాలో మేనల్లుడు మోహిత్ మార్వా పెండ్లివిందులో పాల్గొన్న తర్వాత కొద్దిసేపటికే కుప్పకూలిన శ్రీదేవి క్షణాల్లో తుదిశ్వాస విడిచారు. ప్రపంచవ్యాప్తంగా గల ఆమె అభిమానకోటి తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

వివరాలు 5,11, చిత్రం పేజీల్లో

నేటి నుంచి ఈ-గవర్నెన్స్ సదస్సు

- హాజరుకానున్న కేంద్ర మంత్రులు, మంత్రి కేటీఆర్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

6

మలేరియా చికిత్సకు సరికొత్త ఔషధం

- పాలిమర్ నానోమెడిసిన్‌తో పూర్తిస్థాయిలో నయం
- హెచ్‌సీయూ పరిశోధనా బృందం ఘనత





ఆదివారం రాజేంద్రనగర్‌లో రైతు సమన్వయ సమితుల తొలి ప్రాంతీయ అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ముదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, వేముల వీరేశం, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, తదితరులు కూడా ఉన్నారు.

పంట పెట్టుబడికి 12వేల కోట్లు

- 2020 నాటికి కోటి ఎకరాలకు ప్రాజెక్టుల నీళ్లు.. రైతుల వార్షికాదాయం 1.25 లక్షల కోట్లు
- రైతాంగానికి ముందున్నదంతా స్వర్ణయుగమే
- రైతు సమన్వయ సమితులతో లక్షా 61వేల సైన్యం
- లక్షా61వేల మంది కేసీఆర్‌లు తయారుకావాలి
- రెండేండ్లలో గుణాత్మకమైన మార్పును సాధించాలి
- రైతు సమన్వయ సమితులే గ్రామ కథానాయకులు
- రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా గుత్తా
- ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్
- సమస్యల పరిష్కారానికి సంకల్ప బలంతో సాగుదాం
- రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రరైతాంగానికి ముందున్నదంతా స్వర్ణయుగమేనని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. రైతు సమన్వయ సమితులతో రైతన్నల దశ, దిశమారుతుందని ఆకాంక్షించారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా అమలుచేయనున్న పంటల పెట్టుబడి పథకానికి 12వేల కోట్లు వెచ్చిస్తామని ప్రకటించారు. 2020 నాటికి కోటి ఎకరాలకు ప్రాజెక్టులద్వారా నీళ్లు ఇస్తామని చెప్పారు. దాంతో రాష్ట్ర రైతుల వార్షికాదాయం రూ.1.25 లక్షల కోట్లు ఉంటుందని తెలిపారు. రైతు సమన్వయ సమితుల పేరిట ఏర్పాటయ్యే 1.61 లక్షలమందితోకూడిన సమన్వయ సైన్యం రైతన్నల కష్టనష్టాలను దూరంచేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఈ సమితుల్లోని ప్రతి ఒక్కరూ ఒక కేసీఆర్ కావాలన్నారు. రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులలో భాగంగా తొలి సదస్సు ఆదివారమిక్కడ రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ప్రాంగణంలో నిర్వహించారు. 13 జిల్లాల సమన్వయ సమితుల సభ్యులు, మార్కెట్ కమిటీలు, డీసీసీబీల చైర్మన్లు హాజరైన సదస్సులో సమన్వయ సమితుల లక్ష్యాలు, విధులు, ప్రభుత్వ విధానాల గురించి సీఎం సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. రైతులకు న్యాయంచేయాలన్న లక్ష్యంతో, సంకల్పబలంతో ముందుకెళ్లాలని సమన్వయ సమితులకు పిలుపునిచ్చారు. వారు చేపట్టిన బాధ్యత పవిత్రమైనదని అన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగం విశేషాలు ఆయన మాటల్లోనే..

జరిగింది కొంతే.. జరుగాల్సింది ఎంతో

'రైతుల ఆత్మహత్యలన్న వార్తలను పేపర్లలో చూస్తున్నాం. గత ప్రభుత్వాలు రైతే రాజు అన్నాయి. పెద్ద పెద్ద డైలాగులు చెప్పాయి. కానీ, రైతు పరిస్థితి చెప్రాసీ కన్నా, పాన్‌డబ్బాలో పనిచేసేవారికన్నా దారుణంగా ఉండేది. వ్యవసాయం ఒక జీవనవిధానం. రైతు తన వ్యవసాయ క్షేత్రానికి రాజు. కాలం మంచిగున్నపుడు రైతు ఒక గ్రహంలా ఉండేవాడు. కుమ్మరి, కమ్మరి, కంసాలీ వంటి వృత్తుల వారు ఉపగ్రహాలుగా ఉండేవారు. వర్షాలు సకాలంలో పడేవి. కరువు అరుదుగా వచ్చేది. ప్రభుత్వాల అసమర్థత, అవివేకం, ఆలోచనారహిత విధానాలు, పెడమార్గం వల్ల అడ్డంగా చెట్లను నరికారు. వాతావరణ సమతుల్యతను దెబ్బతీసిన ఫలితంగా కురువాల్సిన తీరులో వర్షాలు కురుస్తలేవు. 21 రోజులు చెన్నై నీటిలో మునిగింది. ముంబై, హైదరాబాద్‌లోనూ ఇలాగే జరిగింది. అయితే అతివృష్టి, లేకపోతే అనావృష్టి. రైతుల పరిస్థితి అనేక విపరిణామాల వల్ల దారుణంగా మారింది. సమైక్యరాష్ట్రంలో తెలంగాణకు నీళ్లు ఇవ్వగలిగే పరిస్థితి ఉన్నా, ఇచ్చేవారు కాదు. తెలివి తక్కువతనమో పక్షపాత ధోరణో అర్థంకాదు. కరంటు కూడా ఇవ్వలేని దుస్థితికి నెట్టివేశారు. అనేకమంది యువ రైతులు అర్ధరాత్రి కరంటు పెట్టబోయి షాక్‌కొట్టి చనిపోయారు. ఇవన్నీ గతం. ఇప్పుడు రాష్ట్రం వచ్చింది. చాలామంది మిత్రులతో చర్చలుచేశాం. పోచారం స్వయంగా రైతు బిడ్డ. నేను బక్కపేదను. సీనన్న తెలంగాణ మోతుబరి. ఢిల్లీకి వెళ్తే కూడా ఆయననే ముందుపెడుతుంటా. ఆయనకు లక్ష్మీపుత్రుడు అని పేరుపెట్టిన. ఆయన వ్యవసాయశాఖలో అడుగుపెట్టిన తర్వాత అంతా మంచే జరుగుతున్నది. ఎండకాలంలోనే ఎవ్వరూ ఎరువులగురించి పట్టించుకోనపుడే ఎరువులు, విత్తనాలు తెప్పించి గోదాంలలో పెట్టించి రైతులకు సకాలంలో అందిస్తున్నారు. ఈయనకు సోపతి గోదాముల మంత్రి హరీశ్‌రావు. రాష్ట్రం వచ్చేనాటికి 4లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను 23 లక్షల టన్నుల సామర్థ్యానికి పెంచారు. శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రితో ఏమీకాదు. జరిగింది కొంతే.. జరుగాల్సింది ఎంతో ఉన్నది. రైతు సమన్వయ సమితులు కథానాయకులు కావాలి. గ్రామం, మండలం, జిల్లాలవారీగా రైతు సమస్యలపై చర్చించాలి.

రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి

రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తున్నా. ఆయన రైతు బిడ్డ, స్వయంగా రైతు. ఇప్పటికీ 60-70 ఎకరాల ఆసామి. హైదరాబాద్‌లో తక్కువ, పొలం దగ్గరే ఎక్కువ ఉంటాడు. నల్లగొండలో పాడిపరిశ్రమను అభివృద్ధి చేసిన వ్యక్తి. ఆ డెయిరీ బ్రహ్మాండంగా పనిచేస్తున్నది. అన్నిరకాలుగా అనుభవం ఉన్న వ్యక్తి. కాపుదానం బిడ్డయితేనే పని నడుస్తుంది. అందుకే పెద్దకాపాయననే పెద్దకాపుగా పెట్టుకున్నాం. ఆయన పెద్దకాపు.. మనం చిన్నకాపులం. ఇక కథ రంజుగా నడువాలి. ఇక గుత్తకుపైన పెద్దకాపు పోచారం శ్రీనివాస్‌రెడ్డి. ఖమ్మంలో మిర్చి, ఇంకో దగ్గర పత్తి వచ్చిందని రైతులు కోపానికి వచ్చారని, కొట్లాట అయిందని వార్తలు వచ్చాయి. ఏ జిల్లావాడు ఏం తిన్నాడో ఇప్పటివరకు తెలియదు. తెలంగాణ ఆహార అవసరాలేమిటో తెలియవు. మన వ్యవసాయ వర్సిటీ సర్వేచేయించింది. ఎక్కడ ఏ అవసరం ఉందో పుస్తకరూపంలో పేర్కొన్నారు. దీన్ని రైతు సమన్వయ సమితి సభ్యులందరికీ ఇచ్చాం. దీన్ని అటకమీద పెట్టవద్దు. క్షుణ్ణంగా చదువాలి. సమన్వయ సమితుల నాయకులకు శిక్షణ కూడా ఇస్తాం.

కోటీ 65లక్షల ఎకరాల భూముల లెక్కలు తేలాయి

భూమిదో హరిగోస. లెక్కపత్రం లేకుండా ఉండేది. పంట పెట్టుబడి కోసం జాబితాలడిగితే వ్యవసాయాధికారులు ఒకటి, రెవెన్యూ వాళ్లు ఇంకోటి ఇచ్చారు. రెంటికీ పొంతన లేదు. అందుకే రికార్డుల ప్రక్షాళన చేపట్టాం. కోటీ 65 లక్షల ఎకరాల రికార్డుల ప్రక్షాళన జరిగింది. ఈ భూములకు సంబంధించిన రైతులకు పెట్టుబడి ఇవ్వబోతున్నాం. యాసంగికోసం నవంబర్ నాటికి ప్రీపెయిడ్ కార్డులిస్తాం. మేం ఇక్కడ డబ్బులు జమచేస్తాం. అక్కడ వారు తీసుకోవచ్చు. పాలమూరు ఎత్తిపోతలు, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి ప్రాజెక్టుల ద్వారా నీళ్లు ఇస్తాం. రాబోయే వానకాలానికి చాలావరకు ప్రాజెక్టులు పూర్తవుతాయి. పాలమూరు, డిండి, సీతారామ, కాళేశ్వరం, దేవాదుల ఎత్తిపోతలను పూర్తిచేసి 2020 చివరినాటికి ప్రాజెక్టుల ద్వారానే కోటి ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తెలంగాణ వచ్చిన తర్వాత మైనర్ ఇరిగేషన్‌పై దృష్టిసారించాం. మిషన్ కాకతీయను ప్రపంచం కొనియాడుతున్నది. వీటిని శాశ్వత ప్రయోజన సాధనాలని, ప్రజలకు మేలుచేస్తాయని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ అన్నారు. స్వయంగా నర్సంపేట చెరువు గట్టు మీద తన పుట్టినరోజు వేడుక చేసుకున్నారు.



రంగారెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి ప్రతినిధులు సీఎం కేసీఆర్‌కు బహూకరించిన నాగలి, ఎండ్లబండి బొమ్మ

కరంటు మోటర్లకు ఆటోస్టార్టర్లు వద్దు

ఇక తెలంగాణలో ఎట్టిపరిస్థితుల్లోను కరంటు పోదు. గతంలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఆటో స్టార్టర్లు తెచ్చుకున్నారు. ఇక ఇప్పుడు వాటి అవసరం లేదు. మీరు ఎప్పుడైనా వెళ్లి నీళ్లు పెట్టుకోవచ్చు. కరంటును జాగ్రత్తగా వాడుకోవాలి. ఏడాదిపాటు భూగర్భ జలాలను కాపాడుకోవాలి. 12 గంటల కరంటు ఇస్తే చాలు అని కొందరు అంటున్నారు. కరంటును 24 గంటలూ ఇస్తాం. తగ్గించే ప్రసక్తే లేదు. రైతులకు గతంలో సంఘం ఉండేది కాదు. ఇప్పుడు రైతు సమన్వయ సమితులు ఆటంబాంబులా పనిచేయాలి. తెలంగాణ ఉద్యమసాధనే ఒక ఉదాహరణ. అందరం ఒక్కతాటిపైకి వచ్చి సాధించుకున్నాం. బంగారు తెలంగాణ సాధించుకుంటామన్న నమ్మకం ఉన్నది. మీకోసం ఏం చేయడానికైనా ప్రభుత్వం సిద్ధం. ఎకరానికి రూ.4వేల పెట్టుబడి విప్లవాత్మక చర్య అని కేంద్ర హోంమంత్రి అన్నారు. దీన్ని వెనక్కు కట్టించుకుంటారా? అని అడిగారు. అలాంటిదేమీ లేదంటే ఆయన చక్కరొచ్చిపడ్డట్టు చేసిండు. దేశంలో, ప్రపంచంలో ఇలాంటి పథకం మరొకటి లేదు. అంకాపూర్ రైతులతో చర్చించినపుడు ఈ పథకం ప్రకటించాను. రూ.12వేల కోట్లు ఖర్చుచేయబోతున్నాం ఇదో చరిత్ర కాబోతున్నది. పాలమూరు, సీతారామ, కాళేశ్వరం దేవాదుల తదితర ఎత్తిపోతల పథకాలను పూర్తిచేస్తే రైతులు పండించే పంట విలువ లక్షా 25వేల కోట్లు ఉంటుంది. అంత సంపద రైతు జేబులో ఉంటే అది బంగారు తెలంగాణనే అవుతుంది. ఇది వందకు వందశాతం నిజం అవుతుంది. ఏదైనా చేయాలంటే ఆత్మవిశ్వాసం కావాలి. ఆంధ్ర నేతలు అనేకరకాలుగా నన్ను అవమానించారు. అయినా, వెనుదిరగలేదు. ఒకసారి ఢిల్లీకి వెళ్లేటపుడు 'ఇక తిరిగి వచ్చేది తెలంగాణ రాష్ట్రానికే' అని చెప్పా. చెప్పినట్లుగానే తెలంగాణ రాష్ట్రంలోనే అడుగుపెట్టా. సంకల్ప బలంతో దేన్నైనా సాధించవచ్చు. మనం గెలువాలంటే రైతులను సంఘటితం చేయాలి.

కల్తీ విత్తనాలు అమ్మేవారి భరతం పట్టండి

కల్తీపై ప్రేక్షకపాత్ర వద్దు. కల్తీ విత్తనమనే పురుగులపై ప్రభుత్వం పీడీ యాక్టు పెట్టింది. ఇక కల్తీ విత్తనాల అమ్మకాలు జరుగకుండా చూడాల్సింది సమన్వయ సమితుల సభ్యులే. వేలితో కొడితే దెబ్బ తాకదు. పిడికిలితో కొడితే దెబ్బతాకుతుంది. పిడికిలిగా ఉండటమే సంఘటిత శక్తి. రైతులను ఆర్గనైజ్ చేయాలి. సంవత్సర కాలంలో కొన్ని లక్ష్యాలు సాధించాలి. వచ్చే సంవత్సరం పంటకాలనీల ఏర్పాటుకు నడుం బిగించాలి.

రైతు వేదికల నిర్మాణానికి రూ.12 లక్షలు

వ్యవసాయాధికారులు మంచిగా పనిచేయాలి. వారికి కూడా ప్రోత్సాహకాలిస్తాం. ఎకరం భూమిలో రైతు వేదికలు నిర్మించాలి. వీలైతే దానంగా ఎవరైనా ఇస్తారేమో చూడాలి. లేకపోతే కొనుగోలు చేయాలి. రైతు వేదికల నిర్మాణానికి రూ.12 లక్షలిస్తాం. వచ్చే వానకాలంనుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఏ పంట ఎంత వస్తున్నదో లెక్కలు తీయాలి. మండల కమిటీలు జిల్లా కమిటీలకు, జిల్లా కమిటీలు రాష్ట్ర కమిటీకి నివేదికలివ్వాలి. పాస్‌పుస్తకాల పంపిణీ తర్వాత ఫౌతి, మ్యుటేషన్‌కోసం పైరవీలు చేయాల్సిన పరిస్థితి ఉండదు. భూముల వివరాలతో ధరణి వెబ్‌సైట్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. అమ్మినవాళ్లకు, కొన్నవాళ్లకు పాస్‌పుస్తకాలు, రిజిస్ట్రేషన్ కాగితాలు పోస్టులో పాస్‌పోర్టులా వస్తాయి. రిజిస్ట్రార్ ఒకరోజు ఆపితే రోజుకు వెయ్యి, ఎమ్మార్వో ఆపితే ఆయనకు, ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఆపితే అక్కడి బాధ్యుడికి రూ.వెయ్యి ఫైన్‌వేస్తాం. రైతు చనిపోతే వీఆర్వో తక్షణమే రైతు భార్య వివరాలను ఎమ్మార్వోకు అందజేయాలి. ఎమ్మార్వో ఫౌతి చేయాలి.

మార్కెట్లకు నియంత్రణ విధానం రావాలి..

వరి, మొక్కజొన్న, కంది, పత్తి ఎంత వస్తుందో మార్కెట్లకు వివరాలు తెలియాలి. పంట సీజన్‌లో ఏ గ్రామానికి సంబంధించిన పంటను ఎప్పుడు కొనాలో నిర్ణయించుకోవాలి. వచ్చినవారు అర్ధగంటలో కాంటా చేయించుకుంటారు. గ్రామ, మండల సమన్వయ సమితులే చొరువ తీసుకోవాలి. వచ్చే వర్షాకాలం నుంచి ఎన్ని ఎకరాల్లో ఏ పంట ఉందో లెక్క తేలాలి. వ్యవసాయ కార్యదర్శి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడికి, ముఖ్యమంత్రికి రోజువారీ వివరాలు తెలియాలి. నియంత్రణ విధానం అవలంబించాలి. కమిషన్ ఏజెంట్లు కుమ్మక్కై రైతులను ముంచుతుంటారు. ఇక అలాంటిది ఉండదు. 6-7వేల కోట్లు గుత్తా సుఖేందర్‌రెడ్డి వద్ద ఉంటాయి. అడ్తీదారులు మద్దతు ధర ఇస్తే సరి. లేకపోతే రాష్ట్ర రైతుసంఘం నేరుగా కొనుగోళ్లు చేస్తుంది. అలా వచ్చే ఆదాయం సమన్వయ సమితులకే చెందుతుంది.

వ్యవసాయ యాంత్రీకరణ అవసరం

ప్రతి ఐదు వేల ఎకరాలకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు.. ఇలా ఏం ఉన్నాయి? ఏం లేవన్న లెక్కలు తీయాలి. రాబోయే రోజుల్లో వ్యవసాయ పనులు చేసే మనుషులు దొరుకరు. అందుకే మండలానికి పది చొప్పున నాట్లు వేసే యంత్రాలు 50% సబ్సిడీతో ఇస్తాం. ట్రాక్టర్లను, కలుపు తీసే యంత్రాలను ఇస్తాం. దున్నకం మొదలు పంట పండేవరకు అన్నిస్థాయిల్లో యాంత్రీకరణ తప్పనిసరి. నీళ్లు, యంత్రాలు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు అన్నీ ఉంటాయి. ఏడాదిలో ఈ క్రమం సాధిద్దాం. చివరి దశలో పంట కాలనీలకు వెళ్తాం. మహబూబ్‌నగర్‌లో తక్కువ వర్షపాతం, ఆదిలాబాద్‌లో డబుల్ వర్షపాతం ఉంటుంది. గాలి, వాయువేగం పరిస్థితి, వాతావరణ స్థితిగతులు, నేల స్వభావం, వ్యవసాయిక పరిస్థితులపై విశ్లేషణ జరుగాలి. తెలంగాణను పంట కాలనీలవైపు తీసుకెళ్లాలి. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టాలి. పంటలను నిల్వచేసే శీతల గిడ్డంగులను ఏర్పాటుచేసుకుంటాం. రైతుల విశ్వాసం పెరిగింది. రైతులు వారికి లాభం ఉందని గమనిస్తే మనం చెప్పేది వింటారు.

ఈసారి రైతు బడ్జెట్

ఈసారి రైతులకు ప్రత్యేకించి వ్యవసాయబడ్జెట్ ప్రవేశపెడ్తాం. ప్రభుత్వం రైతుల కోసం కట్టుబడి ఉన్నది. అలవికాని, అబద్ధపు మాటలను చెప్పదు. రైతాంగం దుఃఖాన్ని కడతీర్చేవరకు, సాగునీటిని ప్రతీ ఎకరానికి అందించేవరకు పనిచేస్తాం. రైతు సమన్వయ సమితులు మార్కెట్‌కు ఇప్పుడే నియంత్రిత విధానంలో పంట తెచ్చే పద్ధతి తీసుకురావాలి. మీకు వెన్నుదన్నుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉంటుంది. గొప్ప డిసిప్లేన్ ఉన్న రైతులు, ధనిక రైతులు తెలంగాణలో ఉన్నారని చెప్పుకోవాలి. మనం ఖరాబు కాలేదు. ఆంధ్రప్రదేశ్ కన్నా, దేశంలోని అనేక రాష్ట్రాలకన్నా ముందున్నాం. పొగడ్తలకు పొంగిపోవద్దు. రైతును గద్దకు వేసేవరకు విశ్రమించవద్దు. లక్షా 61వేల మంది కేసీఆర్‌లు కావాలి. రెండేండ్లలో గుణాత్మకమైన మార్పు రావాలి.

నేను పంట పెట్టుబడి తీసుకోను

నేను పెట్టుబడి సాయం తీసుకోను. నాలాంటివాళ్లు కొందరు ఉంటారు. ఇలా 'గివ్ ఇట్ అప్'కు ముందుకు వచ్చినవారు వదులుకునే సొమ్ము కూడా సమన్వయ సమితి వద్దే ఉంటుంది. ఇప్పటికే రూ.200 కోట్లు మూలధనం ప్రభుత్వం సమకూర్చింది. మరో 6-7వేల కోట్ల బ్యాంక్ గ్యారంటీ కూడా ఇస్తుంది. రాష్ట్ర రైతు సమన్వయ సమితి జోక్యం చేసుకుంటే గిట్టుబాటు ధర సచ్చినట్టు వచ్చి తీరుతుంది. రైతు సమన్వయ సమితుల్లో ఉన్న వారితో పెద్ద సైన్యం తయారైంది. లక్షా 61వేల మంది కూడబలుక్కుంటే కానిది లేదు.

మా పాలనలో అసెంబ్లీకి కందిళ్లు రాలేదు..

రైతు సమన్వయ సమితుల్లో టీఆర్‌ఎస్ వాళ్లే ఉంటారు. 14 ఏండ్లు తెలంగాణకోసం పేగులు తెగేవరకు కొట్లాడిండ్రు. ఇదే విషయం ప్రతిపక్షాలకు అసెంబ్లీలోనే చెప్పాను. సమన్వయ సమితుల సభ్యులు నా మాట నిలబెట్టండి. ప్రతిపక్షాలు గతంలో ఎన్నో డ్రామాలు చేశాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై 200 కేసులు వేస్తారా? జడ్జిలుకూడా తిడుతున్నారు. సిగ్గులేదా వీళ్లకు? 'రైతులకు నీళ్లు రావద్దు. నీళ్లు వస్తే టీఆర్‌ఎస్ వాళ్లకు ఓట్లస్తయి. అందుకే ప్రాజెక్టులు కట్టవద్దు'.. ఇదే ప్రతిపక్షాల దందా. ఇవా రాజకీయాలు? రైతులకు సమస్యలొస్తే వెంటనే మార్కెట్ కమిటీల వద్ద ధర్నాలు చేస్తారు. మూడేండ్ల క్రితం వరకు వీళ్లే అధికారంలో ఉన్నారు కదా? 64 రకాల ఆకుపసర్లు తాగి పవిత్రమైనారా? కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీకి టీడీపీ కందిళ్లు తెచ్చింది. టీడీపీ అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ కందిళ్లు తెచ్చి కరంటు లేదన్నది. కందిళ్లు లేకుండా చేసింది ఒక్క టీఆర్‌ఎస్ ప్రభుత్వమే. మొసలి కన్నీళ్లు కార్చే దొంగలు, బట్టేబాజి రాజకీయం మన రైతుల కన్నీళ్లు తుడువదు. లక్షా 61వేల రైతు సమన్వయ సమితుల సైన్యమే రైతాంగ దుఃఖం తీర్చాలి. వారిని తీరానికి చేర్చే నావకావాలి. దిక్సూచి కావాలి. రైతు సమన్వయ సమితుల్లో పైరవీలకు ఆస్కారం ఉండొద్దు. చెక్కుల పంపిణీ వద్ద మీరుండాలి. రైతు సమితులతో స్థానిక సమితులు నిర్వీర్యమవుతాయని ఎవరో పేపర్ల రాసిండు. మనం ఏమైనా పంచాయతీ ఆఫీసులో కూర్చుంటామా? చెట్లు, చెలకలు పట్టుకొని తిరిగే మన పని పంచాయతీ వాళ్లు చేస్తారా? గొడ్డలిపెట్టు అని మాట్లాడుతున్నారు. రాజకీయం చేస్తున్నారు. దిక్కుదివాణం లేని రైతులను ఆర్గనైజ్ చేసి వారికి శక్తి ఇద్దామంటే ఇట్లాంటి మాటలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర రైతాంగానికి చేతులెత్తి దండం పెడుతున్నా. నేను మీ బిడ్డనే. నేను కూడా రైతునే. ముఖ్యమంత్రిగా ఉన్నా రైతుగా మట్టే పిసుకుతా. ఏ మాత్రం టైం దొరికినా పొలంకాడికి ఉరుకుతా. కాల్వకాల్వకు తిరుగుతా. చెట్టు చెట్టుకు.. కాయకాయకు తిరుగుతా. నాకు తెలుసు రైతు కష్టం.

గిరిజన విద్యార్థినికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్
సీఎం కేసీఆర్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏ సందర్భంలోనైనా ఎలాంటి సాయమైనా అందించడంలో తన ప్రత్యేకతను సీఎం కేసీఆర్ మరోసారి చాటుకున్నారు. రైతు సమన్వయ సమితుల అవగాహన సదస్సు సందర్భంగా ఓ రైతు కష్టాన్ని తీర్చిన సీఎం.. ఆ రైతు బిడ్డ విదేశాల్లో చదువుకునేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ప్రకటించారు. ఆదివారం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సు సందర్భంగా రైతుల నుంచి సీఎం కేసీఆర్ సలహాలు, సూచనలను లిఖిత రూపంలో కోరారు. అనంతరం రైతుల సలహాలపై స్పందించారు. ఈ సందర్భంగా వేదికకు ఎదురుగా ఉన్న గ్యాలరీలో కూర్చున్న సూర్యాపేట జిల్లాకు చెందిన మాలోతు కృష్ణ రోదిస్తూ లేచి, సంచి నుంచి ఫైల్ తీశారు. దీనిని గుర్తించిన సీఎం కేసీఆర్ అతనిని తన దగ్గరకు తీసుకురావాలని కోరారు. దీంతో మాలోతు కృష్ణను పోలీసులు వేదికపైకి తీసుకెళ్లారు. సమస్యను తెలుసుకున్న సీఎం కేసీఆర్.. కృష్ణ కూతురుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రత్యేక కేసుగా పరిగణనలోకి తీసుకోవాలని జేఏడీ అధికారులకు సూచించారు. ఈ విషయాన్ని పర్యవేక్షించాలని జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డిని సీఎం ఆదేశించారు. సీఎం కేసీఆర్ స్పందించిన తీరుపై సదస్సుకు హాజరైన ప్రతినిధులు పెద్ద ఎత్తున చప్పట్లతో హర్షం ప్రకటించారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.40 గంటలకు

సూర్యాస్తమయం: 6.18 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం ఏకాదశి సాయంత్రం 5.31 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఆరుద్ర ఉదయం 8.03 వరకు, తదుపరి పునర్వసు, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 8.07 నుంచి 9.34 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.06 నుంచి 12.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.12 నుంచి 3.58 వరకు, వర్జ్యం: రాత్రి 7.02 నుంచి 8.38 వరకు.

లోకం పోకడ



ప్రతి గ్రామం అంకాపూర్ కావాలి

- ప్రతీ నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్, బీజేపీ విఫలం
- కేంద్రం నుంచి మాటలే తప్ప చేతల్లేవు
- 75% సబ్సిడీతో రైతులకు టార్పాలిన్లు సరఫరా
- ప్రాంతీయ అవగాహన సదస్సులో సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. దీనికి మార్గదర్శకాలను రూపొందించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసినట్లు చెప్పారు. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల ఆధ్వర్యంలో రైతులకు 75% సబ్సిడీపై పట్టాలు (టార్పాలిన్లు) అందిస్తామని తెలిపారు. ఆదివారం రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ మైదానంలో జరిగిన రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సు సందర్భంగా రైతుల నుంచి వచ్చిన సలహాలు, సూచనలపై సీఎం మాట్లాడుతూ, రైతు సమన్వయ సమితులు ఓట్ల కోసం పెట్టినవి కాదని స్పష్టంచేశారు. సమన్వయ సమితులు రద్దవుతాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. కేసీఆర్ సీఎంగా రద్దయితేనే అవీ రద్దవుతాయని అన్నారు. సమన్వయ సమితుల పనితీరుపై విధివిధానాలను అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందిస్తామని చెప్పారు. రైతు సమన్వయ సమితులు రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అంకాపూర్‌గా మార్చాలని పిలుపునిచ్చారు. దేశంలోని రైతులకు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఎన్నో మాట్లాడినా ఏమీ చేయలేదని విమర్శించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లామని, లేఖలు రాశామని చెప్పారు. మరోసారి అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించనున్నట్లు చెప్పారు. కేంద్రం నుంచి మాటలు తప్ప చేతలు లేవన్న సీఎం.. ఇందులో మతలబేంటో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, న్యాయం చేయాలని పార్లమెంటులో టీఆర్‌ఎస్ ఎంపీలు కొట్లాడుతారని చెప్పారు. రైతుల సమస్యలను పరిష్కరించుకోవడంపై ప్రాంతీయ పార్టీలతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే దేశ వ్యాప్తంగా ఐక్యత ఏర్పాటు కానుందన్నారు.

సోలార్ ఫెన్సింగ్‌కు సబ్సిడీ

వ్యవసాయానికి ఉపాధిహామీని అనుసంధానం చేయాలని కేంద్రాన్ని కోరామని సీఎం కేసీఆర్ తెలిపారు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సోలర్ ఫెన్సింగ్‌కు సబ్సిడీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. గిట్టుబాటు ధర రావాలనేది రైతుల చేతుల్లోనే ఉందని చెప్పారు. అధికారులు సూచించిన విధంగా పంటలు సాగు చేసి, మార్కెట్‌కు నియంత్రణ పద్ధతిలో ధాన్యాన్ని తీసుకురావాలని రైతులకు సీఎం సూచించారు. పంట చేతికి రాకముందే రైతు సమన్వయ సమితి ప్రతినిధులు, మార్కెట్ అధికారులు స్థానిక వ్యాపారులతో మాట్లాడి, గిట్టుబాటు ధర నిర్ణయించాలన్నారు. గిట్టుబాటు ధరకు వ్యాపారులు ముందుకు రాకుంటే అదే ధరకు రాష్ట్ర రైతు సమితి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌కు సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానశాఖ అధికారులు సన్మానించారు. రంగారెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి ప్రతినిధులు నాగలిని కేసీఆర్‌కు బహూకరించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేందర్‌రెడ్డి, ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్ , సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు, ఎంపీలు జితేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, డీ శ్రీనివాస్, కే కేశవరావు, విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్, సీఎం రాజకీయ సలహాదారులు శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గొంగిడి సునీత, శ్రీనివాస్‌రెడ్డి, రాములునాయక్, శంభీపూర్ రాజు, బోడకుంటి వెంకటేశ్వర్లు, కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రావు, వీ శ్రీనివాస్‌గౌడ్, బాబుమోహన్, రామ్మోహన్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, తీగల కృష్ణారెడ్డి, ఎం కిషన్‌రెడ్డి, కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, వీరేశం, అంజయ్యయాదవ్, రవీంద్రనాయక్, సుధీర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, యాదయ్య, కిషన్‌రావు, వివిధ జిల్లాలు, మండలాలకు చెందిన రైతు సమన్వయ సమితి సభ్యులు, మార్కెట్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, డీసీసీబీ చైర్మన్లు పాల్గొన్నారు.



ఆదివారం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రైతు సమన్వయ సమితుల అవగాహన సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు హారతి పడుతున్న మహిళా ప్రతినిధులు. చిత్రంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ఉన్నారు.

యువ రైతు నుంచి రాష్ట్ర రైతు సమన్వయకర్తగా..

వ్యవసాయ మార్కెట్, మదర్ డెయిరీ సహా పలు వ్యవసాయ సంబంధిత పదవుల నిర్వహణ

నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రైతు బిడ్డ.. రైతు కష్టాలు తెలిసిన రైతు.. తనకు వచ్చిన పదవులన్నింటినీ రైతు సమస్యల పరిష్కారానికి, పోరాటాలకు ఉపయోగించే నేత! రాష్ట్ర రైతు సమన్వయ సమితికి ప్రథమ చైర్మన్‌గా ఎన్నికైన గుత్తా సుఖేందర్‌రెడ్డి గురించి మూడు ముక్కల్లో చెప్పుకోవాలంటే ఇది సరిపోతుంది! రాజకీయ నాయకుడైనా, నిత్యం వ్యవసాయ అంశాలపై ఆలోచించడం గుత్తా ప్రత్యేకత! దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. ఆయనకు రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయ కుటుంబం నేపథ్యమున్న గుత్తా.. రైతు సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. విద్యార్థి దశలోనే రాజకీయాలపట్ల ఆకర్షితుడైన గుత్తా.. నాగార్జునసాగర్ భగవాన్‌దాస్ సైన్స్ కళాశాలలో 1971-72లో బీఎస్సీ చదువుతున్న సమయంలో విద్యార్థి సంఘానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తితో 1974లో ఇందిరా కాంగ్రెస్‌లో చేరారు.

రైతు కష్టాలు తెలిసిన వ్యక్తిగా..

మొదటి నుంచి రైతుల సమస్యలపై పోరాటం చేసిన గుత్తా.. మారుమూల ప్రాంతాల్లో పర్యటించి రైతులకు న్యాయం జరిగేలా అవిరళ కృషి సల్పారు. 1984లో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా, 1985లో చైర్మన్‌గా పనిచేశారు. 1992లో సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1992 నుంచి 1999 వరకు ఉర్కపల్లి పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా పనిచేశారు. 1992లో నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘానికి చైర్మన్‌గా, 1995-98 మధ్యకాలంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. 1998లో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు డైరెక్టర్‌గా నామినేట్ అయ్యారు.

గుత్తా రాజకీయ ప్రస్థానమిది

1981లో నల్లగొండ జిల్లా చిట్యాలలోని ఉర్కపల్లి గ్రామ వార్డుసభ్యుడిగా ఎన్నికయ్యారు. 1995లో దేవరకొండ జెడ్పీటీసీగా గెలిచారు. 1999, 2009లలో నల్లగొండ నుంచి ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం అక్కడి నుంచే లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు కృషి

సీఎం కేసీఆర్‌కు గుత్తా సుఖేందర్‌రెడ్డి కృతజ్ఞతలు



రాష్ట్ర రైతు సమన్వయ సమితి మొట్టమొదటి చైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతానని చెప్పారు. తన బాధ్యతను సక్రమంగా నిర్వహించి ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని గుత్తా చెప్పారు.

ఇది రైతుబంధు ప్రభుత్వం

ప్రభుత్వ ఆలోచనావిధానాన్ని గ్రామాల్లో వివరిస్తాం
సీఎం కేసీఆర్ చెప్పినట్టు లాభసాటి వ్యవసాయం చేస్తాం
ఇజ్రాయెల్ తరహా సాగుపై దృష్టి పెడుతాం
ప్రాంతీయ అవగాహన సదస్సులో రైతు ప్రతినిధుల మనోగతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సుకు హాజరైన రైతు ప్రతినిధులు ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో వారి మనోగతాన్ని పంచుకున్నారు. ఇవీ వివరాలు..

రైతు సంక్షేమానికే సమన్వయ సమితులు



నల్లగొండ జిల్లాలో రైతు సమన్వయ సమితి ఆధ్వర్యంలో 31 మండలాల ప్రతినిధులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. నేడు సీఎం కేసీఆర్ మరింత వివరంగా ఈ ప్రాంతీయ అవగాహన సదస్సులో చెప్పారు. రైతులకు శాస్త్ర, సాంకేతికరంగాల్లో అవగాహన కల్పించడంతోపాటు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రైతుల కోసం మరింత చురుకుగా పని చేస్తం.

- ఇస్లావత్ రాంచందర్ నాయక్,
నల్లగొండ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు

ఇజ్రాయెల్ తరహా వ్యవసాయం అమోఘం



రైతులకు వ్యవసాయాన్ని వరంగా చేసే బాధ్యత ఇప్పుడు రైతు సమన్వయ సమితులపై పెట్టారు సీఎం కేసీఆర్. ఇజ్రాయెల్ తరహా వ్యవసాయాన్ని రాష్ట్రంలో అమలుచేసేందుకు సీఎం చేస్తున్న ప్రయత్నం అమోఘం. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి పంటలు సాగు చేయాలని ఉమ్మడిగా చర్చించుకోవడం చాలా మంచి కార్యక్రమం. మద్దతు ధర అంశంలో సీఎం రైతులకు వరాలు కురిపించారు.

- కే వెంకట్రాములు,
జోగుళాంబ గద్వాల జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు

రైతుల కోసం ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టే ఏకైక ప్రభుత్వం



రైతుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ ప్రకటించిన ఏకైక సీఎం కేసీఆర్. గతంలో రైతుల పేరుతో రాజకీయాలు చేసిన ప్రభుత్వాలను చూసినం. కానీ.. రైతులను రాజుగా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నది టీఆర్ఎస్ ప్రభుత్వమే. 60 ఏండ్లల్లో కనీసం రైతును ఒక్కటిగా చేసిన నాయకుడెవ్వరినీ చూడలేదు. కానీ రైతు సమన్వయ సమితుల ఏర్పాటును ప్రకటించి ఏడాదిలోనే అందరినీ ఏకం చేసింది సీఎం కేసీఆర్ మాత్రమే. ప్రభుత్వ ఆలోచనా విధానాన్ని గ్రామాల్లో వివరిస్తాం.

- తనగల సీతారాంరెడ్డి, రైతు సమన్వయ సమితి, అలంపూర్

రైతులకు ఇబ్బందులు పోతయి



కరంటు కాడ్నుంచి మొదలు విత్తనాలు, ఎరువులు, నీళ్లు, దిగుబడి తర్వాత అమ్ముకోవడం దాకా రైతులకు చాలా ఇబ్బందులుండేవి. కానీ.. రెండేండ్ల నుంచి కొంత తగ్గాయి. ఇది రైతు బంధు ప్రభుత్వం. ఇప్పుడు సమన్వయ సమితులతో రైతుల ఇబ్బందులు తీర్చేందుకు సీఎం కేసీఆర్ మంచి ప్లాన్ వేశారు. మా సమస్యలు మేమే పరిష్కరించుకునే మార్గాన్ని చూపించారు. ఇక నుంచి రైతులకు తిప్పలుండవు. భూమి ఉన్నోళ్లంతా వ్యవసాయంచేయాలనే ఆలోచనకు వస్తున్నారు.

- శ్రీనివాసులు, రైతు సమన్వయ సమితి, జనగామ జిల్లా

గ్రామగ్రామాన వివరిస్తం



రైతుల కోసం చేస్తున్న పనులన్నీ ముఖ్యమంత్రి కేసీఆర్ వివరించారు. ఇవన్నీ చేస్తే రైతులకు ఇబ్బందులు పోతాయి. మేం ఇప్పుడు పల్లెపల్లెనా రైతులకు అవగాహన కల్పిస్తాం. ప్రభుత్వం ఇచ్చే పంటల పెట్టుబడులు, ఇతర సాయం పనికిరానోళ్లకు రాదు. వ్యవసాయం చేసే వారికి ఇప్పుడు మంచి రోజులు వచ్చినయి.

- శశికళ, రైతు సమన్వయ సమితి, ఖమ్మం జిల్లా

రైతులకు ఇప్పుడు వ్యవసాయం చేయాలనిపిస్తది



ఎండకు ఎండి, వానకు తడిసి ఎవుసం చేస్తే ఏమీ మిగిలేది కాదు. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి చెప్పిన తీరుగా రైతు సమితులు పనిచేస్తే ఏ తిప్పలూ ఉండవు. ఇప్పుడిప్పుడే బీడు భూములు దున్నుతున్నారు. ముఖ్యమంత్రి ఇయ్యాల ప్రకటించిన తీరు వింటే ఎవ్వరు కూడా సాగును దూరం చేసుకోరు. ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న పనిని మేం కూడా ఊరూరా వివరిస్తం.

లక్ష్మమ్మ, రైతు సమన్వయ సమితి, నల్లగొండ జిల్లా

ఏ పంట వేయాలో మేమే నిర్ణయిస్తం



ఇప్పటి వరకు ఒక్క రైతు పత్తి పంట వేస్తే చుట్టు పక్కల మొత్తం అదే పంట వేస్తున్నారు. కానీ.. రైతు సమన్వయ సమితుల ఆధ్వర్యంలో రైతులు ఏయే పంటలు ఎవ్వరెవ్వరు వేయాలనే విషయాన్ని చర్చించుకునే వెసులుబాటు ప్రభుత్వం మాకు కల్పించింది.

- పొట్లపల్లి నారాయణరావు, రైతు సమన్వయ సమితి, వనపర్తి జిల్లా



రాజేంద్రనగర్‌లో జరిగిన రైతు సమన్వయ సదస్సుకు హాజరైన మహిళా ప్రతినిధులు

కొత్త మండలాల్లో గోదాములు

- రాష్ట్రంలో 22 లక్షల టన్నుల సామర్థ్యంతో గోదాములు
- స్థానిక పంటలకు అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు
- రైతు సమితుల అవగాహన సదస్సులో మంత్రి హరీశ్‌రావు వెల్లడి



రైతు సమితుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రతీ మండలానికి మార్కెటింగ్ గోదాములు, సబ్‌యార్డులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. ఆదివారం రాజేంద్రనగర్‌లో రైతు సమన్వయ సమితుల తొలి ప్రాంతీయ అవగాహన సదస్సులో మినీ మార్కెట్ల ఏర్పాట్ల అంశంపై రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలపై మంత్రి పైవిధంగా స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగు లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు ఉండేవన్నారు. తెలంగాణ ఏర్పడినతర్వాత రూ.1000 కోట్లతో దేశంలో ఏ రాష్ట్రంలో జరుగనివిధంగా 18 లక్షల టన్నుల సామర్థ్యం కల్గిన గోదాముల నిర్మాణం పూర్తయిందని, మరో మూడు లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం 22లక్షల టన్నుల సామర్థ్యం కల్గిన గోదాములు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని మంత్రి చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పత్తి ఎక్కువగా పండిస్తున్నా అక్కడ జిన్నింగ్ మిల్లులు తక్కువగా ఉన్నాయన్నారు. వనపర్తిలో వేరుశనగ అధికంగా పండుతుందని, కానీ అక్కడ ఆయిల్ మిల్లులు లేవని చెప్పారు. స్థానికంగా ఏ పంట ఎక్కువగా పండితే దానికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. రైతు సమన్వయ సమితి సూచన మేరకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. వ్యవసాయాధారిత ప్రాసెసింగ్ యూనిట్లు పెరిగితే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో కొత్తగా 35 మార్కెట్‌యార్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 3500 మినీ మార్కెట్ల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించిందని, దీనికి సంబంధించిన మార్గదర్శకాల రూపకల్పన జరుగుతున్నదని తెలిపారు.

రైతులను ఐక్యం చేయడానికే సమితులు

వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



రైతు సమితుల సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులను ఐక్యం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేసిందని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌లో ఆదివారం నిర్వహించిన రైతు సమన్వయ సమితి ప్రాంతీయ అవగాహన సదస్సులో మంత్రి పోచారం మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాలకు సంఘాలున్నాయని, కానీ దేశానికి అన్నం పెట్టే రైతుకే సంఘం లేదని చెప్పారు. అందువల్లే రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో రైతు సమన్వయ సమితులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. విత్తనం వేసిన దగ్గర నుంచి పండిన పంటను అమ్ముకునే వరకు రైతులకు సమన్వయ సమితుల తోడ్పాటు ఉంటుందన్నారు. పెట్టుబడి పథకం అమలులో ఈ సమితులు కీలకపాత్ర పోషించబోతున్నాయని చెప్పారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే ముఖ్యమంత్రి లక్ష్యమని, అందుకే గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతు సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల వైపు దేశమే కాదు.. యావత్ ప్రపంచం చూస్తున్నదని అన్నారు. తెలంగాణ పథకాలపై కేంద్రం కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నదని గుర్తుచేశారు. 24 గంటల విద్యుత్ సరఫరా, కోటి ఎకరాలకు సాగునీరు వంటి సంక్షేమపథకాల అమలులో దేశానికే ఆదర్శంగా ఉన్నట్టు తెలిపారు. దేశానికి తెలంగాణ దిక్సూచిగా మారిందని మంత్రి వ్యాఖ్యానించారు. వ్యవసాయం వదిలి ఉపాధి కోసం వలస పోయిన రైతులు తిరిగి వచ్చి వ్యవసాయం చేయాలన్నదే సీఎం కేసీఆర్ ఉద్దేశమని పేర్కొన్నారు.

వ్యవసాయానికి సువర్ణ అవకాశం

వ్యవసాయ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి



హైదరాబాద్, నమస్తేతెలంగాణ: దేశవ్యాప్తంగా రైతులంటే చిన్నచూపు ఉందని, దానికి భిన్నంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రాధాన్యం కల్పిస్తున్నారని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి చెప్పారు. రైతు సమన్వయ సమితి ప్రాంతీయ అవగాహన సదస్సులో పార్థసారథి ప్రారంభోపన్యాసం చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో వ్యవసాయానికి సువర్ణ అవకాశం ఏర్పడిందన్నారు. రైతులకు భరోసా లభిస్తుందని చెప్పారు. సీఎం కేసీఆర్ కనుసన్నల్లో రాష్ట్రంలో 24 గంటల విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పెట్టుబడికి రూ.4వేల సాయం, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడం జరుగుతున్నదని ఆయన పేర్కొన్నారు.



ఆదివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, నగర మేయర్ రవీందర్‌సింగ్ తదితరులు


నేడు కరీంనగర్‌లో సీఎం పర్యటన

- రాత్రి కరీంనగర్‌లోని కేసీఆర్ భవన్‌లో బస
- రేపు ఆదిలాబాద్, మంచిర్యాలకు..
- సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు ఈటల, పోచారం

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం కరీంనగర్‌కు రానున్నారు. అంబేద్కర్ స్టేడియంలో రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులో ఆయన ప్రసంగిస్తారు. దీనికి 17 జిల్లాల నుంచి 9,685 మంది మండల, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు, అధికారులు హాజరు కానున్నారు. వీరితోపాటు ప్రజాప్రతినిధులు, ఇతరులు కలిపి 12 వేలమంది వరకు వస్తారని భావించిన అధికారులు, ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు రైతు సమన్వయ సదస్సుకు హాజరవుతారు. సాయంత్రం ఐదు గంటల దాకా రైతులతో కలిసి ఉంటారు. అనంతరం కరీంనగర్ మండలం తీగల గుట్టుపల్లి వద్ద ఉన్న కేసీఆర్‌భవన్‌కు వెళ్లి, రాత్రి అక్కడే బస చేస్తారు. మంగళవారం ఉదయం హెలీకాప్టర్‌లో బయలుదేరి పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూరుకు 10.15కు చేరుకొని, అక్కడ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని చనాఖా, కోర్టా బ్యారేజీకి చేరుకొని పనుల ప్రగతిని సమీక్షిస్తారు. అక్కడి నుంచి 12.10గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకొని, బహిరంగసభలో మాట్లాడుతారు. మధ్యాహ్న భోజన అనంతరం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చేరుకుంటారు. అక్కడ సింగరేణి కార్యక్రమంలో పాల్గొని తిరిగి సాయంత్రం హైదరాబాద్ వెళ్తారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు ఈటల, పోచారం

సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లుచేశారు. కరీంనగర్‌లో నిర్వహించే రైతు సదస్సు ఏర్పాట్లను మంత్రి ఈటల రాజేందర్, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, ఆదిలాబాద్‌లో కలెక్టర్ దివ్య, ఎస్పీ విష్ణు వారియర్‌తో కలిసి మంత్రి జోగు రామన్న దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. సాయంత్రం వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.



నైతికత కూడా డబ్బుపైనే ఆధారపడి ఉంటున్నది. పేదలు నీతి కలిగిఉండే అర్హతను కోల్పోతున్నారు. అందుకే వారు మతాన్ని మోస్తున్నారు.

-కుష్వంత్ సింగ్

రాత్రి రంపం కింద



నిజంగా
చీకటిలో తనని తాను
పారేసుకోని మనిషి ఉంటాడా
వెన్నెల పొరల కింద
జ్ఞాపకాలను ఆరేసుకోని మనసు
ఉంటుందా...

చీకటి గాజులా పగిలి
గాయపడని పాదం ఉంటుందా...
గాయపడిన పాదాలతో
చీకటి యోజనాలు నడవని
చరణం దారులను ముద్దాడుతుందా...

పగటి నుండి
కొంత వేదనను వెంట తెచ్చుకుంటావేమో
రాత్రంతా హృదయం
వొకటే సలపరం
తొలి జాము దాటింది
నడినెత్తికెక్కన గోరుకొయ్యలు
మలిజాము

కాలి బాటలు మాగన్నులో కూరుకు పోయాయి
రాత్రి రంపంకింద పొట్టిగా రాలుతూ ఒకడు
కనుల గూటినుండి
ఎగిరిపోయింది నిదుర పిట్ట

ఒంటరిగా
తానెక్కడో రేయి జాతరలో
తప్పిపోయాడు

వేణువై తనను తాను ఊదుకుంటూ
తన అడుగు జాడలు
తానే పసిగట్టే ప్రయత్నంలో....

– గరికపాటి,మణీందర్ 99483 26270

బీసీ కవిత్వానికి ఆహ్వానం

మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనలు, బీసీ తాత్విక చింతనతో కులవృత్తుల చరిత్ర, సామాజికాంశాల నేపథ్యంతో బీసీ కవుల నుంచి కవిత్వాన్ని ఆహ్వానిస్తున్నాం. కవులు తమ కవిత్వాన్ని 2018 మార్చి 25 లోగా పంపించాలి. చిరునామా: జూలూరు గౌరీశంకర్, ఎం.ఎస్.కె. టవర్స్, ప్లాట్ నెంబర్:410, స్ట్రీట్. నెం.11, హిమాయత్‌నగర్-026.

-జూలూరు గౌరీశంకర్, 9059967525

'నది కాలం అతడు' ఆవిష్కరణ సభ

రవూఫ్ రచించిన ఇస్మాయిల్ ఇతివృత్త కవితా సంపుటి 'నది కాలం అతడు' ఆవిష్కరణ సభ 2018 మార్చి 4న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో జరుగుతుంది. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షతన జరుగు సభలో వాడ్రేవు చినవీరభద్రుడు, డాక్టర్ శిఖామణి, జి. లక్ష్మీనరసయ్య, శిలాలోహిత, కవి యాకూబ్ పాల్గొంటారు. పుస్తకాన్ని కె.శివారెడ్డి ఆవిష్కరిస్తారు.

ఉగాది రచనల పోటీ

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి ఆధ్వర్యంలో శ్రీ విళంబ నామసంవత్సర ఉగాది (మార్చి 18) సందర్భంగా రచనల పోటీ నిర్వహిస్తున్నాం. ఉత్తర అమెరికా, ఇతర విదేశాల తెలు గు రచయితలు ఈ పోటీలో పాల్గొనవచ్చు. దీనిలో 'ఉత్తమ కథానిక', 'ఉత్తమ కవిత' పోటీలకు రచనలు పంపించగలరని మనవి. అలాగే గతంలో ప్రచురణకు నోచుకోని కొత్త రచయితలు, వారి రచనలనూ ప్రచురించదలిచాం. ఈ విభాగంలో 'నా మొట్టమొదటి కథ', 'నా మొట్టమొదటి కవిత' ఉంటాయి. రచనలు 2018 మార్చి5 తేదీలోగా పంపాలి. sairacha@gmail.com & vangurifoundation@gmail.comకు రచనలను పీడీఎఫ్, యూనికోడ్ రూపంలో కానీ పంపించవచ్చు.

–వంగూరి చిట్టెన్ రాజు
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా,
హ్యూస్టన్& హైదరాబాద్, ఫోన్:8325949054



ఎవ్వరు నేను ?

ఎవ్వరు నేను ఈ విశాల విశ్వంబున
ఏమిటి నా భూమిక ఈ భువి పైన

నేను అన్నది ఏమి , నేను అను నాది ఏమి
అణువంటి నా ఉనికే మహోన్నతమనుకున్నా
సమస్త జగత్తే నాలో ఇమిడి ఉంది అని గ్రహించకున్నా

కళ్ళు తెరచి కలలే కంటే కవినేమో ననుకున్నా
విశ్వం గురించి ఓ విశ్లేషణే రాసేసి తాత్వికుడనేమో ననుకున్నా
మిత్రులతో మందేసి మాంచి రసికుడనేమో ననుకున్నా
ప్రశ్నిస్తూ , ఛేదిస్తూ , జీవిత రహస్యాలని సాధించాలని ఉవ్విళ్ళూరుతున్న ఓ సాధువునేమో ననుకున్నా
ఇన్నీ ఉన్న నన్ను నేను పరిపూర్ణుడననుకున్నా
కాని అస్సలైన నేను ఎక్కడున్నానో లాంతరేసి వెదికినా దొరకకున్నా

నా తల్లి కనుల్లో నాకై ఉన్న అనంతమైన ప్రేమను చూసి కొడుకే నా భాధ్యతనుకున్నా
మరుక్షణం నా బిడ్డ నన్ను వాటేసుకుని నాన్నా అంటే తండ్రిని కాక నేను మరెవ్వరిననుకున్నా

సమాజంలో ఇమడాలనే ఆరాటంలో నేను కాని నన్ను సృష్టించుకున్నా
నాకెవరో తెలియని నటుడి వేషం వేసా
సమాజంలో సంసారంలో నా పాత్రలో ఇమిడిపోయాననుకున్నా
నాకై ఎవరో వ్రాసిన సంభాషణలే పలికా
నా అస్సలును ఈ నకలుతో తొక్కిపెట్టా
జీవితంతో రమించానని పరిభ్రమించా
కానీ ఆ జీవితమే నాతో పరిహాసమాడుతోందని పసిగట్టలేకపోయా

నా పుట్టుక నా నిర్ణయాతీతం, నా మరణం నా కోరికకతీతం
పుట్టిన మరుక్షణం ఏడుపుకు, మరణానికి ఒక్క క్షణం ముందు నిట్టూర్పుకు
నడుమ ఉన్న ఆశా నిస్పృహలు, సుఖ దుఃఖాలు, భయభ్రాంతుల పయనమే కదా జీవితమంటే

ఇంతే అనుకుంటే నిజంగా బ్రతుకింతే
ఎంతో అనుకుంటే నిస్సందేహంగా బ్రతుకెంతో
ఇంతకు, అంతకు, ఎంతకు అని నిర్ణయించ నేనెవ్వరిని , నా ఉనికెంతటిది
ప్రకృతి ఆడు చదరంగంలో ఓ చిన్న పావుని
కానీ ఆ ఆటలో రాజైనా , మంత్రైనా, చిన్ని సైనికుడైనా
ఆట ముగిసాక పోవలసింది ఒకే చెక్క డబ్బాలోకి
మళ్ళీ మరో చదరంగపు ఆట మొదలయ్యేవరకు

పెదవి దాటిన భావం మాట అవుతుంది
మాటకు కోపం తోడవుతే ఒక తూటా అవుతుంది , అది మనసుకు మాయని గాయం చేస్తుంది
మాటకు భావుకత తోడవుతే ఒక పాట అవుతుంది, అది సెలయేరల్లే ఆహ్లాదపరుస్తుంది

పెదవి దాటలేని ఆలోచనలు మెదడులో నిక్షిప్తమవుతాయ్
రాత్రి నిద్రలో కలలవుతాయ్
మాటల తూటాలైనా, కలల కలవరింపులైనా వాటికి నీ ఆలోచనలే బాధ్యులు
కలైనా, కవిత్వమైనా నీ ఆలోచనలు నిను వీడవు
మంచైనా, చెడైనా నీ ఆలోచనల పర్యవసానం నీవనుభవించక తప్పదు
మాటలకందని భావం, కన్నుల కందని కల ఏదీ కాదు కాకతాళీయం
అవి నిన్ను వెంటాడుతాయి.. మళ్ళీ ఎప్పుడో నిన్ను కలుస్తాయి

పుట్టాం, పెరిగాం, పుట్టించాం, పెంచాం, ఆస్తులే పంచాం, చివరిగా చచ్చాం
ఇదేనా బ్రతుకంటే
మనదీ ఒక బ్రతుకేనా, సందులలో పందులవలె అని ఓ మహాకవి అన్నట్టు

ఈ జగమంతా నాలోని భాగమే, నేనూ ఈ జగత్తులో ఓ చిన్ని భాగమే
నిన్న అనేది ఓ జ్ఞ్యాపకం , రేపు అనేది ఓ ఆలోచన
జ్ఞాపకాల కుంగుబాటులో, ఆలోచనల ఆందోళనతో నేడు అనే నిజాన్ని విస్మరిద్దామా
ప్రతి రోజూ చస్తూ బ్రతుకుదామా

మనుష్యులందరి మనస్సు మల్లెపువ్వల్లె తెల్లగా వుండాలని కాంక్షించా
నా వారి హృదయాలు పిండారబోసినట్టున్న వెన్నెలల్లే వెలిగిపోవాలని ఆశించా
భరించే వాడే భర్త అయినప్పుడు, భారమెంతైనా భార్య అలవోక అవ్వకూడదెందుకు
పిండాల నాడే పంపకాలడగ గలిగే పిల్లలు కేవలం నీ కీర్తికే వారసులవ్వకూడదెందుకు
ధార్మిక జీవితమే నీ విధానమైనప్పుడు సంసార సాగరాన్ని ఈద భయమెందుకు
నీ తమో గుణం, తత్వ గుణమయ్యేందుకే నీ ప్రయాణం అవ్వకూడదెందుకు

నా బిడ్డా, నా సంసారం అనుకున్నప్పుడే నాకీ పరిమితులు
ఈ జగమంతా నాదే, ఈ జనులంతా నా వారే అనుకున్నప్పుడు
నాకింకా ఎక్కడి ఎల్లలు, ఎక్కడి పరిధులు
ఈర్ష్యాద్వేషాలకు చోటెక్కడిది, కోపతాపాలకు తావెక్కడిది

భావాలకు, బంధాలకు బందీనై బ్రతుకు బండినే లాగించేస్తూ అదే బ్రహ్మానందమనుకోనా
తామరాకుపై నీటిబొట్టల్లే, తాకీ తాకక జీవితంలో తేలిపోతూ స్వేచ్ఛావిహంగమై ఎగిరిపోతూ ఓ తాత్వికుడనైపోనా

పరిధులన్నీ పటాపంచలైపోయేలా, దిక్కులన్నీ పిక్కటిల్లిపోయేలా
ఓ కొత్త నన్ను నేను ఆవిష్కరించుకోనా
నా జీవిత గమ్యం చేరుకోనా !!!

–పవన్ దొంతినేని

కాలంతో కవిత్వ సంగమం

తెలుగు సమాజంలో పుస్తకాలు చదివే సంస్కృతి ఎన్నో దశలను చూసుకుంటూ వచ్చింది. వచనమూ, కవిత్వమూ వేర్వేరు కాలాల్లో వాటి ఆధిక్యాన్ని చాటుకుంటూ వచ్చాయి. నవలలూ, కథలు పోటీపడి చదువుతున్న రోజుల్లో కవిత్వ సంపుటాలు ఒక మోస్తరుగా వచ్చేవి. అది కూడా కవి తన డబ్బులతో అచ్చేసి ఉచితంగా పంచిపెడితే వాటిని చదువటం కూడా ఇబ్బందేమో అనే రోజులు. కొన్ని వ్యక్తిత్వ వికాస పుస్తకాలు ఒక ఊపు ఊపిన రోజులు. పోటీ పరీక్షల పుస్తకాలు తప్ప మరోటి మార్కెట్‌కు అవసరంలేదేమో అనిపించిన రోజులూ వున్నాయి. తీరా 'స్మార్ట్ ఫోన్'లు చేతికొచ్చాక, ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక 'బుక్ కల్చర్' ముగిసిపోయి, అంతా 'లుక్ కల్చర్' అనిపించింది. ఇక 'అటు నవలలూ కథలూ నిలువవు, ఇటు కవిత్వమూ మిగలదేమో' అని అనుకుంటున్న సమయంలో, ఇక యాభై అరువై ఏండ్ల వయసు పైబడిన వారి ప్రక్రియగానే కవిత్వం మిగిలిపోతుందని పెదవి విరుస్తున్న కాలంలో.. 'ఎక్కడయితే కవిత్వం, అక్షరం చదువరితనం పోయిందనుకున్నామో అక్కడే కవిత్వాన్ని వెతుక్కోవాలి' అనే పట్టుదలతో ప్రారంభించిన అంతర్జాల సమూహం కవి సంగమం.

'ఫేస్‌బుక్' వేదికగా ప్రారంభమైనా జీవితాల్లో ఒకభాగమైయ్యింది. బయటి ప్రపంచంలాగానే 'సోషల్ మీడియా' మరొక వర్చువల్ ప్రపంచమై జనాలు జీవించటం మొదలైన రోజుల్లో 'మ్యాక్ బుక్'లు, 'ట్యాబ్'లు, నోట్‌బుక్‌లే కానీ అచ్చుపుస్తకాలు హస్తభూషణంగా ఇష్టపడని రోజుల్లో అదే సోషల్ మీడియాలోని అడ్వాంటేజీలను కవిత్వాభిలాషను పెంచటం ఉద్దేశంగా కేవలం కవిత్వం కోసమే కవుల సంగమమై 2012 ఫిబ్రవరి 9న ఏర్పడింది 'కవి సంగమం'. చేతిలోవున్న ఫోన్ తోనో, ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్‌పై కవిత్వాన్ని చదువుకోగలుగటం పాఠకుడికి జరిగే మేలైతే, కవికి ఈ వేదిక మరిన్ని తక్షణ ఉపయోగాలను కలిగించింది. పబ్లిష్ చేసుకోవడానికి అనేక అడ్డంకులను దాటుకోవలసిన ప్రయాస లేకుండా తక్షణమే సెల్ఫ్ పబ్లిష్ చేసుకోవటం ఒక ఉపయోగమైతే, అలా అచ్చువేసుకున్న అక్షరాలను అనేకమంది సీనియర్ కవులు, అక్షర ప్రేమికులకు దేశాంతరాల దూరమైనా వెన్వెంటనే చేరవేయగలగటం వారి నుంచి అభిప్రాయాలనూ, సూచనలనూ తీసుకోవలగటం సాధ్యమైంది. దీనివల్ల పెన్నును పక్కన పారేసిన పాత తరం కవులెందరో ఉత్సాహంగా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. కొత్తగా అడుగులు వేస్తున్న నవతరం వారి ఆసరా తీసుకుంటూనే తమ వేగంలోని జవసత్వాలేమిటో పంచుకోగలిగారు.

కవుల మధ్య పరిచయాలకు వారధిగా.. 'కవిత్వం కావాలి.. కవిత్వం...' అంటూ కేవలం సోషల్ మీడియా వర్చువల్ ప్రపంచంలో ఆగిపోకుండా 2012 ఆగస్టు 15న హైదరాబాద్ ఇఫ్లూ యూనివర్సిటీలో తొలి సమావేశం ఏర్పటయ్యింది. అప్పటికే పుస్తకాలు ప్రచురించుకున్నవారు, అప్పుడప్పు డూ పత్రికలలో రాసేవారూ, కేవలం కవిసంగమం నుంచే కవులుగా ఎదిగినవారు అందరూ తమతమ కవితలు వినిపించారు. ఈ కార్యక్రమంలో బెంగాలీ కవి సుబోద్ సర్కార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కవిసంగమం కాన్సెప్ట్‌ను చూసి ముచ్చటపడ్డారు. కొత్తకవుల కవిత్వంతో ఉక్కిరిబిక్కిరయ్యానని అన్నారు. అభిప్రాయాలను పంచుకున్నారు. ఇనుమడించిన ఉత్సాహంతో కవిసంగమం మిత్రుల కవిత్వాన్ని పట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. బహుశా ఆ తర్వాత గ్రూపులోనూ ఒకరంటే ఒకరికున్న బిడియం స్థానే చనువు పెరిగింది. కొంచెం వేడిగా నైనా వాదించుకునే బలం పుంజుకుంది. కవిత్వం రాయటం, కవిత్వంపై చర్చించటం మరింత పెరిగింది. 'కవిత్వం కావాలి కవిత్వం..' అంటూ జీవితంతో కవిత్వపు సున్నిత కోణానికి ఒక ఆలింగనాన్ని ఇచ్చింది.

మూడుతరాల వారధిగా నెలనెలా కవిత్వ వేదిక

కవితలూ, కామెంట్లేనా కవిసంగమం చేసేది? అక్కడితో ఆగిపోతే ఇప్పుడు చెప్పుకోవలసినంత ప్రత్యేకతేం కాకపోయేది. కవి అక్షరాలుగా రాయగలుగటమే కాదు, తనగొంతుతో రాసినది జనానికి వినిపించే సత్తా పెరుగాలనే తపనతో సాహిత్య సంబురాల కార్యక్రమానికి కొత్తరూపం ఏర్పడింది. కవుల గొంతులు వినిపించేందుకూ, కవిత్వమై ఓసారి యంత్రాన్ని గడిపేందుకూ ఒక కొత్తరూపంలో నెలనెలా నిర్వహించే కార్యక్రమం కూడా రూపొందించారు. ఇందులో ఒక సీనియర్ కవి, ఒక మహిళ, మరో ఇద్దరు ముగ్గురు నవతరం కవులతో వున్న ఫార్మాట్ తమ కవితలను వినిపించడంతో అచ్చంగా ఒక సాయంత్రం గడుపుతారు. మళ్లీ ఈ కార్యక్రమం ఫోటోలూ వీడియోలూ అన్నీ గ్రూపులోకి అందరికీ అందుబాటులోకి వచ్చేస్తాయి. వేరు వేరు ఊర్లలో ఉండి కార్యక్రమానికి హాజరుకాలేని వారికి ఇవి ప్రత్యక్షంగా చూపిస్తాయి. **'కవిసంగమ'** బ్లాగులోకి, ముఖ్య సమాచారం 'వికీపీడియా' పేజీలోకి చేరుతుంది. వీరే కాకుండా ప్రవాస భారతీయ కవులతో పాటు, తమిళ కవి చేరన్ రుద్రమూర్తి, సుబోధ్ సర్కార్, రజతి సల్మ, టెంజిన్ సుంద్యూ, శీతాంషు యశశ్చంద్ర, లక్ష్మణ్ దూబే, సంతోష్ అలెక్స్, రతి సక్సేనా, మమతా సాగర్, భావన సోమయ్య వంటి ఇతర రాష్ట్రాల ఇతర భాషల కవులనూ సైతం తెలుగు కవిత్వానికి పరిచయం చేసింది. అనువాద సౌరభాన్ని వెదజల్లుతూ తెలుగు కవిత్వాన్ని ఆంగ్లంలోకి అటు నుంచి ఇతర భాషల్లోకి పంపటానికి ఇప్పుడిప్పుడే దారులు ఏర్పడుతున్నాయి. మరెక్కడో ఏదో భాషలో వున్న కవిత్వాన్ని కనీసం ఆంగ్లవారధిని దాటించుకుంటూనైనా తెలుగు ఊటలను పరిపుష్టం చేసేందుకు జత చేసుకుంటూ ఉండాలి. ఈ ఆదాన ప్రదానాలకు ఒక మాధ్యమ వేదికగా ఉండేందుకు కూడా కవిసంగమం అడుగులు వేస్తున్నది.

నిరంతరం మెరుగుదల, నిరంతరం ఎదుగుదల

గ్రూపుల్లో కవిత్వం అంటే తోచింది రాసేస్తారు, శ్రద్ధగా రాయరు అనే అపవాదులున్నాయి. ఈరోజు ఇక్కడ రాసిన వారు రేపెక్కడ రాస్తారో అనే సందిగ్ధాలు. రాస్తున్న వారి ధోరణులలో ఏ ఇద్దరి పాఠశాల ఒకటి కాకపోవటం. ఇలా అనేక అపనమ్మకాలు అనేక వాదోపవాదాలు, గ్రూపుల్లో గ్రూపిజాలు. వీటిమధ్య కవిత్వం మరింత తాజా చిగుర్లు తొడుగటం కోసం కవిసంగమం తమ స్వీయరాజ్యాంగంలో తమంత తాము కొన్ని ప్రత్యేక నిబంధనలు తయారు చేసుకున్నది. దానివల్లనే 'మఘలో వచ్చి పుబ్బలో పోయినట్లు ' కాకుండా నిలకడగా ఇన్నేండ్లు అదే నిలకడను కొనసాగిస్తోంది. కవిత్వమంటే కవిత్వమూ దానిపై మాటలూ మాత్రమేనంటూ బొమ్మలు సైతం పోస్టు చేయకపోవటం, ఒక కవి ఒకరోజుకు ఒక కవిత మాత్రమే గరిష్టంగా పోస్టుచేసేందుకు మాత్రమే అవకాశం, కవిత్వం చదువటమో రాయడమో ఇష్టం వున్నవారు మాత్రమే గ్రూపులో ఉంచడం వం టివాటితో పాటు మరో ముఖ్యమైన పని పిన్ పోస్టులను పాఠ్యాంశాలుగా మార్చడం లాంటివి ఉన్నాయి.

గ్రూపులో ఒక పోస్టును కావలసినంత సేపు పైనే వుండేలా పిన్ చేసే సదుపాయం ఉన్నది అలాచేసే పిన్ పోస్టు వారంలో ఒక్కోరోజు ఒక్కోటి చొప్పున శీర్షికలుగా కేటాయించారు. 'ఈనాటి కవిత' పేరుతో యం. నారాయణ శర్మ ఒక్కో కవితను విశ్లేషించడంతో పాటు విశ్లేషణ చేసే పద్ధతిని తెలియజేస్తూనే కవిత్వాన్ని మరింత మెరుగు చేసుకునే పద్ధతి నేర్పితే, బొల్లోజు బాబా సరాసరి కవిత్వపు పనిముట్లగురించి వివరిస్తారు. నౌదూరి మూర్తి వందవారాలపాటు అంతర్జాతీయ కవిత్వాన్ని పరిచయం చేస్తూ వందలాది అంతర్జాతీయ కవుల్ని పరిచయం చేశారు. వాహెద్ ఉర్దూ కవిత్వ సౌరభాలను పరిచయం చేస్తే, సీవీ సురేష్ ఆంగ్లానువాదంతో పాటు కవి లోతుపాతులను పరిచయం చేస్తారు. సత్యశ్రీనివాస్ మట్టిగూడు అంటూ పర్యావరణ కవిత్వాలాపన చేశారు. కట్టా శ్రీనివాస్ టెక్ సంగంలో టెక్నికల్ విషయాలనందిస్తాడు. జి. లక్ష్మీనరసయ్య, అఫ్సర్, ఎన్. వేణుగోపాల్, నారాయణస్వామి వెంకటాయోగి. కెక్యూబ్ వర్మ, హెచ్చార్కే, వంశీకృష్ణ, పరేష్ దోషి, అరుణ గోగులమండ, చినవీరభద్రుడు, శారద శివపురపు, సివి శారద ఇలా ఎందరో కాలమిస్టులు కవిత్వ తత్వబోధనలో పాలుపంచుకున్నారు. ఇలా ఒక్కోరోజు ఒక్కో పిన్ పోస్టు అనేక విశేషాలను ఫేస్‌బుక్ గ్రూప్ పాఠకులకు అందిస్తున్నది.

పచ్చని చెట్టుగా కవిత్వ పిట్టలకు ఆలవాలం

భిన్నధోరణులు విభిన్నవాదనలు వేర్వేరు తాత్విక భూమికలను వ్యక్తపరిచే వేదికలో అంశాలను వ్యక్తిగతంగా తీసుకోకుండా సమన్వయం చేసుకుంటూ రావడం, కవులకు అవసరమైన ఫీడింగ్, సమాచారాన్ని మార్గదర్శక సూత్రాలనూ అందుబాటులోకి తీసురావడం కవిసంగమాన్ని ఒక పచ్చని చెట్టుగా నిలిపి గ్రూపు ఆశయం, లక్ష్యం అయిన '**పచ్చని చెట్టువు నీవైతే పిట్టలు వాటంతట అవే వాలేను**' అన్న సూత్రాన్ని నిజం చేసింది. అహంకారాలు ప్రేమలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటుంటే, మమకారాలూ, నైపుణ్యాలూ అలసత్వపు లోయల్లోంచి పైపైకి చేరుకుంటున్నాయి.

జయహో ఒక నినాదమై అభినందనలకు తమదైన ముద్రలో జయహో గా చెప్పటం కవిసంగమం పద్ధతిగా రూపుదిద్దుకుంది. కవిత్వ శీర్షికకు ముందు వెనకా రెండు నిలువు గీతలు లాంటి విధానాలు ఇప్పుడు 'నీదీ నాదీ ఒకే కథ' వంటి సినిమా పోస్టర్లపై సైతం అనుసరించేలా మారాయి. లెర్న్ పొయెట్రీ, రైట్ పొయెట్రీ, రీడ్ పోయెట్రీ, ఫీల్ పొయెట్రీ.. ఇదీ ప్రయాణ మార్గం.

కవిత్వం ఏం చేస్తుంది అనేదానికి జీవితంలో ఒక మృదువైన కోణాన్ని ఏర్పరచుకునేందుకు ఎలా తోడ్పడుతుంది, ఉద్వేగం అక్షరరూపంలో మారటం వల్ల ఉత్సాహం ఎలా నిండుతుందో పరిచయం చేసింది. కవిత్వాన్ని ఎవరు కొంటారు అన్న దశ నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో కవి సంగమం కోసమే ఒక స్టాల్ నిర్వహించి దానిలో అమ్మకాలను చేసి చూపించింది.కొనసాగింపుగా వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్ బుక్‌ఫెయిర్‌లలో కవిత్వ 'థీమ్‌షాప్'లను నిర్వహించడం కవిత్వానికి పాఠకులను కూడగట్టడమే, అందుబాటులోకి తేవడమే. తోపుడు బండితో పాటు ఇప్పుడు అనేక స్టాల్స్‌లో కవిత్వ పుస్తకాల కొనుగోలు వివరాల ఊపును సోషల్ మీడియాలో పంచుకుంటున్న వివరాలు కవిత సజీవత్వాన్ని చాటుతున్నది.

ప్రింట్ వైపు కవిసంగమం

కొత్తతరం 144 మంది కవుల కవితలు ప్రయోగాత్మకంగా వారి సంక్షిప్త పరిచయంతో 330 పేజీల 'కవిసంగమం 2012 కవిత్వం' పుస్తకం ఇప్పటికీ మార్కెట్లో ఉన్నది. కవి సంగమంలో శీర్షికలు పుస్తకాలుగా వెలువడ్డాయి. అందులో ఎన్. వేణుగోపాల్ **'కవిత్వంతో ములాఖాత్'** ,వాహెద్ **'సోషలిస్టు సూఫీ ఫైజ్ అహ్మద్ ఫైజ్'**, **'షాయరే తెలంగాణ ముఖ్దూమ్ మొహియుద్దీన్'**, నారాయణ శర్మ **'ఈనాటి కవిత'** ముఖ్యమైనవి. వీటితోపాటు కొత్తతరం కవులు కవిత్వ సంపుటాలు ప్రచురిస్తూ కవిత్వానికి గొప్ప ఆశను కల్గిస్తుండటంలో కవిసంగమం పాత్ర ఉన్నది. మోహన్ రుషి విభిన్న కవిత్వం, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరెట్, నందకిషోర్, వంశీధర్‌రెడ్డి, నరేష్కుమార్ సూఫీ, ఇబ్రహీం నిర్గుణ్, అనిల్ డానీ, విలాసాగరం, అశోక్ అవారీ,కంచర్ల శ్రీనివాస్,తగుళ్ళ గోపాల్, రమేష్ కార్తీక్ నాయక్, తోట నిర్మలారాణి, సుభాషిణి... ఇలా లెక్కకు మించిన కవులు, ప్రత్యేకత నిలబెట్టుకున్నది ఇక్కడి నుంచే. కవి సంగమానికి ఆరేండ్లు. ఇంకా కవిత్వంలో మెరుపులు మెరిపిస్తూ పుట్టుకొస్తున్న కవుల్ని చూస్తుంటే అబ్బురమే స్తున్నది. కవి సంగమం నిర్వహిస్తున్న లాంచింగ్ పాడ్ పాత్ర అపూర్వం.

'నిజమైన చరిత్ర కవిత్వంలోనే ఎక్కువగా దొరుకుతుంది' అంటాడు ప్లేటో. ఆ పనిలోనే నిమగ్నమైంది కవి సంగమం. కీట్స్ అన్నట్టు.. **'కవిత్వం ఉన్న నేల ఎప్పటికీ మరణించదు'**. ఈ 'కవి సంగమం' అటువంటి ప్రయత్నంలో భాగమేనని నమ్ముతూ జయహో కవిత్వం.

-కట్టా శ్రీనివాస్, 9885133969



'నిజమైన చరిత్ర కవిత్వంలోనే ఎక్కువగా దొరుకుతుంది' అంటాడు ప్లేటో. ఆ పనిలోనే నిమగ్నమైంది కవి సంగమం. కీట్స్ అన్నట్టు.. 'కవిత్వం ఉన్న నేల ఎప్పటికీ మరణించదు'. ఈ 'కవి సంగమం' అటువంటి ప్రయత్నంలో భాగమేనని నమ్ముతూ జయహో కవిత్వం.

స్వీకారం

షబ్నవీస్ జీవితం-సాహిత్యం




రచన: షబ్నవీస్ ఇందిరా రావు
వెల: రూ.100, **ప్రతులకు:** ఎస్. ఇందిరా రావు, 'వసుధ', ఇంటి నెం: 34-39/3/4, వివేకనందపురం, సైనిక్‌పురి, సికింద్రాబాద్-94, సెల్: 9989988226

సగం తెగిన చంద్రుడు




రచన: డాక్టర్ యశోద పెనుబాల వెల: రూ.200
ప్రతులకు: డాక్టర్ యశోద పెనుబాల, ఇంటి నెం:8-3-971, కాటూరి నివాస్, శ్రీనగర్ కాలనీ, మెయిన్‌రోడ్, పంజాగుట్ట, హైదరాబాద్-73. సెల్: 9052250341

గోండ్వానా లాండ్ ఎంత ప్రాచీనమైనదో
తెలుగు కూడా అంతే ప్రాచీనమైనది




రచన: డాక్టర్ సగిలి సుధారాణి వెల: రూ. 50
ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-04.

తడిసి ముద్దయిన కాలం(శైలజామిత్ర కవిత్వం)



రచన: శైలజామిత్ర
వెల:రూ.150, **ప్రతులకు:** 98, సౌజన్య ఎవెన్యూ, ఎస్‌బీఐ కాలనీ, గాంధీనగర్, హైదరాబాద్-80, ఫోన్: 9290900879

బ్లాక్ ఇంక్ (కథలు)



రచన: ఎమ్.ఎమ్. వినోదిని వెల: రూ. 130
ప్రతులకు: 1-3-183/40/70/104, చంద్ర అపార్ట్‌మెంట్స్, స్ట్రీట్‌నెం:9, ఎస్‌బీఐ కాలనీ, గాంధీనగర్, హైదరాబాద్-80. ఫోన్: 040-27610963

సారస్వత సరాలు




రచన: డాక్టర్ కె.అరుణావ్యాస్ వెల: రూ.100
ప్రతులకు: తెలంగాణ పురక్ష పబ్లికేషన్స్, డీజీపీ ఆఫీస్,హైదరాబాద్, ఫోన్: 27852254

తెలంగాణ సినిమా దశ దిశ




రచన: వారాల ఆనంద్, వెల: రూ.120
ప్రతులకు: వి. ఇందిరా రాణి, ఇంటి నెం:8-4-641, హనుమాన్‌నగర్,కరీంనగర్,001.
సెల్: 9440501281

రెక్కసాచిన ఊహలు (గేయ సంపుటి)



రచన: డాక్టర్ వోలేటి పార్వతీశం వెల: రూ. 150
ప్రతులకు: వోలేటి లక్ష్మీప్రసూన, ఫ్లాట్ నెం:502, బృందావన్ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం:16, గగన్ మహల్, దోమలగూడ, హైదరాబాద్-29, ఫోన్: 9440031213

నాన్న కుర్చీ (కవిత్వం)



రచన: మధునాపంతుల సత్యనారాయణమూర్తి
వెల: రూ. 100
ప్రతులకు: బీఎస్ నెహ్రూ, నెహ్రూ సాహిత్య సమితి, C/o బి. అంజనీదేవి, 1-125, వేలంపాలెం. ద్రాక్షారామం-533262.

అక్షరాల చెలిమె (కవిత్వం)




రచన: వారాల ఆనంద్, వెల: రూ.100
ప్రతులకు: ఇందిరా రాణి, సెల్: 9440501281

సామెతల సప్పరము (హోసూరు కతలు)



రచన: అగరం వసంత్ వెల: రూ. 100
ప్రతులకు: డాక్టర్ ఎన్. వసంత్, 2/1097, బస్తి, ఆవులపల్లి రోడ్డు, హోసూరు-635109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు. ఫోన్: 09488330209

మగతల చరిత్ర (చారిత్రక గంథం)




రచన: విలేఖరి హనుమంతు అలుకూరి,
వెల: రూ. 150, **ప్రతులకు:**విలేఖరి హనుమంతు, 8-1-68/ఏ/1/33, వినాయక నగర్, షేక్‌పేట్, హైదరాబాద్-08. సెల్:9440302380.

గోరటి వెంకన్న కవితాపరామర్శ




రచన: పెన్నా శివరామకృష్ణ వెల: రూ. 80
ప్రతులకు: నవచేతన, నవోదయ పుస్తక కేంద్రాలు.

కృతి (వచన కవితా ఖండికలు-గేయాలు)



రచన: కూర హన్మయ్య వెల: రూ. 81
ప్రతులకు: కూర రాఘవాదిత్య, హనుమాన్‌నగర్, న్యూగంజ్, శ్రీరామధర్మకాంట దగ్గర, ఇంటి నెం:1-7-169/3, మహబూబ్‌నగర్. సెల్: 9966617688

సుప్త క్షణాలు(కవిత్వం)



రచన: స్వాతీ శ్రీపాద వెల: రూ.200
ప్రతులకు: శ్రీపాద స్వాతి, 301, యమున అపార్ట్‌మెంట్స్, విశాల్‌మార్ట్ వెనుక, రామంతాపూర్, హైదరాబాద్-13. సెల్:8297248988

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

మరోసారి నా తల్లిని కోల్పోయా



■ 'మామ్' నటి సజల్ అలీ

ముంబై: శ్రీదేవి మరణంపై ఆమె చివరి సినిమా 'మామ్' (2017)లో కుమార్తెగా నటించిన పాక్ నటి సజల్ అలీ భావోద్వేగానికి గురయ్యారు. 'ఈ రోజు నా తల్లిని మరోసారి కోల్పోయాను' అని అన్నారు. యాదృచ్ఛికంగా మామ్ సినిమా షూటింగ్ సమయంలో సజల్ తల్లి మరణించారు. సజల్ కష్టసమయంలో ఉండగా శ్రీదేవి ఆమెకు అండగా నిలిచారు. తల్లి మరణంతో తీవ్రమైన బాధలో ఉన్న సజల్‌ను శ్రీదేవి తన చేతుల్లోకి తీసుకుని సొంత కుమార్తెలా చూసుకున్నారు. ఈ విషాదం తర్వాత సజల్ పాక్ నుంచి శ్రీదేవికి ఫోన్ చేసి బోరున విలపించారు. ఈ అనుభవాన్ని తాను కేవలం సినిమాలా మాత్రమే చూడటం లేదని.. ఈ అనుబంధం తన హృ దయాన్ని తాకిందన్నారు. సాధారణంగా శ్రీదేవి తన సహచర నటులతో తొందరగా కలిసిపోరు. సెట్స్‌లో పూర్తి ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తారు. సజల్ విషయంలో మాత్రం భిన్నంగా స్పందించారు. ఆదివారం సజల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో శ్రీదేవితో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'మరోసారి నా తల్లిని కోల్పోయా' అని పోస్ట్ చేశారు.

ఓరి దేవుడా.. శ్రీదేవిని ఎందుకు తీసుకెళ్లావ్? నన్నెందుకు ఇంకా బతికించావ్?

(అందాలతార శ్రీదేవి హఠాన్మరణం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె వీరాభిమాని అయిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ శ్రీదేవిని తీసుకెళ్లిపోయినందుకు దేవుడిని శపిస్తూ తీవ్ర భావోద్వేగంతో రాసిన సుదీర్ఘ లేఖ ఇలా సాగింది..)

''ఓరి దేవుడా.. ఆమెను ఒక్కదాన్నే ఎందుకు తీసుకెళ్లిపోయావ్.. నన్నెందుకిలా ఈ భూమ్మీదే వదిలేశావ్..! శ్రీదేవి నిజంగానే చనిపోయిందా? ఎవరైనా ఒకరు నన్ను నిద్రలోంచి లేపి అదో పీడ కల అని చెప్పండి. నాకు నిద్రలో తరుచూ కలలు కనే అలవాటుంది. అప్పుడప్పుడు మధ్యలో లేచి నా మొబైల్ ఫోన్ చెక్ చేసుకునే నేను.. శ్రీదేవి ఇక లేరు అనే మెసేజ్ ఒకటి చూశాను. అయితే అది నాకు వచ్చిన పీడకలలో లేదా ఏదో తప్పుడు వార్తనో కావచ్చునని భావించి మళ్లీ నిద్రలోకి జారుకున్నా.. గంటల తర్వాత లేచిచూస్తే, అలాంటి మెసేజ్‌లు 50వరకు ఉన్నాయి. షాక్‌కు గురయ్యా.. విజయవాడలో ఇంజినీరింగ్ చదువుతున్న రోజుల్లో శ్రీదేవి నటించిన 'పదహారేళ్ల వయసు' సినిమా చూశాను. ఆమె అందాన్ని చూసి మైమరిచిపోయా. ఆమె మానవ మాత్రురాలు కాదని, మనల్ని దీవించడానికి వేరే లోకాలనుంచి భూమిపైకి వచ్చిన అతిలోక సుందరిగా భావించా. భగవంతుడు మానవాళికి ప్రసాదించిన అపురూపమైన బహుమతి శ్రీదేవి.'క్షణ క్షణం' సినిమా నేను ఆమెకు రాసిన ప్రేమలేఖ.

అత్యంత సుకుమారమైన సౌందర్యరాశి శ్రీదేవిని సృష్టించినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు. వెయ్యేండ్లకోసారి మాత్రమే ఇలాంటి అద్భుత సృష్టి జరుగుతుందని భావిస్తున్నా. దేవుడు శ్రీదేవిని సృష్టిస్తే, ఆమెను శాశ్వతంగా బంధించేందుకు లూయిస్ లూమియేర్ సినిమా కెమెరాను మా కోసమే సృష్టించాడు. ఆమె ఇక లేదంటే నమ్మలేకపోతున్నా. తాను కేవలం ఓ మానవ మాత్రురాలేనని నిరూపిస్తూ వెళ్లిపోయిన శ్రీదేవిని ద్వేషిస్తున్నా. ఆమెకూ గుండె ఉందని, అది అందరిలాగే ఆగిపోతుందన్న నిజాన్ని ద్వేషిస్తున్నా.. ఆమెను తీసుకుపోయినందుకు భగవంతుడిని ద్వేషిస్తున్నా..


ఐ లవ్యూ శ్రీదేవి. నువ్వెక్కడున్నా, నేను ఎప్పుడూ ప్రేమిస్తూనే ఉంటా.. ''



దేవుడికి వర్మ భావోద్వేగ లేఖ

బిగ్ బీకి ముందే తెలుసా!

ఆందోళనగా ఉన్నదని శనివారం రాత్రే ట్వీట్ చేసిన అమితాబ్



ముంబై: శ్రీదేవి ఆకస్మిక మరణం సమాచారం యావత్ ప్రపంచానికి తెలిసింది ఆదివారం తెల్లవారు జామున. శనివారం అర్ధరాత్రి తర్వాత బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితా బచ్చన్ చేసిన ఓ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాను కుదిపేస్తున్నది. తనకు ఏదో ఒకరకమైన ఆందోళన కలుగుతున్నదని హిందీలో ఆయన ట్వీట్ చేశారు. 'న జానే క్యోం, ఏక్ అజీబ్ సి గభ్రాహట్ హో రహీ హై (ఎందుకో.. ఏమో.. తెలియదు. నా మనస్సులో ఏదో ఒకరకమైన ఆందోళన చెలరేగుతున్నది) అని అన్నారు. కొన్ని గంటల తర్వాత దుబాయ్‌లో శ్రీదేవి గుండెపోటుతో మరణించినట్టు వార్తలొచ్చాయి. బిగ్ బీతో కలిసి ఆమె ఇంక్విలాబ్, ఆఖరీ రాస్తా, ఖుదా గవా వంటి సినిమాల్లో నటించారు. 2012లో విడుదలైన శ్రీదేవి రెండో ఇన్నింగ్స్ సినిమా ఇంగ్లిష్ వింగ్లిష్‌లో అమితాబ్ ప్రత్యేక పాత్రలో కనిపించారు. కాగా అమితాబ్ ముందస్తు ట్వీట్‌కు అభిమానుల నుంచి భారీ స్పందన వస్తున్నది. అమితాబ్ సిక్త్స్ సెన్స్‌ను అభిమానులు ప్రత్యేకంగా ప్రస్తావించారు.

దివికేగిన శ్రీదేవి!

దుబాయ్‌లో గుండెపోటుతో కన్నుమూత ■ పెండ్లివిందులో పాల్గొన్న కొద్దిసేపటికే కుప్పకూలిన అందాలతార

దవాఖానకు తరలించేలోపే తుదిశ్వాస ■ నేడు భౌతికకాయం ముంబైకి తరలింపు

విమానం పంపిన అనిల్ అంబానీ ■ జుహూలో అంత్యక్రియలు? ■ శోకసముద్రంలో అభిమానులు

రాష్ట్రపతి, ప్రధాని, సీఎం కేసీఆర్ సంతాపం



దుబాయ్‌లో పెండ్లికి వెళ్లేందుకు ముంబై విమానాశ్రయం వచ్చిన శ్రీదేవి, బోనీకపూర్, వారి కుమార్తె ఖుషీ

దుబాయ్, ఫిబ్రవరి 25: దక్షిణాది అగ్రనటిగా, బాలీవుడ్ సూపర్‌స్టార్‌గా వెలుగొందిన అపురూపనటి శ్రీదేవి (54) దుబాయ్‌లో శనివారం రాత్రి గుండెపోటుతో హఠాత్తుగా కన్నుమూశారు. మేనల్లుడి పెండ్లి విందుకు హాజరైన కొద్దిసేపటికే ఆమె హోటల్ గదిలోని బాత్రూంలో కుప్పకూలారు. దవాఖానకు తరలించగా ఆమె అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీదేవికి భర్త బోనీకపూర్, కూతుళ్లు జాన్వీ, ఖుషీ ఉన్నారు. శ్రీదేవి మృతితో బాలీవుడ్‌తోపాటుగా అశేష అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ తదితరులు ఆమె హఠాన్మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీదేవి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శ్రీదేవి నటించిన పాత్రలే ఆమెను చిరస్మణీయంగా ఉంచుతాయని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతాప సందేశంలో పేర్కొన్నారు. బిగ్‌బీ అమితాబ్ బచ్చన్‌సహా పలువురు భారతీయ సినీరంగ ప్రముఖులు శ్రీదేవి మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సోమవారం భౌతికకాయం ముంబై చేరుకుంటుందని ఆమె కుటుంబసభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మీడియాతోపాటుగా సంతాపం తెలిపిన, ప్రార్థనలు జరిపిన ప్రతి ఒక్కరికీ వారు ధన్యవాదాలు తెలిపారు. శ్రీదేవి కుటుంబసభ్యుల తరపున యశ్‌రాజ్ ఫిలింస్ సంస్థ ఆ ప్రకటనను మీడియాకు విడుదల చేసింది. అంత్యక్రియల కార్యక్రమంపై ఆమె కుటుంబసభ్యుల నుంచి ఎలాంటి సమాచారం వెలువడలేదు. జూహూ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని తెలుస్తున్నది.

అసలు ఏం జరిగింది?

భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత, దుబాయ్‌లో రాత్రి 11-11.30 గంటల సమయంలో పెండ్లి విందులో అందరినీ చలాకీగా పలుకరిస్తూ తిరిగిన శ్రీదేవి ఆ తర్వాత కొద్దిసేపటికే బాత్రూంలో ఒక్కసారిగా కుప్పకూలారు. ఆమెను సమీపంలోని రషీద్ హాస్పిటల్‌కు హుటాహుటిన తరలించారు. కానీ అప్పటికే ఆమె మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆమెకు భారీస్థాయిలో గుండెపోటు వచ్చినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. శ్రీదేవికి ఎలాంటి గుండెజబ్బు లేదని ఆమె మరిది సంజయ్‌కపూర్ పేర్కొన్నారు. ఈ విషయమై ఇతర వివరాలు ఏవీ బయటకు రాలేదు. హోటల్ వర్గాలు కూడా మాట్లాడేందుకు నిరాకరించాయి. ఆమెను వెంటనే దవాఖానకు తరలించారా? లేక ఆలస్యమైందా? అనేది తెలియరాలేదు. దీంతో మృతి కారణాలపై ఊహాగానాలు నడిచాయి. దుబాయ్‌లో పెండ్లికి హాజరైన శ్రీదేవి వెంట భర్త బోనీకపూర్, చిన్నకూతురు ఖుషీ ఉన్నారు. మిగతా కుటుంబసభ్యులు ముందుగానే ముంబైకి తిరిగివెళ్లిపోయారు. పెద్దకూతురు జాన్వీ తొలిచిత్రం ధడక్ షూటింగ్ కారణంగా పెండ్లికి వెళ్లలేదు. పెండ్లికి హాజరై సరదాగా గడిపిన కొద్దిసేపటికే శ్రీదేవి కన్నుమూయడంపై అభిమానుల్లో ఆవేదన వ్యక్తమవుతున్నది.

అంబానీ విమానంలో తరలింపు

శ్రీదేవి భౌతికకాయాన్ని ముంబైకి తరలించేందుకు భారత పారిశ్రామిక దిగ్గజం అనిల్ అంబానీ ప్రత్యేక విమానాన్ని సమకూర్చారు. రిలయన్స్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ ట్రావెల్స్ కంపెనీకి చెందిన 13 సీట్ల ప్రైవేటు జెట్ విమానం (ఎంబ్రేయర్-135బీజే) ముంబై నుంచి ఆదివారం మధ్యాహ్నం 1.35 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.40కి దుబాయ్‌లో దిగింది. అధికార లాంఛనాలు పూర్తికాకపోవడంతో ఆ విమానం వెంటనే తిరుగుప్రయాణం ప్రారంభించలేకపోయింది. సోమవారమే భౌతికకాయాన్ని తరలించడం వీలవుతుందని అధికారవర్గాలు తెలిపాయి. దుబాయ్‌లో భౌతికకాయం అప్పగింతలో ఏర్పడుతున్న జాప్యం వల్ల అంత్యక్రియల ఏర్పాట్ల గురించి కుటుంబసభ్యులు ఏమీ చెప్పలేకపోతున్నారు.

ఇంటిదగ్గర జనప్రవాహం

ఆదివారం ఉదయం నుంచి శ్రీదేవి మరణవార్త వ్యాపించడంతో ముంబైలోని లోఖండ్‌వాలా ప్రాంతంలోని ఆమె నివాసం దగ్గర విషాద వాతావరణం ఏర్పడింది. రోడ్డుకు అటుఇటు కిలోమీటరు పొడవునా జనం గుమిగూడారు. దాంతో పోలీసులు అక్కడకు చేరుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు జరిపారు.

పోస్ట్‌మార్టం వల్ల తీవ్ర జాప్యం

శ్రీదేవి భౌతికకాయానికి దుబాయ్‌లోని జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ అండ్ క్రిమినాలజీలో డాక్టర్ ఖలీద్ అల్బురాయికీ పర్యవేక్షణలో పోస్ట్‌మార్టం నిర్వహించినట్టు ఖలీజ్ టైమ్స్ పత్రిక తెలిపింది. ల్యాబ్ నివేదికల కోసం కుటుంబసభ్యులు వేచిచూస్తున్నట్టు ఆ పత్రిక పేర్కొన్నది. మృతురాలు ప్రముఖ వ్యక్తి కావడంతో అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని దుబాయ్ అధికారులు తెలిపారు. ఈ లాంఛనాల వల్ల శ్రీదేవి భౌతికకాయం తరలింపులో విపరీతమైన జాప్యం ఏర్పడింది. దుబాయ్ దవాఖానలో చేరకుండా ఎవరైనా మరణిస్తే పంచనామా తదితర లాంఛనాలు పూర్తిచేసేందుకు కనీసం 24 గంటల సమయం పడుతుందని అంటున్నారు. భౌతికకాయాన్ని ముంబైకి తరలించే విషయంలో దుబాయ్‌లోని భారత కాన్సులేట్ అధికారులు సహకరిస్తున్నారు.



దుబాయ్‌లో శ్రీదేవి మృతదేహానికి పోస్ట్‌మార్టం జరిగిన దవాఖాన



దుబాయ్ బయలుదేరిన అనిల్‌కపూర్, అర్జున్‌కపూర్; శ్రీదేవి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన నటి రేఖ




అంధేరీలోని శ్రీదేవి ఇంటివద్ద గుమిగూడిన అభిమానులు

శ్రీదేవీ.. నిను మరవదు ఈ భువి

పలువురు ప్రముఖుల సంతాపం

శ్రీదేవి.. భారతీయ వెండితెరపై వెలుగు జిలుగులు విరజిమ్మిన తార. మూడు దశాబ్దాల పాటు భారతీయ సినీ జగత్తును ఓలలాడించిన గొప్ప కథానాయిక. దుబాయ్‌లో ఓ పెండ్లి వేడుకకు వెళ్లి అనంతలోకాలకు తరలిపోయిన శ్రీదేవి మృతిపట్ల పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం ప్రకటించారు.



భావితరాలకు స్ఫూర్తిదాయకం: రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్రపతి
శ్రీదేవి అకాలమరణంతో షాక్‌కు గురయ్యాను. ఆమె నటన అనన్యసామాన్యమైనది. ఎందరో అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించుకున్న శ్రీదేవి నటన భావితరాలకు స్ఫూర్తి దాయకం



శ్రీదేవి అస్తమయంతో దిగులుచెందా: వెంకయ్యనాయుడు
భారతీయ సినిమా లోకాన్ని తన అభినయంతో సమ్మోహపరిచిన శ్రీదేవి మరణం నన్నెంతగానో కలచివేసింది. ఆమె అస్తమయమయ్యారన్న వార్త నన్ను ఎంతగానో దిగులుపరిచింది. సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎన్నో మరుపురాని పాత్రలను చేశారు. శ్రీదేవి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెల్పుతున్నాను.



దిగ్భ్రాంతికి గురయ్యాను : ప్రధాని నరేంద్రమోదీ
శ్రీదేవి మరణవార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. భారతీయ సినిమాల్లో అజరామర పాత్రలను శ్రీదేవి పోషించి మెప్పించారు. ఇలాంటి సమయంలో ఆమె కుటుంబానికి అండగా ఉండాలి. ఆమె ఆత్మకు శాంతి చేకూరుగాక.



భారతీయ సినిమాకు దిగ్గజ నటి: ఎల్ కే అద్వానీ
భారతీయ సినిమా దిగ్గజ నటి శ్రీదేవి మరణవార్త ఎంతగానో కలిచివేసింది. తెలుగు, తమిళ సినిమాతో పాటు బాలీవుడ్ రంగానికి శ్రీదేవి సేవలు నిరుపమానమైనవి.ఎన్నో సినిమాల్లో వైవిధ్యభరితమైన ఆమె నటనను ఆరాధించాను.



ఆమె ఓ అపురూపమైన నటి : రాహుల్‌గాంధీ
శ్రీదేవి మరణవార్త విని ఎంతో కలతచెందాను. ఆమె భారత దేశానికే ఇష్టమైన కథానాయకి. ఆమె ఓ అపురూపమైన, బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆమె కుటుంబానికి నా సంతాపం తెలుపుతున్నాను. ఆమె ఆత్మకు శాంతి కలుగాలని ప్రార్థిస్తున్నాను.



నాకు ఎంతో ఇష్టమైన నటి : స్మృతి ఇరానీ (కేంద్రమంత్రి)
తన నటనతో అలరించిన శ్రీదేవి అన్ని తరాల వారికి స్ఫూర్తివంతంగా నిలిచారు. ఆమె సినిమాలు చూస్తూ అభిమానం పెంచుకున్న నేను కూడా నటినయ్యాను. భారతీయ సినిమా తొలి మహిళా సూపర్‌స్టార్. ఆమెకు మనస్ఫూర్తిగా నివాళి.



ఆమె మరణం తీరని లోటు: విద్యాసాగర్‌రావు, మహారాష్ట్ర గవర్నర్
నాలుగు దశాబ్దాల పాటు భారతీయ చిత్ర పరిశ్రమను అలరించిన మేటి నటి శ్రీదేవి. ఆమె మరణం తీరని లోటు. ఎన్నో సినిమాల్లో మరచిపోలేని నటనను మనకు అందించారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెల్పుతున్నాను.



ఆమె సేవలు నిరుపమానం : దేవేంద్ర ఫడ్నవిస్ (సీఎం, మహారాష్ట్ర)
భారతీయ సినిమా రంగానికి శ్రీదేవి చేసిన సేవలు నిరుపమానమైనవి. సద్మా, చాందినీ, లమ్హే, ఇంగ్లిష్-వింగ్లిష్ లాంటి సినిమాలు ఎల్లకాలం గుర్తుండిపోతాయి. దేశం ఒక గొప్ప నటిని కోల్పోయింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.



ఆమె నటన ఉత్సాహం, ఉద్వేగం : వసుంధర రాజే (సీఎం, రాజస్థాన్)
భారతీయ సినిమాను ఉన్నత స్థితికి తీసుకెళ్లడంలో శ్రీదేవి కృషి అనన్యసామాన్యమైంది. లెక్కలేనన్ని బ్లాక్‌బస్టర్ సినిమాలు ఆమె నటనకు తార్కాణం. ఆమె నటన ఉత్సాహం, ఉద్వేగానికి గురిచేసేది. ఆమె ఆత్మకు శాంతి కలుగాలి.



ఆమె అకాలమరణం బాధించింది : నితీశ్ కుమార్ (సీఎం, బీహార్)
ప్రముఖ నటి శ్రీదేవి అకాలమరణం నన్ను ఎంతగానో బాధించింది. ఆమె మృతి భారతీయ సినిమా పరిశ్రమకు తీరని లోటు. ఆమె ఓ అద్భుతమైన నటి. ఆమె కుటుంబానికి దేవుడు ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నాను.



శ్రీదేవి మరణం పూడ్చలేనిది : పినరాయి విజయన్ (సీఎం, కేరళ)
శ్రీదేవి మరణవార్త విని ఎంతో కలత చెందాను. శ్రీదేవి మరణం పూడ్చలేనిది. ఎన్నో మంచి సినిమాలను మనకందించి చిరకాలం గుర్తుండిపోయేలా చేశారు. మలయాళం సినిమా రంగానికి కూడా శ్రీదేవి ఎంతో సేవ చేశారు.



దిగ్భ్రాంతికి గురయ్యాను : మమతా బెనర్జీ (సీఎం, పశ్చిమ బెంగాల్)
నాలుగు దశాబ్దాలపాటు భారతీయ సినిమా రంగాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన మహారాణి మరణవార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. శ్రీదేవి కుటుంబానికి సంతాపం తెలుపుతున్నాను.



నటనతో చిరస్థాయిగా నిలిచిపోతారు : మనోహర్‌లాల్ కట్టర్ (సీఎం, హర్యానా)
తన అసమాన నటనతో అభిమానుల హృదయాలను కొల్లగొట్టిన శ్రీదేవి అందరిలో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను.



దేశానికి తీరని లోటు : పళనిస్వామి (సీఎం, తమిళ నాడు)
శ్రీదేవి అకస్మిక మరణం యావత్ భారతదేశానికే తీరని లోటు. బహుముఖ ప్రతిభ సొంతం చేసుకున్న శ్రీదేవి, తన సినిమా జీవితాన్ని తమిళనాడు నుంచే ప్రారంభించారు. శ్రీదేవి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెల్పుతున్నాను.



నా గుండె పగిలిపోయింది : ఫరూక్ అబ్దుల్లా
శ్రీదేవి మరణవార్త వినగానే నా గుండె పగిలినంత పనైంది. భారతీయ సినిమాలో ఆమె ఒక దిగ్గజ నటి. ఉత్తర, దక్షిణ భారత సినిమాల్లో ఆమె నటన సాటిలేనిది.



తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు : స్టాలిన్ (డీఎంకే అధ్యక్షుడు)
తమిళ సినిమాల్లోనే కాకుండా ఎన్నో భారతీయ భాషల సినిమాల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రీదేవి. ఆమె కుటుంబసభ్యులకు నా సంతాపం తెలుపుతున్నాను.

ఇదో చీకటిరోజు. నాకు మాటలు రావట్లేదు. శ్రీదేవిని అభిమానించిన అందరికీ నా ప్రగాఢ సానుభూతి **-ప్రియాంక చోప్రా**

గుండెపోటుతో శ్రీదేవి మామ్ చనిపోయారని ఇప్పుడే తెలిసింది. ఆ వార్తను తట్టుకోలేకపోతున్నాను. నాకు కన్నీళ్లు ఆగడం లేదు **-సుష్మితా సేన్**

విషాద వార్తతో ఈ రోజు తెల్లారింది. పూర్తిగా షాక్‌లో ఉన్నాను. **- రిషి కపూర్**

శ్రీదేవి వెళ్లిపోయింది. భారత చలనచిత్ర పరిశ్రమలో ఓ శకం ముగిసింది. ఓ అందమైన దృశ్యగాథ అర్ధాంతరంగా ఆగిపోయింది. అద్భుతమైన అభిమానం, అంతులేని జ్ఞాపకాలు, అనంత విషాదాన్ని మిగిల్చి.. ఆ అపురూప వ్యక్తిత్వం ఇప్పుడే అంతర్ధానమైంది. **-శేఖర్ కపూర్**

అందం, సంతోషం, చురుకుదనం, తెలివితేటలతో వెలిగిపోయే శ్రీదేవే మా జ్ఞాపకాల్లో సజీవంగా ఉంటుంది **-అనుపమ్ ఖేర్**

శ్రీదేవి ఇకలేరన్న వార్తతో నా హృదయం ముక్కలైంది. **-ప్రీతిజింతా**

నిత్యయవ్వనంగా కనిపించే శ్రీదేవి అకస్మాత్తుగా ఎలా వెళ్లిపోయింది? ఆమెను చూస్తూనే మనమంతా పెరిగాం. ఆమె ఇక లేరంటే నమ్మలేకపోతున్నా. ఆమె ఆత్మకు శాంతి చేకూరుగాక **-చేతన్ భగత్**

ఎంతో ఆరాధనగా చూసిన ఓ వ్యక్తిని అర్థాంతరంగా కోల్పోవడాన్ని మించిన విషాదం ఏముంటుంది? సినీ సౌందర్యంపై నమ్మకాన్ని పాదుకొల్పిన సమ్మోహన ఇంద్రజాలం ఆమె. చిత్రపరిశ్రమకు చీకటి రోజు. **- తమన్నా భాటియా**

శ్రీదేవి మరణవార్త నిజంగా షాక్. అనేకమంది కలలరాణి ఆమె. అప్పట్లో ఆమెతో కలిసిపనిచేయడం ఓ అదృష్టం. ఇన్నేండ్లుగా చెక్కుచెదరని ఆమె సౌందర్యానికి సాక్షిగా ఉన్నాను. ఆ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. **-అక్షయ్ కుమార్**

షాక్. నమ్మలేకపోతున్నా. ఆమె ఇప్పటికీ నవ్వుతున్నట్లు, మాట్లాడుతున్నట్లే అనిపిస్తున్నది. అసమాన నటనావైదుష్యం ఆమెది. తనే ఓ పాఠశాల. ఆమె నుంచి ఎంతో నేర్చుకున్నా. **-కాజోల్**

గుండె పగిలే వార్త ఇది. కలలోనైనా ఇలా జరుగుతుందని ఊహించలేదు. శ్రీదేవి ప్రపంచ శ్రేణి నటీమణి. **-నవాజుద్దీన్ సిద్దిఖీ**

దేవత కూడా ఇలా అర్థాంతరంగా వెళ్లిపోతుందంటే నమ్మలేకపోతున్నా. **-అశుతోష్ గోవారికర్**

వార్త తెలిసి తీవ్ర విషాదంలో మునిగిపోయాను. **- జాకీ ష్రాఫ్**

ఓ లెజెండ్, దశాబ్దాలపాటు వెలుగులు పంచిన శ్రీదేవి.. తాను వచ్చిన స్వర్గానికే తిరిగి వెళ్లిపోయింది. **-వివేక్ ఒబెరాయ్**

గత నెలలో శ్రీదేవిని కలిశాను. ఎప్పుడు కలిసినా తెలుగులోనే మాట్లాడుకుంటాం. ఆమెను కోల్పోయిన బాధ మాటల్లో చెప్పలేను **- జానీ లీవర్**

చిన్న వయసులోనే శ్రీదేవి ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయిందంటే నమ్మలేకపోతున్నాను. నాకు మాటలు రావడం లేదు. **-లతా మంగేష్కర్**

శ్రీదేవితో నాకు మంచి సాన్నిహిత్యం ఉంది. ఆమె ఇక లేరన్న వార్తను తట్టుకోలేకపోతున్నా. **-ఆశా భోంస్లే**

నేను ఎక్కువగా అరాధించిన వ్యక్తి ఆమె. నా తొలి సినిమాలో ఆమెతోనే నటించా. తొలిషాట్‌లో నా చేతులు వణుకుతుంటే, ఆమె కూడా వణుకుతున్నట్లు చూపి నాలో భయాన్ని పోగొట్టారు. **-హృతిక్‌రోషన్**

కెమెరా రోల్‌కావడం ప్రారంభంతోనే శ్రీదేవిలోని నటి బయటకువచ్చేది. సెట్ అంతా వెలిగిపోయేది. ఆమెను పోగొట్టుకోవడం బాధాకరం **- సన్నీడియోల్**

ఆమెను కలిసిన ప్రతీసారి.. తనకిష్టమైన నటిని కలిసేందుకు తహతహలాడే అభిమానిగా నేను మారిపోతాను. కానీ ఇలాంటి చేదువార్తల్ని నమ్మాల్సి వస్తుందని ఊహించలేదు. నేను సినిమాలను ఎక్కువగా ఇష్టపడటానికి కారణం ఆమే. భారతీయ చిత్ర పరిశ్రమ తన చిరునవ్వును కోల్పోయింది. **- కరణ్‌జోహార్**

అపారమైన ప్రతిభను సొంతం చేసుకున్న నటి శ్రీదేవి. **-ఇళయరాజా**

---

48 ఏండ్లు.. 48 నెలల పాలనతో సరిపోల్చండి

■ **ప్రభుత్వం, రాజకీయ సంస్కృతి మధ్య విశ్వాసరాహిత్యం వల్లే వెనుకబాటు**
■ **పుదుచ్చేరి సభలో ప్రధాని మోదీ**



పుదుచ్చేరి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 48 ఏండ్ల పాటు సాగిన ఒక కుటుంబ పాలన, గత 48 నెలల తమ ఎన్డీయే ప్రభుత్వం సాధించిన విజయాలను సరిపోల్చి చూడాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కూతురు ఇందిర, ఆమె కొడుకు రాజీవ్ గాంధీ పేరెత్తకుండానే కాంగ్రెస్ పార్టీ పాలనపై నిప్పులు చెరిగారు. పుదుచ్చేరిలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'ఏకైక కుటుంబం దేశాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో 48 ఏండ్ల పాటు పాలించింది. తొలి ప్రధాని 17 ఏండ్లు, ఆయన తనయ 14 ఏండ్లు, ఆమె కొడుకు ఐదేండ్లు పాలించారు' అని అన్నారు. '2004 – 2014 మధ్య ఇదే కుటుంబం రిమోట్ కంట్రోల్ పాలన' సాగించిందని గత యూపీఏ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మోదీ అన్నారు. భారత్ మాదిరిగానే 1947లో స్వాతంత్ర్యం పొందిన పలు దేశాలు ప్రగతి సాధించినా.. మనదేశం వెనుకబడి ఉన్నదని ప్రధాని మోదీ అన్నారు. ఈశాన్య రాష్ట్రాలు, కర్ణాటకల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. తద్వారా జూన్ తర్వాత కాంగ్రెస్ పార్టీకి నమూనాగా నిలువనున్న పుదుచ్చేరి సీఎం వీ నారాయణ స్వామిని ముందుగానే అభినందిస్తున్నానని ఎద్దేవా చేశారు. మౌలిక వసతులకు దూరమైన పుదుచ్చేరి.. కాంగ్రెస్ పార్టీ సంస్కృతి బాధితురాలిగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. జాతీయోద్యమ సమయంలో శ్రీ అరబిందో, జాతీయ కవి సుబ్రమణ్య భారతి వంటి వారికి ఆశ్రయం కల్పించిన ఘన చరిత్ర పుదుచ్చేరికి ఉన్నదని గుర్తు చేశారు.

మహిళలతోనే దేశ ప్రగతి

■ **సమాన భాగస్వామ్యం, సాధికారతతోనే నవ్య భారత నిర్మాణ కల సాకారం: మన్‌కీ బాత్‌లో ప్రధాని**


న్యూఢిల్లీ: సామాజిక, ఆర్థికాంశాలతోపాటు అన్ని రంగాల్లోనూ మహిళా భాగస్వామ్యం పెంపొందించడం ప్రతి భారతీయుడి విద్యుక్త ధర్మం అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రగతిలో సమాన భాగస్వామ్యం, మహిళా సాధికారతతోనే నవ్య భారతం నిర్మాణ కల సాకారం అవుతుందని తెలిపారు. ఆదివారం ఆయన తన నెలవారీ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళ అంతరాళాల్లో దాగి ఉన్న పౌరుషం, ఆత్మవిశ్వాసం ఆమెను సొంత కాళ్లపై నిలబెడుతాయని అన్నారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పాటిస్తున్న సంగతి గుర్తు చేసి న ప్రధాని.. ఇది సత్యం కోసం పడే తపనను తెలియజేస్తుందన్నారు. మార్చి నాలుగో తేదీన జాతీ య భద్రతా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ నిత్య జీవితంలో భద్రత పట్ల అప్రమత్తంగా లేకపోతే ఒక స్థాయికి చేరుకోలేమన్నారు. పశువుల పేడను పర్యావరణ రహిత ఇంధన ఉత్పత్తిని పెంపొందించేందుకు ప్రారంభించిన నూతన 'గోబర్ ధన్' స్కీమ్‌ను గుర్తు చేశారు. కొన్ని యూరప్ దేశాలు, చైనా పశువుల పేడ, ఇతర జీవ వ్యర్థాలను ఇంధన ఉత్పత్తికి వినియోగిస్తున్నాయని, కానీ మనదేశం దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో వెనుకబడిందన్నారు.

మీ మాజీ సీఎం, మంత్రులు జైలుకెళుతున్నా...

అవినీతిపై 'చౌకీదార్' మౌనమేలనో..?!

■ **ముల్బాడ్ బహిరంగసభలో మోదీపై విరుచుకుపడిన రాహుల్**

ముల్బాడ్: ప్రధాని మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శలు కొనసాగిస్తున్నారు. అవినీతిపై మాట్లాడకుండా ప్రధాని మోదీ మౌనంగా ఎందుకున్నారో అని ప్రశ్నించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కర్ణాటకలో రెండో విడుత ప్రచారం నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీ ఆదివారం ముల్బాడ్ బహిరంగసభలో ప్రసంగించారు. తనకు తాను చౌకీదార్‌గా పేర్కొన్న మోదీ, ఇంత అవినీతి జరుగుతున్నా నోరు ఎందుకు మెదపడం లేదో అర్థం కావడం లేదన్నారు. 'కర్ణాటకకు వచ్చినప్పుడు అవినీతి నిర్మూలన గురించి మాట్లాడారు. నన్ను ప్రధానిని చేయకండి. దేశానికి చౌకీదార్‌ను చేయండి అని చెప్పారు. అవినీతి కేసులో మాజీ సీఎం (యడ్యూరప్ప) సహా నలుగురు బీజేపీ మంత్రులు జైలుకెళ్లారు. వారి మధ్య కూర్చుని అవినీతి నిర్మూలనపై మాట్లాడుతారు. ఇదేమైనా భావ్యమా?' అని ప్రశ్నించారు. 'అమిత్‌షా కుమారుడు జయ్ షా మూడు నెలల్లో రూ.50 వేలను రూ.80 కోట్లుగా చేశాడు. దీన్నీ మోదీ గుర్తించడం లేదు. కనీ సం ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు' అని చెప్పారు. 'మన్ కీ బాత్‌లో పీఎన్బీ స్కాంపై మా ట్లాడితే బాగుంటుంది' అని చురక అంటించారు. ప్రకృతి సంరక్షణకు వృక్షధాన్ పరుగును రాహుల్ ప్రారంభించారు.



ముల్బాడ్ బహిరంగసభలో సీఎం సిద్ధరామయ్యతో రాహుల్ గాంధీ



కన్నుల పండువగా యాదాద్రీశుడి రథోత్సవం

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రిలో శ్రీవారి దివ్యవిమాన రథోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా సాగింది. అంతకుముందు బాలాలయంలో పసుపు, కుంకుమ కలిపిన అన్నంతో బలిహరణం చేశారు. రథానికి విశేష పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ప్రచార రథంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామివార్లకు కొండ కింద భక్తులు అడుగడుగునా మంగళనీరాజనాలు పలికారు. ఆదివారం ఉదయం స్వామివారు శ్రీమహావిష్ణువుగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం 11 గంటలకు మహాపూర్ణాహుతి, చక్రతీర్థం. రాత్రి 10 గంటలకు శ్రీవారికి శ్రీపుష్పయాగం, దోపు ఉత్సవం నిర్వహించనున్నారు.

మలేరియా చికిత్సకు సరికొత్త ఔషధం


పాలిమర్ నానోమెడిసిన్‌తో పూర్తిస్థాయిలో నయం
హెచ్‌సీయూ పరిశోధనా బృందం ఘనత



డాక్టర్ ప్రదీప్ పైక్, మెహిదీ

కొండాపూర్: దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియాను అరికట్టేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పరిశోధనా అధ్యాపకులు సరికొత్త 'పాలిమర్ – నానోమెడిసిన్' ఔషధాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోమెడికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రదీప్ పైక్ బృందం ఈ మెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రపంచవ్యాప్తంగా మలేరియా తీవ్రత విపరీతంగా పెరిగిందని, వైద్యరంగంలో ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ ఏటా 4.29 లక్షల మంది మలేరియాతో మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తెలుపుతున్నది. ఈ వ్యాధిని నిర్మూలించేందుకు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు శ్రమించి పాలిమర్ నానోమెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దోమకాటుతో రక్తంలో వ్యాప్తి చెందే పీ ఫాల్సీపారమ్ ఇన్ఫెక్షన్లను నయం చేసేందుకు నానోమెడిసిన్ క్యాప్సుల్స్ 'టైం – టెంపరేచర్ – క్లాక్' విధానంపై పనిచేస్తాయని డాక్టర్ పైక్ వివరించారు. తాము రూపొందించిన ఔషధంతో మలేరియాను పూర్తిస్థాయిలో నియంత్రించవచ్చని తెలిపారు. ఈ ఔషధ తయారీలో హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ మెహిదీ, సోమెదత్ మైతీ, నిరంజన్ సుత్రమ్, సురేశ్‌కుమార్ చలపారెడ్డి, ప్రొఫెసర్ మ్రినాల్ కంటి భట్టాచార్య పాలుపంచుకున్నారు.

పాలిమర్ నానోమెడిసిన్ పనిచేయు విధానం



ఔషధ పనితీరు..

మలేరియా సోకినవారికి చేసే చికిత్సలో భాగంగా అందించే పాలిమర్ క్యాప్సుల్స్‌తోపాటు ఫార్మేషన్‌చేసి తయారుచేసిన నూతన నానోమెడిసిన్ క్యాప్సుల్స్‌ని రోగికి అందించాలి. దీంతో రక్తకణాల్లో ఏర్పడిన ఇన్ఫెక్షన్‌లు 48 గంటల్లో తగ్గుముఖం పడుతాయి. ఫలితంగా వ్యాధి పూర్తిగా తగ్గిపోయి రోగి తిరిగి మామూలు స్థితికి చేరుకుంటారు.

నేటి నుంచి ఈ-గవర్నెన్స్ సదస్సు

- హాజరుకానున్న కేంద్ర మంత్రులు, మంత్రి కేటీఆర్, వివిధ రాష్ర్టాల ప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ కేంద్రంగా సోమవారం నుంచి రెండ్రోజులపాటు మరో ప్రతిష్ఠాత్మక సదస్సు జరుగనున్నది. హెచ్‌ఐసీసీ వేదికగా ఈ–గవర్నెన్స్ 21వ జాతీయ సదస్సును కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో ఈ–గవర్నెన్స్‌ను ఎలా విస్తృతం చేయాలనే దానిపై ఈ సదస్సులో చర్చించనున్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహాయ మంత్రి వైఎస్ చౌదరి, కేంద్ర వినియోగదారుల, ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ మంత్రి సీఆర్ చౌదరి, ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ రాష్ర్టాల ప్రతినిధులు, పలు రంగాల నిపుణులు హాజరుకానున్నారు. పలురాష్ర్టాల్లో అమలవుతున్న ఈ–గవర్నెన్స్ విధానాల గురించి తెలుసుకోవడంతోపాటు నూతన సాంకేతికతతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంపై ప్లీనరీ సెషన్లు నిర్వహించనున్నారు. 18 ఉత్తమ ఈ–గవర్నెన్స్ బహుమతులతోపాటు, ప్రత్యేక జ్యూరీ అవార్డును ప్రదానం చేయనున్నారు.

నల్లా కనెక్షన్‌కు యాప్

మరింత సులువుగా పొందేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు.. తొలుత నగరంలో గృహావసరాలకు అమలు
త్వరలో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

HMWSSB HYDERABAD METROPOLITAN WATER SUPPLY & SEWERAGE BOARD

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

నల్లా కనెక్షన్ కోసం హైదరాబాద్‌లో జలమండలి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేకుండా, ఇంట్లోనుంచే దరఖాస్తు చేసుకొని కనెక్షన్ పొందే వీలును కల్పిస్తూ అధికారులు ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆన్‌లైన్ విధానంతోపాటు ప్రత్యేక 'యాప్'ను అందుబాటులోకి తెస్తున్నారు. ముందుగా స్మార్ట్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత అందులోని మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తు మొదలుకొని ధ్రువపత్రాల అప్‌లోడ్ కూడా చేసుకోవచ్చు. నిర్ణీత కాలం తర్వాత కూడా కనెక్షన్ ఇవ్వకపోతే వెంటనే సంబంధిత అధికారులకు యాప్ ద్వారానే ఫిర్యాదు చెయ్యవచ్చు. త్వరలోనే ఈ యాప్‌నకు పేరును ఖరారు చేసి పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జలమండలి రెవెన్యూ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

పారదర్శకతకు పెద్దపీట

జలమండలి పరిధిలో అధికారులు నెలకు దాదాపు రెండు వేల నల్లా కనెక్షన్లు మంజూరు చేస్తుంటారు. ఈ కనెక్షన్ దరఖాస్తు నుంచి అనుమతి వరకు గతంలో మ్యాన్‌వల్ పద్ధతి నుంచి ఆన్‌లైన్‌కు తీసుకొచ్చి అధికారులు పారదర్శకతకు పెద్దపీట వేశారు. ఆన్‌లైన్ విధానం వచ్చాక సిబ్బంది చేతివాటానికి చెక్‌పడింది. గృహాలకు ఇచ్చే నల్లా కనెక్షన్‌ను 18 రోజుల్లో, ఇతర అవసరాలకు (వాణిజ్యం, బల్క్ కనెక్షన్లు) రెండు నెలల వ్యవధిలోపే మంజూరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కనెక్షన్ మంజూరు ప్రక్రియను మరింత సులభతరం చేయాలని నిర్ణయించి ప్రత్యేక యాప్‌ను రూపొందించారు.

యాప్ విధానం

కొత్తగా నల్లా కనెక్షన్ పొందాలనుకొనేవారు ముందుగా స్మార్ట్ ఫోన్‌లో మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్‌ను తెరిచి కొత్త నల్లాకు దరఖాస్తు చేసుకోవచ్చు. ముందే నిర్ణీత ధ్రువపత్రాలను ఫొటో తీసుకొని వాటిని యాప్ ద్వారా దరఖాస్తులో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. అప్‌లోడ్ చేసిన పత్రాలను ఒక సెట్‌ను సమీపంలోని జలమండలి కార్యాలయంలో అందించాలి. కనెక్షన్ చార్జీలను కూడా యాప్‌లో క్రెడిట్, డెబిట్ కార్డు నుంచి చెల్లించే వీలుంది. దరఖాస్తు చేసిన తర్వాత 18 రోజుల్లో కనెక్షన్ పొందవచ్చు. తర్వాత నీటి బిల్లులు చెల్లించుకునే వీలు ఉన్నది. తొలుత గృహాలకు అవసరమైన కొత్త నల్లాలకు ఇందులో దరఖాస్తు చేసుకోవచ్చు. త్వరలో బహుళ అంతస్తులు ఇతర కనెక్షన్లు కూడా పొందేలా మార్పులు చేయనున్నామని అధికారులు వివరించారు.

56 రోజులు.. 22 లక్షలు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు
ఈ ఏడాది ఆరు కేసుల నమోదు.. రూ.7.5 లక్షలు రికవరీ
పిన్ నంబర్, ఓటీపీలు అడిగి ఖాతాలు ఖాళీ చేస్తున్న కేటుగాళ్లు
అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ క్రైం పోలీసులు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలతో రెచ్చిపోతున్నారు. ఏదో ఒక ఆశను పుట్టిస్తూ ప్రజల్ని దోచేస్తున్నారు. మాయ మాటలు చెప్పి కోట్లు కొల్లగొడుతున్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 56 రోజుల్లో ఆరు కేసుల్లో సైబర్ క్రిమినల్స్ దాదాపు రూ.22 లక్షలు కొల్లగొట్టారు. వీటిలో అత్యధికంగా ఫిషింగ్ కాల్స్‌తోనే దోచేశారు. 2017లో మొత్తం 60 కేసులు నమోదయ్యాయి. అందులో సైబర్ నేరగాళ్లు రూ. 2.03 కోట్లు కొల్లగొట్టారు. ఈ 60 కేసుల్లో పోలీసులు 8 కేసులను ఛేదించి రూ. 57.29 లక్షలు రికవరీ చేశారు. మిగతా 52 కేసుల మిస్టరీ వీడాల్సి ఉంది. ఈ ఏడాదిలో ఫిబ్రవరి 24వ తేదీ నాటికి మొత్తం ఆరు కేసులు నమోదయ్యాయి. అందులో రూ. 22.41 లక్షల సొత్తును సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. ఈ ఆరు కేసుల్లో ఒక కేసును పోలీసులు ఛేదించి రూ.7.5 లక్షలను రికవరీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా సైబర్ మాయగాళ్ల మాటలకు కొందరు బోల్తా పడుతుండటం కొంత కలవరానికి గురిచేస్తున్నది. దీంతో ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు సోషల్ మీడియా వేదికగా పోలీసులు సూచనలు చేస్తున్నారు. ఇలాంటి మోసాల బారినపడకుండా ఇతరులను అప్రమత్తం చేసేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలు చర్చించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- బ్యాంకు నుంచి కార్డు వచ్చినప్పుడు ఆ కవర్‌ను పరిశీలించుకోవాలి. కవర్ చిరిగినట్లు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి.
- కార్డు సీవీవీ నంబర్‌ను ఇతరులకు కనిపించనివ్వకూడదు.
- లావాదేవీల వివరాలు తెలిసేలా ఫోన్ నంబర్ రిజిస్టర్ చేసుకోవాలి.
- తరచుగా పిన్ నంబర్‌ను మార్చుకోవాలి.
- స్వైపింగ్ సమయాల్లో పిన్ నంబర్‌ను స్వయంగా టైప్ చేయాలి.
- లావాదేవీలు చేసేందుకు సురక్షితమైన వెబ్‌సైట్లను ఉపయోగించాలి.
- క్రెడిట్, డెబిట్ కార్డులతో ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరిపిన తర్వాత ఆ వెబ్‌సైట్ నుంచి లాగ్ ఆఫ్ కావాలి. బ్రౌజర్ కుక్కీలను తొలగించాలి.
- సోషల్ మీడియాలో వ్యక్తిగత, బ్యాంక్ ఖాతా వివరాలను పెట్టొద్దు.
- బ్యాంక్ ఖాతాల వివరాలు, పిన్ నంబర్లను చెప్పండంటూ ఫోన్ చేసే గుర్తుతెలియని వ్యక్తుల మాటలను నమ్మొద్దు.
- బ్యాంక్ మేనేజర్‌నంటూ ఫోన్ వస్తే వెంటనే ఆ కాల్‌ను కట్ చేయాలి.
- మీ ఫోన్‌లో ట్రూ కాలర్ యాప్‌ను పెట్టుకోవాలి. అందులో స్పామ్ అంటూ వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దు.
- ఎలాంటి లావాదేవీలు జరుపకుండానే ఇతరులు ఓటీపీని అడిగితే అది మోసపూరిత వ్యవహారంగా పరిగణించాలి.
- దోచుకునేందుకు భయపెట్టిస్తారు, ఆందోళనకు గురి చేస్తారు. ఇలా ఎన్ని చర్యలు ఎదురైనా పిన్ నంబరు, ఓటీపీ, సీవీవీ నంబర్‌లు చెప్పొద్దు.
- నిజమైన బ్యాంకు అధికారులు ఫోన్‌లలో ఖాతాలు, బ్యాంక్‌ల వివరాలు అడగరన్న విషయాన్ని గుర్తించుకోవాలి.

న్యాయవాదులకు సీఎం చేతుల మీదుగా ఆర్థికసాయం

న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి చెందిన న్యాయవాదులకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆర్థికసాయం అందించాలని, మార్చి నెలాఖరునాటికి న్యాయవాదుల సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించాలని తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు నిర్ణయించింది. ఆదివారం హైకోర్టులోని రాష్ట్ర అడ్వకేట్ జనరల్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సమావేశంలో న్యాయవాదుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ట్రస్టు చైర్మన్, అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, ట్రస్టీలు రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, ట్రస్టు కార్యదర్శి, న్యాయశాఖ అదనపు కార్యదర్శి రామాంజనేయులుతోపాటు సభ్యులు న్యాయవాది గుడిమల్ల రవికుమార్ మరో 20 మంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. రూ.2 లక్షల ఆరోగ్య బీమా వర్తింపు, ప్రమాద బీమా కింద రూ.10 లక్షలు, ప్రమాదాల్లో గాయపడ్డవారి చికిత్సకు ఆర్థికసాయం, బార్ అసోసియేషన్లకు సదుపాయాలు, రెండున్నరేండ్లకుపైగా ఐదేండ్లకు లోబడి న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి సదుపాయల కోసం రూ.10 వేల ఆర్థికసాయం, 500 మంది న్యాయవాదులకు శిక్షణ వంటి నిర్ణయాలు తీసుకున్నారు.

ఓబీసీల సామాజిక ప్రగతిపై పరిశోధనా గ్రంథం

రచించిన బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ఓబీసీల స్థితి, ప్రగతిపై రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్ పరిశోధనా గ్రంథాన్ని రచించారు. ఈ పుస్తక వివరాలను ఆయన ఆదివారం వెల్లడించారు. 'సోషల్ జస్టిస్ అండ్ సోషియో–ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఇన్ ఇండియా' పేరిట ఇంగ్లిష్‌లో రచించిన ఈ గ్రంథాన్ని ఢిల్లీలోని రీసెర్చ్ ఇండియా ప్రెస్ ప్రచురించిందని తెలిపారు. సామాజిక న్యాయం, భారత సామాజిక, ఆర్థిక రంగాల్లో ఓబీసీల అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగరంగంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలను ఇందులో పొందుపరిచినట్టు చెప్పారు. ఈ గ్రంథంలో బీసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు, న్యాయస్థానాల తీర్పులు, మండల్ కమిషన్ అనంతర రాజకీయ, సామాజిక పరిణామాలను కూడా ప్రస్తావించినట్టు వివరించారు. 70 ఏండ్లుగా ప్రభుత్వాల పాలనా విధానాలు, వివిధ రంగాల్లో బీసీలకు జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో వివరించినట్టు చెప్పారు. 1953 నుంచి జాతీయ, రాష్ర్టాల బీసీ కమిషన్ల అధ్యయనాలు, నివేదికలు, వాటిపై ప్రభుత్వాలు తీసుకున్న చర్యల వివరాలను పొందుపరినట్టు తెలిపారు. ఈ పుస్తకాన్ని త్వరలో తెలుగులోకి అనువదించనున్నట్టు ఆంజనేయగౌడ్ చెప్పారు.

ఉగ్రవాద సానుభూతిపరుడి అరెస్ట్

దుబాయ్ పారిపోతుండగా విమానాశ్రయంలో పట్టివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విదేశాలకు పారిపోతున్న కేరళకు చెందిన ఉగ్రవాద సానుభూతి పరుడిని శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం నిఘా అధికారులు పట్టుకున్నారు. కేరళకు చెందిన ఎంఎం అక్బర్‌కు స్థానికంగా 13 విద్యా సంస్థలు ఉన్నాయి. అతడి పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతోపాటు ఉగ్రవాదం, మత ప్రేరేపిత బోధనలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని ఒక సంస్థ సోషల్ మీడియాలో వెల్లడించింది. దీంతో అప్రమత్తమైన కేరళ పోలీసులు 2016లో నిఘా పెట్టి, పరిశీలించారు. 2017లో అతడి విద్యా సంస్థల్లో సోదా చేయగా పలు పుస్తకాలు లభించాయి. ఆ పుస్తకాలను ముంబైలో ముద్రించినట్టు పోలీసులు గుర్తించారు. ఆ పుస్తకాల్లో విద్యార్థులు ఉగ్రవాదంవైపు ఆకర్షితులు కావడంతోపాటు ఇతర మతాలను రెచ్చగొట్టే విధంగా వ్యాసాలు ఉన్నట్టు కొచ్చి పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పోలీసులు అతడిపై కేసు నమోదు చేయగా, అప్పటి నుంచి అక్బర్ పరారీలో ఉన్నాడు. దేశం విడిచి పారిపోయే అవకాశం ఉన్నట్టు గుర్తించిన పోలీసులు, కేంద్ర హోంశాఖ సహాయంతో లుక్ ఔట్ సర్కిల్ (ఎల్‌వోసీ) జారీ చేశారు. ఈక్రమంలో అక్బర్ కౌలాలంపూర్ నుంచి విమానంలో ఆదివారం ఉదయం శంషాబాద్‌కు వచ్చాడు. అక్కడి నుంచి దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, విమానాశ్రయ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకొన్నారు. అనంతరం కేరళ పోలీసులకు అప్పగించారు.

హైదరాబాద్ నివాసయోగ్య ప్రాంతం

టీన్యూస్ చేపట్టిన ప్రాపర్టీ షోతో ఎంతో మేలు: మేయర్ బొంతు రామ్మోహన్



టీ న్యూస్ ఆధ్వర్యంలో చేపట్టిన గోల్డెన్ ప్రాపర్టీ షోలో లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేయర్ బొంతు రామ్మోహన్. చిత్రంలో టీ న్యూస్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సురేశ్, సీజీఎం ఉపేందర్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరం నివాసయోగ్యమైనదని మేయర్ బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. శిల్పకళావేదికలో టీ న్యూస్ ఆధ్వర్యంలో చేపట్టిన గోల్డెన్ ప్రాపర్టీ షోను ఆదివారం మేయర్ సందర్శించారు. ప్రాపర్టీ షోలో ఏర్పాటుచేసిన స్టాళ్లను ఆయన సందర్శించి నిర్వాహకులకు జ్ఞాపికలను బహూకరించారు. ప్రాపర్టీ షో ద్వారా అపార్టుమెంట్లు, విల్లాలు, టౌన్‌షిప్స్, ఓపెన్ ప్లాట్లపై ప్రజలకు అవగాహన కలుగుతున్నదన్నారు. సొంత ఇల్లు కొనాలనుకునేవారికి అన్ని వివరాలను తెలిపేందుకు టీ న్యూస్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహించడం హర్షణీయమన్నారు. అనంతరం గోల్డెన్ ప్రాపర్టీ షోలో భాగంగా చేపట్టిన లక్కీ డ్రాను మేయర్ ఈ సందర్భంగా తీశారు. ఈ లక్కీ డ్రాలో హైదరాబాద్‌కు చెందిన శంభుకుమార్, రఘువీరారెడ్డి విజేతలుగా నిలిచారు.

పురుషోత్తంరెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలు

- వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలు స్వాధీనం
- అల్మారాలో బయటపడ్డ 14 విదేశీ మద్యంబాటిళ్లు
- బయట సీసీ కెమెరాలు, లోపల డీవీడీ బాక్స్ మాయం



పురుషోత్తంరెడ్డి ఇంట్లో లభించిన ఆభరణాలు, నగదు, వాచీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అవినీతి కేసులో ఏసీబీ అధికారులకు చిక్కిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి లైఫ్‌స్టైల్ అంతా రిచ్‌గా ఉంది. అతడు ఇంట్లోవాడే ప్రతీవస్తువు ఖరీదైనదే.. బంగారు నగల డిజైన్లు కండ్లు మిరుమిట్లుగొలిపేలా ఉన్నాయి. మద్యం బాటిళ్లు సైతం విదేశాల నుంచి వచ్చిందే కావడం గమనార్హం. పెద్ద ఎత్తున విదేశీ కరెన్సీ పట్టుబడింది. హైదరాబాద్ సాగర్‌సొసైటీలో ఉన్న పురుషోత్తంరెడ్డి ఇంట్లో ఆదివారం ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఏసీబీ అధికారులు తమ కస్టడీలో ఉన్న పురుషోత్తంరెడ్డిని తీసుకుని అతడి ఇంటికి వెళ్లారు. ఈ సోదాల్లో వజ్రాలు పొదిగి ఉన్న రూ. 60 లక్షల విలువచేసే (1.11 కిలోలు) బంగారు ఆభరణాలు, రూ. 1.10 లక్షలు నగదు, రూ. 9,000 పాతనోట్లు, 501 యూఎస్ డాలర్లు, 265 యూఏఈ కరెన్సీ (దీరామ్), రూ. 20 లక్షల విలువచేసే పట్టుచీరలు, కోటి రూపాయల విలువచేసే గృహోపకరణాలు, అల్మారాలో దాచిన 14 విదేశీ మద్యం బాటిళ్లు, బిల్లులు, క్రెడిట్‌కార్డు బిల్లులు, కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. విదేశీ మద్యం బాటిళ్లకు సంబంధించి ఎక్సైజ్ అధికారులకు సమాచారమిచ్చారు. కాగా, పురుషోత్తంరెడ్డి ఇంటి బయట ఏర్పాటుచేసుకున్న సీసీ కెమెరాలను పనిచేయకుండా చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. వాటికి సంబంధించి రికార్డు బాక్స్‌ను కూడా మాయం చేశారు. ఈనెల 12న పురుషోత్తంరెడ్డి కుటుంబసభ్యుల బ్యాంకు లాకర్లు కూడా ఖాళీగానే దర్శనమిచ్చాయి. ఈ కేసులో బినామీగా భావిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లోనూ ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదు. ఈ నేపథ్యంలో ఏసీబీ దాడుల విషయం ముందుగానే అతడికి చేరి ఉంటుందని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



డబీర్‌పురలో బయటపడిన ఫిరంగి

చార్మినార్: నిజాంకాలం నాటి ఓ ఫిరంగి హైదరాబాద్ పాతనగరంలో బయటపడింది. డబీర్‌పుర ప్రాంతంలోని ఫర్హత్‌నగర్‌కు చెందిన ఆనంద్ తన 50 గజాల స్థలంలో ఇల్లు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ఆదివారం పునాదుల కోసం తవ్వుతుండగా సుమారు 6 ఫీట్ల లోతులో పురాతన ఫిరంగి బయటపడింది. సమాచారం అందుకున్న డబీర్‌పుర పోలీసులు, పురావస్తుశాఖ అధికారులు ఫిరంగిని, అది బయట పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇది ఎంతకాలం కిందటిది అనే విషయం తేలడానికి కొంత సమయం పడుతుందని అధికారులు తెలిపారు. అనంతరం ఫిరంగిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



హైదరాబాద్‌లోని చారిత్రాత్మక చార్మినార్ వద్ద జలమండలి, పోలీసులు సంయుక్తంగా ఆదివారం జలం-జీవంపై 5కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, జలమండలి ఎండీ దాన కిశోర్, చార్మినార్ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సుదూర ప్రాంతాల నుంచి నగరానికి కృష్ణా, గోదావరి జలాలను తాగునీటికోసం తరలిస్తున్నదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి నీటి బొట్టును భవిష్యత్ తరాలకు అందించడానికి మనం ఇప్పటి నుంచే జాగ్రత్త పడాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. - చార్మినార్

శాంతియుతంగా పాతబస్తీ

ప్రజలు గర్వంగా, హుందాగా జీవనం సాగిస్తున్నారు
సీఎం, డీజీపీకి కృతజ్ఞతలు: ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్



దక్షిణ మండలంలో 2014 నుంచి 2018 మధ్య జరిగిన హత్యలు, చైన్ స్నాచింగ్ నేరాల తీరు

నేరం	2014	2015	2016	2017	2018
హత్యలు	35	29	24	12	0
చైన్‌స్నాచింగ్	45	34	12	2	0

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్‌శాఖ పనితీరును హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశంసించారు. ఇందుకు పాతబస్తీ (దక్షిణ మండలం)లోని ప్రశాంత వాతావరణమే నిదర్శనమంటూ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గత నేరాల పట్టిక, తాజా పట్టికను ట్విట్టర్‌లో పొందుపరిచారు. ప్రభుత్వం, పోలీసులు తీసుకుంటున్న చర్యలతో పాతబస్తీలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, శాంతిభద్రతల విషయంలో ఓల్డ్ సిటీ 'లా అండ్ ఆర్డర్ రికార్డ్'గా పేర్కొన్నారు. దీంతో పాతబస్తీ ప్రజలు గర్వంగా, హుందాగా జీవనం సాగిస్తున్నారని కొనియాడారు. ఇందుకు ప్రత్యేకంగా ముఖ్యమంత్రి కేసీఆర్, డీజీపీ మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సౌదీలో ఉంటూ తలాక్ అని వేధిస్తున్న భర్తపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఉద్యోగ నిమిత్తం సౌదీలో ఉన్న తన భర్త తలాక్.. తలాక్ అంటూ వేధింపులకు గురిచేస్తున్నాడని ఓ గృహిణి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన గౌసియా సుల్తానా(30)కు హైదరాబాద్ బాలాపూర్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్‌తో ఆరేండ్ల కిందట పెండ్లి జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. నాలుగేండ్ల కిందట అబ్దుల్ ఖదీర్ ఉద్యోగం నిమిత్తం సౌదీకి వెళ్లాడు. భర్త సౌదీకి వెళ్లడంతో సుల్తానా కొడుకుతో కలిసి ఘట్‌కేసర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నది. మూడేండ్లపాటు భార్య, కొడుకు జీవనానికి డబ్బులు పంపిన అబ్దుల్ ఖదీర్, ఏడాది నుంచి డబ్బులు పంపించకపోవడంతోపాటు యోగక్షేమాలు పట్టించుకోవడం లేదు. అవసరానికి డబ్బులు పంపించమని అడిగితే తలాక్ చెప్తున్నాడని గౌసియా సుల్తానా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల సౌదీ నుంచి బాలాపూర్‌కు వచ్చిన భర్త తనవద్దకు రాకుండానే తిరిగి వెళ్లిపోయాడని తెలిపింది. తలాక్ అంటూ వేధింపులకు గురిచేస్తున్న తన భర్తపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉన్నది.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 26 ఫిబ్రవరి 2018
WWW.NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

సక్సెస్ మంత్ర



క్యాష్‌కరో డాట్‌కామ్‌తో దూసుకుపోతున్న

స్వాతి భార్గవ

ఆన్‌లైన్‌షాపింగ్‌తో ప్రపంచ విపణి ఇంటి గుమ్మం వద్దకు చేరుకుంది. కాలు కదుపకుండానే ఏది కావాల్సి వస్తే అది చిటికెలో కొనుక్కోవచ్చు. తొలినాళ్లలో అమేజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతో ఆన్‌లైన్‌షాపింగ్ హవా మొదలయ్యాక.. ఆ రంగం లోకి మరిన్ని సంస్థలు వచ్చేశాయి. ఆఫర్లు, డిస్కౌంట్లు, కూపన్లు, క్యాష్‌బ్యాక్‌లతో ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో ఆన్‌లైన్ వినియోగదారుల సంఖ్య అంతకంతకు రెట్టింపు అవుతూ వస్తున్నది. ఈ ట్రెండ్‌ను కొన్నేళ్ల క్రితమే గమనించారు హర్యానాలోని అంబాలాకు చెందిన స్వాతి భార్గవ. ఆన్‌లైన్ వెబ్ సైట్లు అన్నింటినీ ఒక వేదిక మీదికి తీసుకొచ్చి.. ఒక వస్తువు ఎందులో ఎంత ధర పలుకుతున్నదో బేరీజు వేసుకునే సైట్‌ను రూపొందించారు స్వాతి. క్యాష్‌కరో డాట్ కామ్‌తో దూసుకుపోతున్న స్వాతి భార్గవ సక్సెస్‌మంత్ర.

సుమకు ఆన్‌లైన్ షాపింగ్ అంటే చాలా ఇష్టం. భర్త డ్యూటీకి, పిల్లలు స్కూల్‌కు వెళ్లాక టైంపాస్‌కోసం ఆన్‌లైన్ షాపింగ్‌పట్ల ఆసక్తి పెంచుకుంది. సెలవు రోజుల్లో షాపింగ్‌కని వెళ్లి గంటల తరబడి కాలం వృథా చేయడం కంటే ఇంట్లో ఉండే పిల్లలకు, భర్తకు కావాల్సినవన్నీ కొనుగోలు చేస్తుంటుంది. సాధారణంగా ఫ్లిప్‌కార్ట్ ఓపెన్ చేసి పిల్లల దుస్తులు కొనుకోలు చేయాలనుకుంది. అదే సమయంలో అమేజాన్‌లో అయితే అవే క్వాలిటీ దుస్తుల ధర ఎంత ఉందో తెలుసుకోవాలనుకుంది. ఇలా ఐదారు సైట్లలో ధరల వ్యత్యాసం తెలుసుకునే సైట్ కోసం వెతికింది. ఒక్క సుమలాంటి గృహిణే కాదు వేల మంది ఆలోచన అలాగే ఉంటుంది. అలాంటి వారి కోసమే ఒక సైట్ ఏర్పడింది. దాని పేరు క్యాష్‌కరో డాట్ కామ్. అందరినీ ఆకట్టుకుంటున్న ఆ వెబ్‌సైట్‌ను రూపొందించింది స్వాతి భార్గవ.

పెద్ద ఉద్యోగం వద్దనుకుని..

హరియాణాకు చెందిన స్వాతి లెక్కల్లో దిట్ట. డిగ్రీ పూర్తయ్యాక ప్రసిద్ధి చెందిన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు దరఖాస్తు చేసింది. చిన్నప్పుడు తన చేతిలో ఎప్పుడూ ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ఉండేదట. తను ఎప్పటి కైనా ఆక్స్‌ఫర్డ్‌లో చదువాలని కలలు కన్నది. అయితే లండన్‌లోని స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో సీటు రావడంతో అక్కడ చేరిపోయింది. లండన్‌లో ఉన్నప్పుడే.. ఆన్‌లైన్ షాపింగ్‌కు సంబంధం ఉన్న స్టార్టప్ మొదలెట్టాలనుకున్నారు ఆమె. అక్కడే పరిచయం అయిన రోహన్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. ఇద్దరి అభిరుచులు కలిశాయి. ప్రపంచంలోనే పేరెన్నికగల ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం గోల్‌మన్‌శాచ్‌లో ఉద్యోగం చేశారు స్వాతి. అయితే తను కన్న కలలను నిజం చేసుకోవాలంటే.. ఉద్యోగం చేస్తే కుదురదు. దాంతో ఉద్యోగం వదులుకుని స్వాతి, రోహన్ ఇద్దరు పెళ్లి కూడా చేసుకున్నారు. ఆ తర్వాత 2013లో భర్త రోహన్‌తో కలిసి ఈ సంస్థను ప్రారంభించింది స్వాతీ భార్గవ.



మంచి ఆలోచనలకు ఫిట్‌నెస్

'మంచి ఆలోచనలు రావాలంటే శారీరక ఫిట్‌నెస్ కూడా ముఖ్యమే. మహిళా వ్యాపారవేత్తగా ఒత్తిళ్లను ఎదుర్కొని, వ్యాపార రంగంలో ముందుకెళ్లాలంటే ఉదయాన్నే లేచే అలవాటు చాలా మంచిది. వ్యాయామం వల్ల రోజంతా సానుకూల దృక్పథంతో పనిచేస్తూ, అలసటకు తావులేకుండా ఉంటుంది. నాణ్యతలో రాజీపడటం అనేది పారిశ్రామిక వేత్తలకు ఉండకూడని లక్షణం. బయట నుంచి పెట్టుబడులు ఆశించడం తప్పు కాదు కానీ అదే మన లక్ష్యం కాకూడదు. ఆ నమ్మకం పెట్టుకుంటే సక్సెస్ కాలేకపోవచ్చు. డబ్బుతో మొదలయ్యే సమస్యల్ని అధిగమించడం నేర్చుకోవాలి. వినియోగదారుని దగ్గర నిజాయితీగా ఉండాలి. ఉత్పత్తి విషయంలో నిజాయితీనే పెట్టుబడిగా పెట్టాలి.'

స్వాతి భార్గవ

26 కోట్ల పెట్టుబడి

మనదేశంలో ఆన్‌లైన్ వినియోగదారులకు రాయితీ కూపన్లు, తిరిగి చెల్లింపులూ అందించే సంస్థల్లో క్యాష్‌కరో సంస్థ ఒకటి. మొదటి నుంచి స్వతంత్రంగా ఆలోచించే స్వాతి ఇండియాకు వచ్చాక భర్తతో కలిసి క్యాష్‌కరో డాట్ కామ్ మొదలుపెట్టింది. మన దేశంలో విదేశీ మదుపు సంస్థల నుంచి సుమారు 26 కోట్ల రూపాయల పెట్టుబడి పొందిన రాయితీల స్టార్టప్ ఇదే కావడం విశేషం. స్టార్టప్ ప్రారంభించాలనుకున్న వెంటనే ఎంతో రీసెర్చ్ చేశానంటున్నది స్వాతి. అనేక ఒడిదొడుకులు ఉంటాయి. వాటిని ఎదుర్కొనే నైపుణ్యం, చాకచక్యం ఉండాలంటుంది. మలేషియా, సింగపూర్లాంటి చోట్ల స్టార్టప్ ప్రారంభించాలనుకున్నాం. కానీ చివరకి ఇండియాను ఎంచుకున్నాం. భారత్‌లో అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. చివరికి ఎన్నో స్టార్టప్‌లు ఆలోచించినా, అందరికీ భిన్నంగా ఉండాలనుకుని క్యాష్‌కరో డాట్ కామ్ స్టార్టప్‌ను ఎంచుకున్నానని తన మొదటి ప్రయత్నాన్ని చెప్పింది.

భవిష్యత్ ఈ కామర్స్‌దే

నాలుగేళ్ల క్రితం పోర్టల్ ప్రారంభించినప్పట్నుంచీ జీఎంవీ పరంగా (ఆన్‌లైన్ షాపింగ్ పోర్టల్ ద్వారా జరిగే లావాదేవీల స్థూల విలువ) ఏటా దాదాపు 300 శాతం మేర వృద్ధి సాధిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. క్యాష్‌బ్యాక్ కూపన్ల విభాగంలో తమకు దాదాపు 60 శాతం మార్కెట్ వాటా ఉందన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ సైట్లలో జరిగే అమ్మకాల్లో సుమారు 20-25% వ్యాపారం తమ తరహా అనుబంధ పోర్టల్స్ నుంచే ఉంటున్నదని స్వాతి వివరించారు. ప్రస్తుతం దాదాపు 10 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ ఈకామర్స్ మార్కెట్ 2020 నాటికి దాదాపు 100 బిలియన్ డాలర్లకు పెరగగలదని ఆమె చెప్పారు. క్యాష్‌బ్యాక్ రూపంలో సుమారు రూ. 35 కోట్లు వినియోగదారులకు అందించామన్నారు.

అన్ని సైట్లు ఒకేదానిలో..

క్యాష్‌కరో డాట్ కామ్ ప్రత్యేకత ఏంటంటే- వినియోగదారుడు ఫోన్లు, దుస్తులు, ఆటబొమ్మలు, పుస్తకాలు ఇలాంటివి కొనుగోలు చేయాలనుకున్నాడనుకుందాం. ఆన్‌లైన్ షాపింగ్ సైట్ ఫ్లిప్‌కార్ట్‌లోకి వెళ్లి ఒక వస్తువును కొనాలనుకుంటే.. అన్ని సైట్లలోనూ ఒకే ధరలు ఉండవు. స్నాప్‌డీల్, జబాంగ్, షాప్‌క్లూస్,హెల్త్‌కార్ట్ తదితర ఆన్‌లైన్ షాపింగ్ సైట్లన్నింటి ధరలను క్యాష్‌కరో డాట్‌కామ్‌లో బేరీజు వేసుకోవచ్చు. దాంతో పాటు ఈ సైట్ వినియోగ దారులకు కూపన్లు, క్యాష్‌బ్యాక్‌వంటివి అందజేస్తున్నది. ఫ్లిప్‌కార్ట్‌లో డిస్కౌంట్లు ఇచ్చే వస్తువులన్నింటినీ ఇందులో చూసుకోవచ్చు. క్యాష్‌కరో డాట్‌కామ్ బిజినెస్‌ఐడియా చాలామంది ఇన్వెస్టర్లకు నచ్చింది. రతన్‌టాటా వంటి పారిశ్రామికవేత్తల దృష్టిలో భవిష్యత్తు కలిగిన స్టార్టప్ కంపెనీగా గుర్తింపు పొందింది.

విస్తరణ దిశగా..

మారుతున్న ఆన్‌లైన్ షాపింగ్ ధోరణులను ప్రస్తావిస్తూ గతంలో సింహభాగం ఎలక్ట్రానిక్సే ఉండగా.. ప్రస్తుతం ఇది 50 శాతం మేర ఉంటుండగా, సుమారు పాతిక శాతం ఫ్యాషన్ల వాటా ఉంటోందని స్వాతి చెప్పారు. పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా, కలారి క్యాపిటల్ తదితర ఇన్వెస్టర్ల నుంచి ఇప్పటి దాకా దాదాపు 5 మిలియన్ డాలర్ల మేర నిధులు సమీకరించినట్లు స్వాతి తెలిపారు. అటు బ్రిటన్లో పోరింగ్ పౌండ్స్ పేరిట క్యాష్‌బ్యాక్ ఆఫర్ల పోర్టల్ నిర్వహిస్తున్న తాము త్వరలోనే సింగపూర్, ఆగ్నేయాసియా దేశాలకూ కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ఆమె వివరించారు.

మదర్ థెరిసా వారసురాలు



ఈ సిస్టర్ నిజంగానే మదర్ థెరిసా వారసురాలు. ఎందుకంటే.. 'ఓ వ్యక్తి ఆరోగ్యం బాగలేదు, ఆర్థికంగా సాయం చేయండి' అని అడిగితే.. ఈమె ఏకంగా కిడ్నీ దానం చేసి తన ప్రేమ గుణాన్ని చాటుకున్నది.

తమిళనాడులో అలప్పుజ ప్రాంతానికి చెందిన సిస్టర్ రోజ్ ఆంటో.. నన్‌గా కథోలిక్ సంఘంలో సేవ చేస్తున్నది. అంతేకాదు తాను సెయింట్ జోసెఫ్ కాలేజ్‌లో హిందీ డిపార్ట్‌మెంట్‌కు హెడ్‌గా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకరోజు సిస్టర్ రోజ్ దగ్గరకు కొందరు వ్యక్తులు వచ్చి.. 'ఇరింజలకుడ ప్రాంతానికి చెందిన తిలకన్ అనే వ్యక్తికి కిడ్నీలు పాడయ్యాయి. కుటుంబం కష్టాల్లో ఉన్నది ఆర్థిక సాయం చేయండి' అని కోరారు. అయితే పలు సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనే సిస్టర్ రోజ్.. భర్త చనిపోయిన మహిళలకు ఆర్థికంగా సాయం చేసేవారు. అప్పుడే తిలకన్ గురించి ఆరా తీశారు. అతని దయనీయ పరిస్థితి, కుటుంబ ఆర్థిక బాధలు తెలుసుకొని తిలకన్‌కు తన కిడ్నీ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కొచ్చిలోని వీపీఎస్ దవాఖాన వైద్యులను సంప్రదించి తన కిడ్నీ దానం చేసింది. దీంతో వైద్యులు ఆ కిడ్నీని తిలకన్‌కు అమర్చారు. సిస్టర్ రోజ్ ఆంటో దయార్థ్ర హృదయానికి తిలకన్ కుటుంబం కృతజ్ఞతలు చెబుతున్నది. సిస్టర్ రోజ్ మదర్ థెరిసా వారసురాలని కొనియాడుతున్నారు.

పెరుగుతో గుండె పదిలం!



పెరుగు లేనిదే ముద్ద దిగని వాళ్లు చాలామంది ఉన్నారు. కొందరైతే పెరుగును మజ్జిగరూపంలో చేసుకొని రెగ్యులర్‌గా తాగుతుంటారు కూడా. ఎండాకాలం రానే వచ్చింది. ఇక పెరుగును నేస్తం చేసుకోండని సలహా ఇస్తున్నారు నిపుణులు.

పోటీ ప్రపంచంలో ఒత్తిడి సహజం. ఒత్తిడి ఉన్నంతకాలం గుండెకు దడే. ఒత్తిడి వల్ల గుండెకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అనే ఆందోళనలూ ఉండే ఉంటాయి. ఈ పరిస్థితి నుంచి విముక్తి పొందాలంటే ముందు లైఫ్‌స్టయిల్‌లో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. జీవనశైలి అంటే వ్యాయామం.. సమయం మాత్రమే కాదు ఆహార నియమాలు కూడా పక్కాగా పాటించాలంటున్నారు. యోగా.. ధ్యానం లాంటివి చేస్తూనే పెరుగు ఉత్పత్తులను తీసుకోవాలట. ముఖ్యంగా హైబీపీతో ఇబ్బందిపడేవాళ్లు పెరుగు తప్పనిసరిగా తినాలి. పెరుగుతో పాటు ఫైబర్ ఆహారాన్ని తీసుకుంటే గుండె నిబ్బరంతో ఉండొచ్చు. గుండె సమస్యలున్నవారిపై ఇటీవల పరిశోధకులు అధ్యయనం చేపట్టారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న 30-55 సంవత్సరాల మధ్య ఉన్న మహిళల్ని.. 40-75 సంవత్సరాలున్న పురుషుల్ని పరిశీలించారు. 18 వేల మందిపై చేసిన ఈ పరిశోధనలో భాగంగా ప్రతి ఒక్కరూ రోజూ 60మిల్లీ లీటర్ల పెరుగు తినాలని చెప్పారు. వారం తర్వాత వీరిపై మళ్లీ పరిశోధనలు చేశారు. పెరుగు తీసుకున్నవారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం 30శాతం వరకు తగ్గినట్లు వాళ్లు గుర్తించారు. కాబట్టి క్రమంగా పెరుగు తీసుకొని గుండెను పదిలంగా ఉంచుకోవాలని సూచించారు.



నా వయసు 54 సంవత్సరాలు. ఓ నాలుగేళ్లుగా గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గడం, మూత్రం తగ్గడం, చర్మం పలుచబడడం, కండరాల పటుత్వం తగ్గడంతో డాక్టర్‌ను సంప్రదించా. డాక్టర్ అన్ని రకాల పరీక్షలు చేసి హార్ట్ ఫెయిల్యూర్ సమస్యగా నిర్ధారించారు. అసలు ఈ సమస్య ఎందుకు వస్తున్నది? ఈ సమస్యకు తీసుకోవాల్సిన చికిత్స వివరాలు తెలియజేయగలరు.

విద్యాసాగర్, కోదాడ

హార్ట్ ఫెయిల్యూర్ సమస్యకు ముఖ్యకారణం గుండెపోటు. ఒక సారి గుండె పోటు వచ్చిన వారిలో 60 శాతం మందికి హార్ట్ ఫెయిల్యూర్ సమస్య వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. దీర్ఘకాలం పాటు బీపీ స్థాయిలు నియంత్రణలో లేకపోవడం వల్ల కూడా గుండె కండరం దెబ్బతింటుంది. మధుమేహం నియంత్రణలో లేకపోయినా హార్ట్‌ఫెయిల్యూర్ సమస్య రావచ్చు. దీర్ఘకాలికంగా కిడ్నీ జబ్బుతో బాధపడుతున్న వారిలో కూడా హార్ట్‌ఫెయిల్యూర్ సమస్య వచ్చే ఆస్కారం ఎక్కువ. చాలా అరుదుగా పుట్టుకతోనే కండరాల్లో ప్రొటీన్ తక్కువగా ఉన్నవారిలో, కాన్పు సమయంలో ఎక్కువ ఒత్తిడికి లోనయిన మహిళల్లో, అకస్మాత్తుగా విపరీతమైన మానసిక వేదనకు గురై ఆ రకమైన ఒత్తిడిని అనుభవించిన వారిలో కూడా హార్ట్ ఫెయిల్యూర్ సమస్య రావచ్చు. ఈసీజీ, యాంజియోగ్రామ్, ఇకో సాధారణంగా అవసరమయ్యే పరీక్షలు. ఒక్కోసారి ఎంఆర్ఐ, పెట్ స్కాన్ కూడా అవవసరం కావచ్చు. హార్ట్ ఫెయిల్యూర్‌కు దగ్గు, ఆయాసం వంటి పైకి కనిపించే లక్షణాలతో పాటు గుండె పరిమాణం పెరుగడం, కండరం మందంమవడం వంటి అంతర్నిర్మాణ సమస్యలు వస్తాయి. ఈ వ్యాధి తీవ్రం కాకుండా ఉండేందుకు మందులు వాడాల్సి ఉంటుంది. కిడ్నీ, కాలేయం వంటి ఇతర అవయవాల పనితీరును కూడా తరచుగా గమనిస్తూ చికిత్స కొనసాగిస్తూ ఉండాలి. సమస్య మరీ తీవ్రమైనప్పుడు గుండె కండరం పూర్తిగా దెబ్బతిన్న సందర్భాల్లో గుండెమార్పిడి అవసరమవుతుంది.



డాక్టర్ కె. వి. రాజశేఖర్ రావ్
కన్సల్టెంట్ సీటీ సర్జన్
కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్

మేకప్ సహజంగా కనిపించేలా!

- మేకప్ సహజంగా కనిపించాలంటే ముందుగా మీ చర్మాన్ని మేకప్‌కు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలి. దుమ్మును తొలగించి, తేలికపాటి స్కిన్ టోనర్‌ను ఉపయోగించి తేమ అందించాలి.
- మేకప్ వేసుకోవడానికి ముందు మాయిశ్చరైజర్ చేయాలి. తర్వాత మెరుస్తున్న చర్మంపై మేకప్ వేయడం వల్ల సహజంగా కనిపిస్తుంది.
- నల్లని మచ్చలను తొలగించడం కోసం కాంకీలర్‌ను ఉపయోగించాలి. దీనిని ముఖం మొత్తం వాడకుండా సమస్య ఉన్న దగ్గరే రాయాలి.
- మేకప్‌కు ముందు పౌడర్ అతిగా వాడకూడదు. ఎక్కువగా వాడితే మేకప్‌ను డామినేట్ చేస్తుంది.
- సహజసిద్ధ రూపం కోసం న్యూట్రల్ షేడ్స్ వాడాలి. డార్క్ కలర్స్ ఉన్నవి వాడొద్దు. శరీరంలో కలిసిపోయేవి వాడడం మంచిది.



హెచ్‌ఐవీ బాధితులకు బాసటగా..

19 ఏండ్లకే పెళ్లయింది. పెళ్లైన 40 రోజులకే హెచ్‌ఐవీ వైరస్ సోకింది. భర్త చేసిన తప్పకు అప్పటి నుంచి తాను శిక్ష అనుభవిస్తూనే ఉన్నది. సమాజం సూటిపోటి మాటలతో సూదుల్లా గుచ్చుతున్నా.. తనలాగే బాధబడుతున్న ఎందరో బాధితులకు అండగా నిలిచింది. వారి పిల్లల భవిష్యత్‌కు బాటలు వేసింది.



తమిళనాడు రాష్ట్రంలోని నమ్మక్కళ్ జిల్లాకు చెందిన కౌసల్యాది దీనత్వంలోంచి వచ్చిన చైతన్య గాథ. అది 1995వ సంవత్సరం.. 19వ ఏట అడుగుపెట్టిన కౌలస్యకు తమ బంధువైన పెరియస్వామితో పెండ్లి చేసి తమ బాధ్యత తీర్చుకున్నారు ఆమె తల్లిదండ్రులు. అయితే అతడు పెండ్లికి ముందే హెచ్‌ఐవీ బాధితుడు. ఈ విషయం తెలిసినా భర్త, అతని తల్లిదండ్రులు కౌలస్యకు చెప్పకుండా మోసం చేశారు. పెళ్లై నెల రోజులు గడువకముందే అనారోగ్యం పాలైంది కౌలస్య. ఆస్పత్రికి వెళితే హెచ్‌ఐవీ పాజిటివ్ అని తేలింది. తాను చేయని తప్పుకు ఈ శిక్షేంటని వైద్యులను నిలదీయడంతో.. నీ భర్త నుంచి సోకిందని చెప్పారు. గుండె నిండా దుఃఖం, పట్టలేని ఆగ్రహంతో భర్త, బంధువుల పోలీసు కేసు పెట్టింది. అనారోగ్యం బాధపెడుతున్నా, సమాజం చీదరిస్తున్నా కుంగిపోలేదు. తనలాగే మోసపోతున్న అమాయక మహిళల్లో చైతన్యం తీసుకురావాలని దృఢంగా నిశ్చయించుకున్నది. తనలాంటి నలుగురి బాధితులతో 1998లో 'పాజిటివ్ ఉమెన్ నెట్‌వర్క్' అనే సంస్థను స్థాపించింది. అలా తమిళనాడు నుంచి తన ప్రయాణాన్ని మొదలుపెట్టి దేశంలోని దాదాపు13 రాష్ట్రాల్లో తిరిగి.. ఆయా స్వచ్ఛంద సంస్థల ద్వారా హెచ్‌ఐవీ బాధితులల్లో చైతన్యం నింపింది. పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. బాధితుల కోసం పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. బాధితుల పిల్లలకు ఉచిత విద్యను చెప్పిస్తున్నది. ప్రస్తుతం 30వేల మందికి పైగా హెచ్‌ఐవీ బాధితులను కూడగట్టి వారికి వైద్యం అదించేందుకు కృషి చేస్తున్నది. అంతేకాకుండా బాధితులకు పెద్ద కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యాగాలు ఇప్పించేందుకు కౌలస్య ఆధ్వర్యంలోని పీడబ్ల్యూఎన్ సంస్థ కృషి చేస్తున్నది. కౌలస్య రగిలించిన స్ఫూర్తిలో పలు కంపెనీలు, కార్పొరేట్ ఆస్పత్రులు బాధితులకు ఉచిత సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నాయి.

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 26 ఫిబ్రవరి 2018

అతిపురాతన వృక్షం 'ఓల్డ్ టిజికో'



- స్వీడన్‌లోని దలార్నా ప్రావిన్స్‌లోగల ఫలుఫ్‌జల్లెట్ పర్వతంపైన ఉన్న 'ఓల్డ్ టిజికో' వృక్షం ప్రపంచంలోనే అతిపురాతన (క్లోనల్) వృక్షంగా గుర్తింపు పొందింది. దీని వయస్సు 9,958 ఏండ్లు. అయినా ఇది కేవలం 16 నుంచి 20 అడుగుల పొడవు మాత్రమే ఉంటుంది. కార్బన్ డేటింగ్ అనే ప్రక్రియ ద్వారా ఈ చెట్టు వయస్సును లెక్కించారు.
- ఫలుఫ్‌జల్లెట్ పర్వతం ఎప్పుడూ మంచుతో కప్పి ఉండటంవల్ల కొన్ని వేల ఏండ్ల పాటు ఈ వృక్షం మోడుబారిన పొదలాగా కనిపించేది. 20వ శతాబ్దంలో వాతావరణంలో మార్పులు జరిగి మంచు కరగడంతో ఇది బయటపడింది. దీన్ని లీఫ్ కుల్మన్ అనే శాస్త్రవేత్త గుర్తించాడు. తన చనిపోయిన కుక్క టిజికో గుర్తుగా ఈ వృక్షానికి ఓల్డ్ టిజికో అని పేరుపెట్టాడు.
- ఓల్డ్ టిజికో వృక్షంలో ప్రస్తుతం కనిపిస్తున్న ప్రకాండ భాగం పురాతనమైనది కాదు. ఈ చెట్టు కాండం గరిష్టంగా 600 ఏండ్లు మాత్రమే సజీవంగా ఉంటుంది. అయితే వేరువ్యవస్థ మాత్రం ఎన్నేండ్లయినా చెక్కుచెదరదు. కాండం నశించగానే వేరు నుంచి కొత్త కాండం మొలకెత్తుతుంది.
- ఈ విధంగా ఓల్డ్ టిజికో వృక్షం కొన్ని వేల ఏండ్ల నుంచి నశించిన భాగాలను పునరుత్పత్తి చేసుకుంటూ తన మనుగడ కొనసాగిస్తున్నది.

బ్రిస్టల్‌కోన్ పైన్ ట్రీ



- ఓల్డ్ టిజికో 9,558 ఏండ్లు వయస్సు కలిగి ఉన్నప్పటికీ.. దీని ప్రకాండ వ్యవస్థ శాఖీయోత్పత్తి అనే క్లోనింగ్ పద్ధతిలో 5-6 వందల ఏండ్లకోసారి నశిస్తూ, పునరుత్పత్తి చెందుతూ ఉండటంవల్ల దీన్ని ప్రపంచంలో అతిపురాతన క్లోనల్ వృక్షం అంటారు. నాన్ క్లోనల్ వృక్షాల్లో అతిపురాతనమైనది బ్రిస్టల్‌కోన్ పైన్ ట్రీ. దీని శాస్త్రీయనామం 'పైనస్ లొంగాయెవా'.
- ఈ వృక్షం కాలిఫోర్నియాలోని వైట్ మౌంటేన్ రేంజ్‌లో ఉన్నది. దీని వయస్సు 4,765 ఏండ్లు. దీనికంటే ముందు ప్రొమేథియస్ అనే పేరుగల మరో బ్రిస్టల్‌కోన్ పైన్ ట్రీ ప్రపంచ అతి పురాతన నాన్ క్లోనల్ వృక్షంగా ఉండేది. నెవడాలో ఉన్న ఆ వృక్షాన్ని 1964లో నరికారు. అప్పటికి దాని వయస్సు 4,900 ఏండ్లు.

... తోట నాగరాజు

సుడోకు

డైలీ సుడోకు 138 సమాధానం

5	4	9	2	8	6	3	7	1
1	2	8	3	7	5	9	4	6
6	3	7	9	1	4	5	8	2
7	1	3	4	2	9	8	6	5
2	6	4	8	5	7	1	9	3
8	9	5	6	3	1	4	2	7
4	5	1	7	6	8	2	3	9
9	7	2	5	4	3	6	1	8
3	8	6	1	9	2	7	5	4

డైలీ సుడోకు - 139

		3	1			4		
9				6			2	3
	2				5			8
5		8	4				3	
	4				7	9		5
1			5				6	
8	6			4				9
		4			9	5		

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెలు మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో



విదేశాల్లో చదవాలనుకుంటున్నారా?

బ్రిటిష్ కౌన్సిల్ ఇటీవల చేసిన అధ్యయనంలో భారత విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఒక దేశాన్ని ఎన్నుకునేటప్పుడు ఎలాంటి విషయాల గురించి ఆలోచిస్తారని అడిగితే, 61 శాతం మంది నాణ్యమైన విద్య అని, 42 శాతం మంది ఖర్చు అని, 43 శాతం మంది స్కాలర్‌షిప్ అవకాశాలు అన్నారు. 23 శాతం మంది ఉద్యోగం, పనిచేసే అవకాశాలు అని చెప్పారు. అందుకే విద్యార్థులు పరీక్ష రాసిన తర్వాత, ముఖ్యమైన విషయాలను బట్టి, ప్రొఫైల్ ఆధారంగా యూనివర్సిటీని ఎంచుకొని దరఖాస్తు చేసుకోవాలి.

యూనివర్సిటీని ఎలా సెలెక్ట్ చేసుకోవాలి?

మీ ప్రొఫైల్ ఆధారంగా జీఆర్ఈ/టోఫెల్/ఐఈఎల్‌టీఎస్‌లో స్కోర్లు, బ్యాచిలర్స్ డిగ్రీ పర్సంటేజ్, బ్యాక్‌లాగ్‌లు, పని అనుభవం, పేపర్ ప్రజంటేషన్, ముఖ్యమైన విజయాలు తదితర విషయాలను చూసి యూనివర్సిటీని సెలెక్ట్ చేసుకోవాలి. ఇందుకు కింది విషయాలు గుర్తించాలి.

- కోర్సు
- యూనివర్సిటీ ర్యాంకింగ్
- ప్రొఫైల్ మ్యాచ్: యూనివర్సిటీలో అడ్మిషన్ వచ్చే అవకాశం
- ట్యూషన్ ఫీజు
- మీ సబ్జెక్టులో పరిశోధనకి ఫండ్స్ ఉన్నాయా?
- రీసెర్చ్/టీచింగ్ అసిస్టెంట్‌షిప్ అవకాశాలు
- నివాస ఖర్చు
- క్యాంపస్ ఉద్యోగాలు
- మీ ప్రొఫైల్, పైన చెప్పిన విషయాలనుబట్టి ఒక యూనివర్సిటీని సెలెక్ట్ చేసుకోండి. కావాల్సిన ముఖ్యమైన డాక్యుమెంట్‌లు సమర్పించండి. సిఫారసు లేఖలు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, మీ ఆర్థికస్తోమత తెలిపే పత్రంతో కలిపి యూనివర్సిటీకి దరఖాస్తు చేయండి. జీఆర్ఈ/ఐఈఎల్‌టీఎస్/టోఫెల్‌లో మీకు వచ్చిన స్కోర్ కూడా యూనివర్సిటీకి పంపాలి. అడ్మిషన్ ఆఫర్ వచ్చిన తర్వాత, వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు ఒక్కో దేశానికి ఒక్కో ప్రక్రియ ఉంటుంది. అందుకే వెళ్లే దేశానికి సంబంధించిన వీసా వెబ్‌సైట్ చూడండి. ఉదాహరణకు అమెరికా వెళ్లాలంటే www.ustraveldocs.com/లో స్లాట్ ద్వారా యూనివర్సిటీకి 200 డాలర్ల సేవిస్ ఫీజు కట్టాలి. దీనిని www.fmjfee.com వెబ్‌సైట్ ద్వారా కట్టవచ్చు. వీసా ఇంటర్వ్యూలో అమెరికాకి ఎందుకు వెళ్తున్నారు? మాస్టర్స్ ఎందుకు చేస్తున్నారు? ఇదే యూనివర్సిటీకి ఎందుకు వెళ్తున్నారు? లాంటి ప్రశ్నలను తరుచూ అడుగుతుంటారు.

టాప్ విదేశీ యూనివర్సిటీలు

- అమెరికాలో అండర్ గ్రాడ్, మాస్టర్స్, పోస్ట్‌గ్రాడ్ కోసం టాప్ యూనివర్సిటీల్లో ఇవి కొన్ని. ప్రిన్స్‌టన్ (న్యూజెర్సీ), హార్వర్డ్ (బోస్టన్), యేల్, కొలంబియా యూనివర్సిటీలు (న్యూయార్క్), స్టాన్‌ఫోర్డ్ (కాలిఫోర్నియా), యూనివర్సిటీ ఆఫ్ చికాగో (ఇల్లినాయిస్). విదేశీ విద్యార్థుల ప్రాధాన్యం వేరే విధంగా ఉంటుంది.

సబ్జెక్టు	అయ్యే ఖర్చు (డాలర్లలో)	అయ్యే ఖర్చు (రూపాయల్లో, ఒక డాలర్ = రూ. 65)
కాలేజీ ట్యూషన్ ఫీజు (ఏడాదికి)	15000 నుంచి 35000	రూ. 9.75 లక్షల నుంచి 22.75 లక్షలు
ఉండటానికయ్యే ఖర్చు (ఏడాదికి)	12000	రూ. 7.8 లక్షలు
మొత్తం	27000 నుంచి 50000	రూ. 17.5 లక్షల నుంచి 30.5 లక్షలు

విద్యార్థులు ఎక్కువగా వెళ్లే యూనివర్సిటీలు

- పదుయా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, కొలంబియా యూనివర్సిటీ, న్యూయార్క్ యూనివర్సిటీ, అరిజోన స్టేట్ యూనివర్సిటీ, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ, ఒహియో స్టేట్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ మొదలైనవి.
- ఇంగ్లండ్‌లో.. యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్, యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ ఆండ్రూ్య, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఇంపీరియల్ కాలేజీ, డుర్హం యూనివర్సిటీ.
- కెనడాలో.. యూనివర్సిటీ ఆఫ్ టొరంటో, యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా, మెక్‌గిల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మాంట్రియల్, యూనివర్సిటీ ఆఫ్ అల్బెర్టా, మెక్ మాస్టర్ యూనివర్సిటీ.
- జర్మనీలో అయితే ఆచేన్ యూనివర్సిటీ, ఫ్రీ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్, డ్విగ్ మక్షిమిల్లి ఆన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్.
- ఆస్ట్రేలియాలో.. యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్, యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ, ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ వేల్స్.

ఆర్థికపరమైన అంశాలు

విదేశీ విద్య ఖర్చుతో కూడుకున్నది. ఈ ఖర్చును ఎలా మేనేజ్ చేస్తారనేది కూడా ముఖ్యం. కొంతమందికి తమ వ్యక్తిగత నిధుల నుంచి పెట్టే స్తోమత ఉండవచ్చు. మరికొంత మంది లోన్ తీసుకోవాల్సి రావచ్చు. లేదా స్కాలర్‌షిప్ మీద ఆధారపడాల్సి రావొచ్చు. లేదా డబ్బు లేదని ప్లాన్ మార్చుకోవచ్చు. ఏది ఏమైనా మీకున్న అన్ని అవకాశాలను వెతకండి.

ఉదాహరణకు కొన్ని విశ్వవిద్యాలయాలు అడ్మిషన్ సమయంలోనే విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నాయి. ఇతర యూనివర్సిటీలు టీచింగ్ అసిస్టెంట్‌షిప్ ఇవ్వచ్చు. లేదా రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ ఇవ్వచ్చు. వీటి ద్వారా ఫీజు కట్టుకోవడానికి కొంత వెసులుబాటు కలుగుతుంది. అందుకే యూనివర్సిటీని సెలెక్ట్ చేసుకునేటప్పుడు ఇవి కూడా ఆలోచించాలి. ఏమైనా రీసెర్చ్ ప్రాజెక్టు కానీ, గ్రాంట్ కానీ ఉందో లేదో ప్రొఫెసర్లను అడిగి తెలుసుకోవాలి.

బ్యాంకు పేరు	గరిష్ఠ లోన్ మొత్తం (రూపాయల్లో)	వడ్డీ శాతం	ఎప్పుడు తిరిగి కట్టవచ్చు	గ్యారెంటీ
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు	40 లక్షలు	11 నుంచి 13 శాతం	చదువు అయిపోయిన ఏడాది తర్వాత నుంచి	4 లక్షల వరకు అవసరం లేదు (తల్లిదండ్రులు కో-అప్లికెంట్). ఆపైన థర్డ్‌పార్టీ గ్యారంటీ
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ. 20 లక్షలు	10 నుంచి 12 శాతం	చదువు అయిపోయిన ఏడాది తర్వాత నుంచి	రూ. 7.5 లక్షల వరకు అవసరం లేదు (తల్లిదండ్రులు కో-అప్లికెంట్). ఆపైన థర్డ్‌పార్టీ గ్యారంటీ
పంజాబ్ నేషనల్ బ్యాంక్	అవసరాన్ని బట్టి	10 నుంచి 12 శాతం	చదువు అయిపోయిన ఏడాది తర్వాత నుంచి	రూ. 7.5 లక్షల వరకు అవసరం లేదు (తల్లిదండ్రులు కో-అప్లికెంట్). ఆపైన థర్డ్ పార్టీ గ్యారంటీ
ఆంధ్రా బ్యాంక్	కాలేజీ ఫీజును బట్టి	10 నుంచి 12 శాతం	చదువు అయిపోయిన ఏడాది తర్వాత నుంచి	రూ. 7.5 లక్షల వరకు అవసరం లేదు (తల్లిదండ్రులు కో-అప్లికెంట్). ఆపైన థర్డ్‌పార్టీ గ్యారంటీ

ఎంత ఖర్చవుతుంది?

చాలా మంది గ్రామీణ విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదవాలనే ఆశ ఉన్నా ఖర్చుకు భయపడి వెనకడుగు వేస్తుంటారు. కానీ చదువుకి, ఉండటానికయ్యే మొత్తం ఖర్చు ఎంత, వాటికి ఎవరన్నా సహాయం చేస్తారా అని తెలుసుకుంటే అపోహలకు అవకాశం ఉండదు. ముఖ్యంగా రెండు రకాల ఖర్చులు ఉంటాయి. ఒకటి కాలేజీ ఫీజు, రెండోది ఉండటానికి.

చాలామంది మొదటి సెమిస్టర్ ఫీజు, ఒకటి రెండు నెలలు ఉండటానికయ్యే ఖర్చులకు సరిపోయే డబ్బులు తీసుకెళ్తారు. తర్వాత ఏదో ఒక పనిచేసి కావాల్సిన మొత్తం సంపాదించుకుంటారు. అంటే వెళ్లే ముందు రూ. 6 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు సమకూర్చుకోవాలి (కాలేజీని బట్టి). గ్రామీణ విద్యార్థులకు ఈ మొత్తం కూడా చాలా ఎక్కువ.

ప్రభుత్వ సహాయం

- విదేశాల్లో ఉన్నతవిద్యను అభ్యసించే వారికోసం ప్రభుత్వం కొన్ని స్కీమ్‌లను ప్రవేశపెట్టింది. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధిలో భాగంగా విద్యార్థులకు (వార్షిక ఆదాయం రూ. 2 లక్షలకు తక్కువ ఉంటే) ప్రభుత్వం యూనివర్సిటీ ఫీజులో సహాయం చేస్తుంది. విద్యార్థులు తమ అడ్మిషన్ లెటర్‌తోపాటు IELTS/TOEFL/GRE/GMATలో వచ్చిన స్కోర్ కార్డును జతచేయాలి.
- ఇదే కాకుండా 'పడో ప్రదేశ్' అని మరో స్కీమ్ ఉంది. ఓవర్సీస్ విద్య కోసం వడ్డీపై సబ్సిడీ వస్తుంది. ఇది మైనారిటీలకు సంబంధించిన స్కీమ్.
- కేంద్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ స్కీమ్ తెచ్చింది. ఇందులో బ్యాంకుల ద్వారా తీసుకున్న లోన్‌కు వడ్డీని ప్రభుత్వం భరిస్తుంది. చదువు అయిపోయిన తర్వాత ఏడాది వరకు వడ్డీని ప్రభుత్వం భరిస్తుంది. ప్రభుత్వరంగ బ్యాంకులు ఈ స్కీమ్ ద్వారా లోన్ అందిస్తాయి.
- ఇవేకాకుండా భారత ప్రభుత్వం వేర్వేరు దేశాలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కొంతమంది విద్యార్థులకు ఫెలోషిప్, స్కాలర్‌షిప్ అందిస్తాయి. ఈ వివరాల కోసం కేంద్ర మానవ వనరుల శాఖ వెబ్‌సైట్ చూడాలి.

బ్యాంకు లోన్

- చాలా బ్యాంకులు విదేశాల్లో ఉన్నత విద్య కోసం లోన్ అందిస్తాయి. లోన్‌ను కాలేజీ ఫీజు, హాస్టల్ ఫీజు, బుక్స్ తదితర అవసరాలకు ఇస్తాయి.
- పైన చెప్పినట్టు ప్రతి బ్యాంకు రూ. 4 లక్షల వరకు ఎలాంటి గ్యారెంటీ లేకుండా లోన్ ఇస్తుంది. ప్రైవేటు బ్యాంకులు కూడా లోన్లు ఇస్తాయి. మీకు దగ్గరలోని బ్యాంకుకి వెళ్లి వివరాలు తెలుసుకోండి.

కెరీర్‌కు అవకాశాలు

- యూనివర్సిటీలో అడ్మిషన్ వచ్చిన తర్వాత ఆన్ క్యాంపస్ ఉద్యోగాలు, టీచింగ్, రీసెర్చ్, అసిస్టెంట్‌షిప్‌ల కోసం వెతక్కోవచ్చు. మీరు విద్యార్థులు కాబట్టి వారంలో కొన్ని గంటలు మాత్రమే పనిచేయగలరు.
- చదువుతున్నప్పుడే విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేయవచ్చు. అమెరికాలో దీన్ని CPT అంటారు. అమెరికాలో F-1 వీసాపై ఇంటర్న్‌గా పని చేయవచ్చు. అందుకోసం మీ యూనివర్సిటీ మీకు CPT ఇవ్వాలి. అంటే పనికోసం ఒక విధమైన పర్మిషన్ లాంటిది. కానీ, ఈ ఇంటర్న్‌షిప్ కనీసం రెండు సెమిస్టర్లు లేదా కొన్ని క్రెడిట్ కోర్సులు అయ్యాక మాత్రమే చేయవచ్చు.
- అమెరికాలో కోర్సు పూర్తయిన తర్వాత ఏడాదిపాటు అక్కడే ఉండేందుకు అవకాశం ఇస్తారు. ఈ సమయంలో మీరు ఉద్యోగం వెతుక్కోవాలి. ఎందుకంటే చదువుకోవడానికి ఎడ్యుకేషన్ పర్మిట్, పనిచేయడానికి వర్క్ పర్మిట్ కావాలి కాబట్టి. STEM కోర్సులు చదివిన విద్యార్థులు ఇంకో 24 నెలలు OPT కోరవచ్చు.

భారత్‌లో అవకాశాలు

- చదువు అనంతరం తిరిగి స్వదేశానికి రావాలనుకుంటారు. మరి అలాంటి వారికి ఇక్కడ మంచి అవకాశాలు ఉంటాయా? అని తెలుసుకోవాలి. మనం ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏం నేర్చుకున్నాం, నేర్చుకున్నది అప్లయ్ చేయగలుగుతున్నామా? అని. విదేశీ, మన విద్యావ్యవస్థలకు మౌలికమైన తేడా అక్కడే ఉంది. అందుకే విదేశాల్లో చదువుకున్న తర్వాత రెండు మూడేండ్లు అక్కడే పనిచేయడం ఉత్తమం. విదేశాల్లో టెక్నాలజీ చాలా ముందంజలో ఉంది. అక్కడ పనిచేయడంవల్ల కొత్త టెక్నాలజీల మీద అవగాహన కలుగుతుంది. ఇక్కడ తీసుకున్న లోన్ కూడా తీర్చే అవకాశం లభిస్తుంది.

ఇవి గుర్తించండి

- **క్లాస్ రూమ్ తేడాలు:** మన దేశంలోని విద్యకు, విదేశీ విద్యకు ముఖ్యమైన తేడా టీచింగ్ పద్ధతుల్లో ఉంటుంది. అక్కడ ప్రాక్టికల్స్ మీద ఎక్కువ ఫోకస్ ఉంటుంది. క్లాసులు కూడా ఎక్కువ ఇంటరాక్టివ్‌గా ఉంటాయి. చాలా మంది విద్యార్థులకు ఇది ఒక షాక్‌లా ఉంటుంది. అందుకే ముందే అలాంటి వాటికి సంసిద్ధమై వెళ్లడం మంచిది. అంతేగాక సొంతంగా చదివి నేర్చుకునే అలవాటు చేసుకోవాలి. ఒక సెమిస్టర్‌కు సంబంధించి కోర్సులు తక్కువే ఉంటాయి. కానీ, చాలా లోతుగా వీటి గురించి చర్చిస్తారు. ఇంకో ముఖ్యమైన తేడా కోర్సుల ఎంపికలో ఉంటుంది. క్లాస్‌రూమ్‌లో జరిగే చర్చల్లో పాల్గొనాలి, మాట్లాడాలి. సైలెంట్‌గా ఉంటే కుదరదు.
- **భౌగోళిక తేడాలు:** అమెరికా అంటే చలి ఎక్కువగా ఉంటుందనుకుంటారు. కానీ ప్రాంతాన్ని బట్టి తేడాలు ఉంటాయి. ఆగస్టులో ఇక్కడి కంటే అక్కడ ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. మీ యూనివర్సిటీ ఉన్న రాష్ట్రం, అక్కడి వాతావరణంపై రీసెర్చ్ చెయ్యండి. దాని ప్రకారం ప్రిపేర్ కావాలి. సిటీని బట్టి కాస్ట్ ఆఫ్ లివింగ్ ఉంటుంది. ట్యాక్సులు కూడా రాష్ట్రాన్ని బట్టి ఉంటాయి. అందుకే జాయినయ్యేముందే ఈ విషయాలు తెలుసుకోవాలి.
- **సంస్కృతి:** విదేశాలకు వెళ్లే విద్యార్థులు ముందుగా ఆలోచించేది ఆహారం గురించి. కొంతమంది అక్కడ పెరుగు దొరకదని, పచ్చళ్లు దొరకవని అంటుంటారు. విదేశీయుల ఆహార అలవాట్లు వేరుగా ఉంటాయి. కానీ, చాలా దేశాల్లో ఇండియన్ స్టోర్లు ఉంటాయి. అక్కడ మనకు కావాల్సినవన్నీ దొరుకుతాయి. దేశాన్నిబట్టి అక్కడి వాతావరణానికి సరిపోయే దుస్తులు తీసుకెళ్లాలి. ప్రొఫెసర్‌ని.. సర్ అనకుండా పేరుతో పిలువడం లాంటివి నేర్చుకోవాలి. అక్కడి సంస్కృతిని బట్టి మెలగాలి.

కోర్సుల వివరాలు

- మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్
- మాస్టర్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్
- మాస్టర్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్
- మాస్టర్స్ ఇన్ నెట్‌వర్కింగ్ & కమ్యూనికేషన్
- మాస్టర్స్ ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్
- మాస్టర్స్ ఇన్ మెటీరియల్ సైన్సెస్
- మాస్టర్స్ ఇన్ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్
- మాస్టర్స్ ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్
- మాస్టర్స్ ఇన్ ఇండస్ట్రియల్ సిస్టమ్స్ ఇంజినీరింగ్
- మాస్టర్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ
- మాస్టర్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్
- మాస్టర్స్ ఇన్ అప్లయిడ్ ఫిజిక్స్
- మాస్టర్స్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్
- మాస్టర్స్ ఇన్ నానో టెక్నాలజీ
- మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ
- మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఇన్ సౌండ్ డిజైన్
- మాస్టర్స్ ఇన్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్
- మాస్టర్స్ ఇన్ అప్లయిడ్ మ్యాథమెటిక్స్

ఉద్యోగావకాశాలు

- అమెరికాలో మాస్టర్స్ చేసిన తర్వాత కొంతమంది పీహెచ్‌డీ చేయాలనుకుంటారు. మరికొందరు ఉద్యోగ వేటలో పడుతారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, బయోటెక్నాలజీ రంగాల్లో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఇప్పుడు STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథమెటిక్స్) సబ్జెక్టులకు కూడా చాలా డిమాండ్ ఉంది. అక్కడ పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్‌లోగానీ లేదా ప్రభుత్వ శాఖల్లో కూడా మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయి. చాలామంది విద్యార్థులు కన్సల్టెన్సీ ద్వారా ఉద్యోగం సంపాదిస్తారు.
- మంచి ఉద్యోగావకాశాల కోసం డిమాండ్ ఉన్న కోర్సు చేయడం ముఖ్యం. చదువుతున్నప్పుడే, ఆ కోర్సుకు సంబంధించి ప్రాజెక్టు చెయ్యడం ద్వారా అవకాశాలు మెరుగవుతాయి. మాస్టర్స్ కంటే ముందు ఉద్యోగ అనుభవం ఉంటే అవకాశాలు సాధారణం కంటే మెరుగ్గా ఉంటాయి. ఆఖరి సెమిస్టర్‌లోనే ఉద్యోగాల కోసం అప్లయ్ చేయాలి. అదే సెక్టార్‌లో పనిచేస్తున్న తోటి భారతీయులు, మిత్రులతో చర్చించి వాళ్లు పనిచేస్తున్న కంపెనీల్లో ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేయవచ్చు.

సమాచారం కోసం ఈ వెబ్‌సైట్లు..

- www.ets.org
- https://sat.collegeboard.org/home;
- http://www.ielts.org/
- http://colleges.usnews.rankingsandreviews.com/best-colleges
- https://educationusa.state.gov/



Sirisha Reddy Dubbudu
Director,
Abhyaas
Hyderabad & Warangal

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 26 ఫిబ్రవరి 2018



రైల్వే కొలువులకు వయోపరిమితి పెంపు

రైల్వేశాఖ ఇటీవల విడుదల చేసిన 90 వేల ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థుల వయోపరిమితిని పెంచింది. ఇప్పటివరకు నిర్ణయించిన వయస్సుకు అదనంగా రెండేండ్లను పెంచారు. అసిస్టెంట్ లోకోపైలట్, టెక్నీషియన్ పోస్టులకు జనరల్ అభ్యర్థులకు 28 ఏండ్లు గరిష్ఠ వయోపరిమితి ఉండగా దాన్ని 30 ఏండ్లకు పెంచారు. అదేవిధంగా ఓబీసీలకు 31 నుంచి 33, ఎస్సీ/ఎస్టీలకు 33 నుంచి 35కు పెంచారు.

- గ్రూప్ డీ (లెవల్ – 1) పోస్టులకు జనరల్ అభ్యర్థులకు ఇప్పటివరకు 31 ఏండ్లు ఉండగా ప్రస్తుతం దాన్ని 33 ఏండ్లకు పెంచారు. అదేవిధంగా ఓబీసీలకు 34 నుంచి 36కు, ఎస్సీ/ఎస్టీలకు 36 నుంచి 38 ఏండ్లకు పెంచారు.
- ఆర్ఆర్‌బీలు విడుదల చేసిన 1/2018, 2/2018 నోటిఫికేషన్ల దరఖాస్తు గడువులను మార్చారు.
- **సవరించిన తేదీలు:** ఫిబ్రవరి 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది.
- **దరఖాస్తుల దాఖలుకు చివరితేదీ:** మార్చి 31.
- పూర్తి సమాచారం కోసం rrbsecunderabad.nic.in వెబ్‌సైట్ చూడవచ్చు

భయం వీడితే.. జయం మీదే...



మార్చినే తలుచుకుంటే మూర్ఛలే ముంచుకొచ్చే.. అంటూ విద్యార్థులు పరీక్షా కాలంలో ఆందోళన చెందడం సహజం. పరీక్షల సమయం దగ్గర పడుతుంది. దీంతో ఈ సమయంలో వివిధ సబ్జెక్టుల్లో ఇప్పటివరకు చదివి అవగాహన చేసుకున్న అంశాలనే పునశ్చరణ చేయాలి. కొందరికి పరీక్షలంటే భయం.. టెన్షన్.. రాత్రింబవళ్లు తెగ చదివేయాలన్న ఆతృతతో అతిగా మేలుకోవడం, సరైన ప్రణాళిక, టైం మేనేజ్‌మెంట్, సరైన ఆహార నియమాలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవు. చదివి అవగాహన చేసుకున్న అంశాలను బాగా రాసి మంచి ఫలితం తెచ్చుకోవాలంటే.. కిది సూచనలు పాటించండి. విజయాన్ని సాధించండి.

బద్ధకాన్ని వీడాలి

బద్ధకాన్ని, వాయిదా తత్వాన్ని వీడి చదువుపైనే పూర్తి దృష్టి సారించండి. కాలం విలువైనది. పరీక్షా సమయాల్లో ప్రతీ క్షణం కీలకమైనది. తెల్లవారు జామున 4 గంటలకే లేచి కఠినమైన విషయాలను చదువుకుంటే బాగా అవగతమవుతాయి. బాగా చదువుకోడానికి వేకువజాము సమయం అత్యంత అనుకూలం. చదువుకునే గది వాతావారణం ప్రశాంతంగా ఉండాలి. టీవీ, మొబైల్, ఆడియో ప్లేయర్లు సమీపంలో ఉంచుకోకండి. చదివేటప్పుడు దృష్టి మరలితే విలువైన సమయం వృథా అవుతుంది. చదువుకు ఆటంకం కలిగించే అంశాలను గుర్తించి వాటికి దూరంగా ఉండండి. స్నేహితులు, కుటుంబ సభ్యులతో వాదనలు, ఘర్షణలకు దిగవద్దు. మానసికంగా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించాలి.

నూతన అంశాలను చదవొద్దు

వివిధ సబ్జెక్టుల్లో ఇప్పటివరకు చదివిన అంశాలనే పునశ్చరణ చేయాలి. అంతేగాని నూతన అంశాలను చదవొద్దు. నూతన అంశాలతో తికమకపడే అవకాశం ఉంటుంది. పదో తరగతిలో ఎక్కువమంది విద్యార్థులు మాతృభాష తెలుగులోనే తక్కువ మార్కులు తెచ్చుకోవడం, ఫెయిల్ కావడం కూడా జరుగుతుంది. దీనికి కారణం కేవలం భయమే. నూతన ప్రదేశంలో పరిచయంలేని ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య పరీక్ష రాయాలి. దీంతో బెరుకు వల్ల మొదటి పేపర్ సక్రమంగా రాయలేక ఇబ్బంది పడుతుంటారు. దీనిని అధిగమించాలి.

- రెండు ఇష్టమైన విషయాల మధ్య ఒక క్లిష్టమైన విషయాన్ని చదివితే కష్టమనిపించదు.
- రాత్రి చదివేముందు స్నానం చేసి గదిలో పరిమళాన్ని ఇచ్చే అగరుబత్తి వెలిగించి గదిలోని లైట్లు ఆర్పి టేబుల్ ల్యాంప్ పెట్టుకుని చదవండి.

చేతి రాత బాగుండాలి

సరళమైన ఆకట్టుకునే చేతిరాతతో ఎగ్జామినర్లను ఆకట్టుకోవచ్చు. చేతిరాత కనీసం చదివేందుకు వీలుగా ఉండాలి. ప్రశ్నలకు సంబంధించిన జవాబులను సరైన హెడ్డింగ్స్, సబ్ హెడ్డింగ్స్ పెట్టి పాయింట్‌వైజ్‌గా రాయాలి. ప్రధానాంశాలను అండర్‌లైన్ చేయాలి. కాగితం పై ఒత్తి పట్టి రాయవద్దు. పరీక్ష రోజే కొత్త పెన్ను వాడవద్దు. రెండురోజుల ముందుగానే ఆ పెన్నుతో రాస్తూ అలవాటు చేసుకోవాలి.

ఆత్మవిశ్వాసమే ఆయుధం

ఆత్మవిశ్వాసమే లక్ష్యసాధనకు ప్రధాన ఆయుధం. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులు, సన్నిహితుల సూచనలు, ప్రణాళికాబద్ధ ప్రిపరేషన్ దోహదపడుతాయి. భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షాహాల్లోకి వెళ్లగలిగితే సగం విజయం సాధించినట్లే. మనసును ప్రశాంతంగా ఉంచుకుని ఒత్తిడికి గురికాకుండా పరీక్షహాల్లో ప్రశ్నపత్రం తీసుకోగానే క్షుణ్ణంగా చదివి వెంటనే ఓ ప్రణాళిక రూపొందించుకోవాలి. బాగా వచ్చిన ప్రశ్నలు, కొద్ది లోపంతో వచ్చిన ప్రశ్నలు, రాని ప్రశ్నలను గుర్తించి మొదటగా బాగా వచ్చిన ప్రశ్నలనే రాయాలి. తర్వాత కొద్ది లోపంతో వచ్చిన ప్రశ్నలు, ఆ తర్వాత మిగతావాటి గురించి ఆలోచించాలి. సమయాన్ని గమనిస్తూ అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగేలా జాగ్రత్త పడాలి.

అనుకూలమైన టైం మేనేజ్‌మెంట్

- ఉదయం 4–6 గంటల వరకు కఠినమైన సబ్జెక్టు చదవడం
- ఉదయం 6–7 గంటల వరకు సులభమైన సబ్జెక్టు చదవడం
- ఉదయం 7–7.45 వరకు కాలకృత్యాలు, టిఫిన్
- ఉదయం 8.30–12.30 వరకు స్టడీ అవర్స్
- మధ్యాహ్నం 12.30–1.30 భోజనం, కొద్దిసేపు విశ్రాంతి.
- మధ్యాహ్నం 1.30–5.30 వరకు స్టడీ అవర్స్
- సాయంత్రం 5.30–6.30 రిఫ్రెష్‌మెంట్, రాత్రి భోజనం.
- సాయంత్రం 6.30–8.30 వరకు కఠినమైన సబ్జెక్టు చదవడం
- రాత్రి 8.30–11.00 వరకు సులభమైన సబ్జెక్టు చదవడం
- రాత్రి 11.00 కు నిద్ర పోవడం

ప్రతి గంటకోసారి 10 నిమిషాలు రిలాక్స్ అవుతూ చదువు కొనసాగిస్తే రోజులో కనీసం 14 గంటలు కృషి చేసినట్లవుతుంది. అలసటగా అనిపిస్తే నిమిషంపాటు ఇంటిపైకప్పువైపు చూస్తూ స్కై వాకింగ్ చేస్తే మెదడు, మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఇలా చదువు కొనసాగిస్తే శారీరక అలసట కూడా ఉండదు. పగటి పూటే ఎక్కువగా చదువుకోవాలి. రాత్రి ఎక్కువగా మేల్కొంటే మెలటోనిన్ హార్మోన్ సమతుల్యత దెబ్బతిని నీరసంతో పాటు మెదడు సక్రమంగా పనిచేయదు.

సమతుల ఆహారం అవశ్యం

- ఈ సమయంలో సమతుల ఆహారం చాలా అవశ్యం. ముఖ్యంగా పిండి పదార్థాలు (బియ్యం, గోధుమలు), మాంసకృత్తులు (పప్పు), తాజా కూరగాయలు, తాజా పండ్లు, పాలు, పాల సంబంధ పదార్థాలు తీసుకునే ఆహారంలో కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి.
- అరటి పండుతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి.
- ఉదయం ఆహారంలో పిండి పదార్థాలు (బియ్యం, గోధుమలు), మాంసకృత్తులు (పప్పు) తప్పక తీసుకోవాలి. రాత్రి కూడా అవే తీసుకుంటే మంచిది.
- స్వీట్లు, శీతల పానీయాలు, పానీపూరి, చాక్లెట్లు వంటి వాటికి దూరంగా ఉండాలి. లేకపోతే అతినిద్ర ఆవహించి చదువుకు భంగం కలుగుతుంది.
- మసాలా, నూనె పదార్థాలు తీసుకోవద్దు.
- కాఫీ మానేయాలి.
- బాదం పప్పు, పాలు, తాజా పండ్లు తీసుకోవాలి.
- మాంసాహారులకు చేప మంచిది. చేపల్లోని ఫాటీ ఆమ్లాలు నాడీ మండలాన్ని చైతన్యం చేస్తాయి.
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, దోశ, అటుకులు, వేరుశనగ చట్నీ, ఉడికించిన గుడ్డు, ఇష్టమైతే బ్రెడ్ తీసుకుంటే మంచిది.
- మధ్యాహ్నం అన్నంలో పప్పుతో కూరగాయల సలాడ్ తీసుకుంటే మంచిది.
- సాయంత్రం ఎండు ఖర్జూర, రాగి మాల్ట్ తీసుకుంటే శరీరానికి ఐరన్ లభించి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చిరాకు తగ్గించి ఒత్తిడికి దూరం చేస్తుంది. అలాగే తాజా పండ్లు, జామకాయలు, మొక్కజొన్న, వేయించిన శనగపప్పు తీసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్ జోలికి వెళ్లవద్దు.
- రాత్రి అన్నానికి బదులుగా చపాతి, జొన్నరొట్టె, మసాలా లేని, నూనె తక్కువగా ఉండే కూరలు తినాలి.
- కొబ్బరి నీళ్లు, అధికంగా మంచి నీరు తీసుకోవాలి.
- ఈ సూచనలను పాటిస్తూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోవాలి. అనవసరంగా ఆందోళన చెందవద్దు. వచ్చిన జవాబులను మంచిగా రాసేందుకు ప్రయత్నించాలి. రాయలేకపోయిన వాటి గురించి ఆలోచించకండి. ధైర్యంగా, ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే తప్పక విజయం లభిస్తుంది.

ధ్యానంతో ఏకాగ్రత

- పరీక్షల్లో జ్ఞాపకశక్తికి ప్రాముఖ్యం ఎక్కువ. దాన్ని పెంచుకోవడానికి ధ్యానం ఒక మార్గం. అది ఒత్తిడిని జయించి ఏకాగ్రత సాధించేందుకు దోహదపడుతుంది.



మహమ్మద్ సలీం షరీఫ్
మండల విద్యాధికారి, నడిగూడెం
సూర్యాపేట జిల్లా. 9948506786

ఒత్తిడిని జయిద్దాం!

కాలంతో పోటీపడే రోజులివి. అందుకుతగ్గట్టుగానే ప్రతిఒక్కరిపై ఒత్తిడి ఉంటుంది. ముఖ్యంగా పోటీ పరీక్షలు, ఫైనల్ పరీక్షలు, ఎంట్రన్స్ ఎగ్జామ్స్ రాసే విద్యార్థులపై ఒత్తిడి ఏ మేరకు ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. లక్ష్యాలు, ర్యాంకుల వేటలో చిత్తవుతున్న విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కోవడం ఎలా? ఒత్తిడి బారిన పడకుండా తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు ఏంటి? వంటి విషయాల గురించి నిపుణ సలహాలు.

సోషల్ మీడియాకు దూరంగా..



మంచి నిద్ర మెడిసిన్ లాంటిది. నిర్ణీత వేళలో నిద్రపోవడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. అయితే చాలామంది విద్యార్థులు సోషల్ మీడియాకు అడిక్ట్ కావడంవల్ల నిద్రకు దూరమవుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, మెయిల్స్ చెకింగ్ వంటి వాటికి అలవాటు పడటం వల్ల తెలియకుండానే నిద్రాభంగం కలుగుతుంది. ఎక్కువ గంటలు కంప్యూటర్‌కూ అతుక్కుపోవడం కూడా ఒత్తిడికి గురిచేస్తుంది. నిద్రకు ఉపక్రమించేముందు సోషల్ మీడియాకు దూరంగా ఉండటం మంచిదని సైకాలజిస్టులు చెబుతున్నారు.



కాస్త నడవండి!

స్పోర్ట్స్ అంటే ఇష్టమా? అయితే తరచుగా ఇష్టమైన గేమ్స్ ఆడుతుండండి. స్పోర్ట్స్‌తో ఈజీగా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. గేమ్స్ ఆడటం వల్ల బాడీ ఎండార్ఫిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల శరీరానికి స్వాంతన చేకూరి రిలాక్స్‌డ్‌గా ఉండేలా చేస్తుంది. ప్రతి రోజు కనీసం అరగంటయినా నడిస్తే స్ట్రెస్ లెవల్స్ తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. తరచుగా జాగింగ్ చేసేవారి మూడ్ కూడా బాగుంటుంది. గేమ్స్‌తో పాటు యోగా కూడా ఒత్తిడిని తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుంది.

పది నిమిషాలు బ్రీతింగ్

అదేపనిగా మాట్లాడటం చాలా సులువు. కానీ రోజులో కనీసం పది నిమిషాలు సైలెంట్‌గా ఉండటానికి మీరు ఎప్పుడైనా ప్రయత్నించారా? ఓ పది నిమిషాలు ప్రశాంతంగా శ్వాసను అబ్జర్వ్ చేస్తూ మెడిటేషన్ చేసినట్లయితే స్ట్రెస్ లెవల్స్ తగ్గుతాయి. బ్రీతింగ్ టెక్నిక్స్‌తో మనసు తేలిక పడుతుంది.

పెట్స్‌తో సరదాగా




పెంపుడు జంతువులతో సరదాగా గడపడంవల్ల ఆరోగ్యంగా ఉండగలుగుతారు. ఇతరులతో పోల్చితే పెంపుడు జంతువులతో గడిపేవారు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండగలుగుతారు. పెట్స్ కూడా ఒత్తిడిని దూరం చేస్తాయని జంతు ప్రేమికులు చెబుతున్నారు.



మీరే రోల్ మోడల్

ప్రస్తుత పోటీ యుగంలో ఎవరిని ఎవరు పట్టించుకునే పరిస్థితులు ఉండవు. మీ సమస్యలను వినడానికి ఎవరూ ముందుకు రాకపోవచ్చు. దీనివల్ల మరింత కుంగుబాటుకు లోనుకాకుండా మీకు మీరే ధైర్యం చెప్పుకోవాలి. సెల్ఫ్ టెస్ట్‌తో మిమ్మల్ని మీరు చెక్ చేసుకోవాలి. మంచి పుస్తకాలను చదవాలి. విజేతల నుంచి స్ఫూర్తి పొందాలి.

సంగీతం వినడం



ఒత్తిడిని అధిగమించే దివ్యౌషధం సంగీతం. సంగీతం వినడం ద్వారా మనసు తేలికపడి ఒత్తిడికి దూరంగా ఉండగలుగుతారు. ఏ కాస్త ఒత్తిడికి గురైనా ఇష్టమైన సంగీతం వినడం ద్వారా మనసు తేలికపడుతుంది. మూడ్ బాగాలేనప్పుడు ఇష్టమైన మ్యూజిక్‌ను ఆస్వాదిస్తే ఆ ఆనందమే వేరు.

అంచనాలొద్దు

కొంతమంది ఏదైనా పనిని ప్రారంభించిప్పుడు వెంటనే ఫలితాలను ఆశిస్తారు. పనికంటే ఫలితం మీద ఫోకస్ చేయడంవల్ల తాము ఏర్పర్చుకున్న అంచనాలు తారుమారవుతుంటాయి. కాబట్టి అంచనాలకు తావివ్వకుండా ఫలితమేదైనా పనిచేసుకుంటూ పోవాలి.


నో స్మోకింగ్

స్మోకింగ్ వల్ల మనసు రిలాక్స్ అవుతుందని భావిస్తుంటారు కొందరు. కానీ అందులోని నికోటిన్, టొబాకో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీని కారణంగా తీవ్ర ఒత్తిడికి లోనై అనారోగ్యానికి గురవుతారు. స్మోకింగ్‌కు వీలైనంత దూరంగా ఉండాలని పరిశోధకులు సైతం హెచ్చరిస్తున్నారు.

జర నవ్వండి



ఒత్తిడిని అధిగమించడంలో ముందుండేది నవ్వు ఒకటి. కొంత మందికి నవ్వడానికి మొహమాటం అడ్డొస్తుంటుంది. కానీ బిగ్గరగా నవ్వడం వల్ల రక్తప్రసరణలు బాగా జరిగి స్ట్రెస్ లెవల్స్ తగ్గుతాయి. ఎప్పుడు సీరియస్‌గా ఉండకుండా హాస్యచతురత ఉన్నవారు ఇతరుల కంటే చురుగ్గా ఉంటారనేది సైకాలజిస్టుల అభిప్రాయం.



ఒత్తిడికి గల కారణాలు

- సరైన ప్లానింగ్ లేకపోవడం
- క్రమశిక్షణ లోపించడం
- ప్రాక్టీస్ చేయకపోవడం
- రివిజన్‌కు సమయం కేటాయించకపోవడం
- స్పష్టమైన లక్ష్యం లేకపోవడం
- ఓటమి ఎదురైనప్పుడు మరో ప్రయత్నం చేయకపోవడం

వీటికి దూరంగా ఉండాలి

- క్రికెట్
- సినిమాలు
- కంప్యూటర్. టీవీ
- సెల్‌ఫోన్

ప్రధాన కారణాలు

- ఏదైనా అంశం పట్ల బలవంతంగా శ్రద్ధ చూపడం
- సమస్యలు ఉన్నాయని పదేపదే చింతించడం
- నిర్ణీత సమయంలో పూర్తిచేయాల్సిన అసైన్‌మెంట్స్‌ను పూర్తిచేయకపోవడం
- ఆందోళన, తలనొప్పి
- ఆహారపు అలవాట్లు, నిద్రవేళల్లో మార్పులు

తల్లిదండ్రులకు సూచనలు

- ప్రిపరేషన్, పరీక్షల సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక ధైర్యం ఇవ్వాలి.
- బి$_{12}$, ప్రొటీన్ ఎక్కువగా లభించే మాంసాహారం ఇవ్వాలి.
- సోషల్ మీడియాకు అడిక్ట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రతిభను ప్రోత్సహించాలి.
- అసంతృప్తి వీడేలా చూడాలి.
- పిల్లల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించాలి.
- టైమ్ మేనేజ్‌మెంట్ పాటించేలా చూడాలి.
- సానుకూల ఆలోచనలను పెంపొందించాలి.

ర్యాంకులు ముఖ్యం కాదు!



విద్యార్థులు ముఖ్యంగా ప్రణాళిక ఏర్పర్చుకోవాలి. అందుకు తగ్గట్టుగా ప్రిపేర్ కావాలి. చాలామంది స్టూడెంట్స్ పరీక్షలు సమీపిస్తున్నాయంటేనే ప్రిపరేషన్ మొదలుపెడుతారు. ఇది సరైంది కాదు. గతంలోని ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి చదువుకోవాలి. దీని ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. ఒక్కో విద్యార్థి ఒక్కోస్థాయి కలిగి ఉంటాడు. ఇతరులతో పోల్చుకున్నట్లయితే ఒత్తిడిబారిన పడతారు. ఇతరులతో కంపేర్ చేసుకోకుండా చదువుకోవాలి. దీనికితోడు తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా ఎలాంటి ఒత్తిడికి గురిచేసే టార్గెట్స్ ఇవ్వకూడదు. చదువు అనేది కేవలం జ్ఞానం కోసం మాత్రమే. ర్యాంకుల కోసం కాదు. మనసుకు నచ్చే పనులు చేయడంవల్ల ప్రశాంతంగా ఉండగలుగుతారు.

– హెచ్. వెంకటేశ్వర్లు,
ఫార్మల్ హెడ్ అండ్ డీన్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్, ఓయూ



కొత్త విషయాలపై ఆసక్తి

రోజులో పది, పదిహేను నిమిషాలు కొత్త విషయాలపై ఆసక్తి చూపడంవల్ల ఉత్సాహంగా ఉంటారు. ఎప్పటికప్పుడు మైండ్‌కు పని చెబుతూ ఉండాలి. కొత్త విషయాల్లో నిమగ్నం కావడంవల్ల ఒత్తిడి దరి చేరకుండా ఉత్సాహంగా ఉండగలుగుతారు. దీనివల్ల చురుగ్గా ఉంటూ షెడ్యూల్‌ను కొనసాగించవచ్చు.

... బాలు జాజాల



అంతకు ముందు ఎప్పుడూ చూడని కొత్త అందాన్ని ఈ జగతికి పరిచయం చేద్దామని సంకల్పించిన సృష్టికర్త బ్రహ్మ తన సృజనకు పదునుపెట్టాడు. ఓ బొమ్మని ప్రతిష్టించాడు. చక్కటి కొలతలతో తీర్చిదిద్దాడు. అభినయ కళను రంగరించాడు. కొన్ని పూల రెక్కలు, తేనె చుక్కలు, మెరుపు ముక్కలు కలబోసి ప్రాణప్రతిష్ట చేశాడు. ఆ అపురూప తేజోమయమూర్తిని ఈ భువిపై సాక్షాత్కరింపజేశాడు. ఆ మనోజ్ఞసౌందర్యరాశిని చూసి అఖిలప్రజలు జేజేలు కొట్టారు. అందమంటే ఆమెదే అన్నారు. శ్రీదేవి నామధేయంతో పిలిచారు. వెండితెరవేల్పుగా ఆరాధించారు. ఇంద్రలోకాల్లో తిరుగాడే దేవకన్యలు సైతం అసూయ చెందే కాలాతీత సౌందర్యరాశి శ్రీదేవి. తరాల అంతరాల్ని చెరిపివేస్తూ సమ్మోహన రూపం, అసాధారణ అభినయంతో భారతీయ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధులను చేసిన హృదయసామ్రాజ్ఞి. ముప్పైఏళ్లకుపైగా సుదీర్ఘ నట ప్రయాణంలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఆరాధ్య నాయికగా జననీరాజనాలందుకున్న అందాల అభినేత్రి శ్రీదేవి అర్థాంతర నిష్క్రమణం యావత్ దేశాన్ని నివ్వెరపోయేలా చేసింది. ఆసేతు హిమాచలాన్ని కన్నీటి సంద్రంలో ముంచెత్తింది. శ్రీదేవి పాత్రలు అజరామరం. ఆమె కీర్తి ఆచంద్రతారార్కం ప్రభవిస్తూనే ఉంటుంది.

'తునైవన్'తో తెరంగేట్రం..



తమిళనాడు రాష్ట్రంలోని శివకాశిలో 1963 అగస్టు 13న జన్మించింది శ్రీదేవి. ఆమె అసలు పేరు శ్రీఅమ్మయ్యంగార్ అయ్యప్పన్. బాలనటిగా 'తునైవన్' అనే తమిళ సినిమాతో నాలుగేళ్ల వయసులో వెండితెరపై అరంగేట్రం చేసింది. ఈ చిత్రంలో తమిళులకు ఆరాధ్యదైవమైన మురుగన్ పాత్రలో నటించింది శ్రీదేవి. రచయిత కణ్ణదాసన్ ఆ బాలికకు శ్రీదేవి అని నామకరణం చేశారు. బాలనటిగా తొలి సినిమానే శ్రీదేవికి ఎనలేని గుర్తింపును తీసుకొచ్చింది. ఆ తర్వాత శివాజీ గణేషన్‌తో 'కందన్ కరుణై', ఎమ్‌జీఆర్‌తో 'నమ్‌నాడు'తో పాటు పలు సినిమాల్లో బాలనటిగా నటించింది. పదేళ్ల వయసులోనే బిజీ ఆర్టిస్టుగా మారిపోయింది. శోభన్‌బాబు ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా నాన్న నిర్దోషి' సినిమాతో తెలుగు చిత్రసీమలో బాలనటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'బడిపంతులు' సినిమాలో ఆయన మనవరాలిగా నటించింది. ఏఎన్నాఆర్ నటించిన 'భక్తతుకారం' సినిమాలో ఆయన కూతురిగా నటించింది.

కూతురే కొడుకైన వేళ



తల్లిదండ్రులతో బాల్యంలో శ్రీదేవి

శ్రీదేవికి తల్లిదండ్రులు రాజేశ్వరి, అయ్యప్పన్ అంటే అమితమైన గౌరవం ఉండేది. వారి మాటను ఎప్పుడూ జవదాటేది కాదు. తల్లి సలహా లేకుండా ఏ పని మొదలుపెట్టదు. షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నా వారితో రోజుకొక్కసారైన మాట్లాడుతుండేది. 'లమ్హే' సినిమా సమయంలో ఆమె తండ్రి చనిపోయారు. ఆయన చనిపోయిన పదహారు రోజుల తర్వాత తిరిగి యథావిధిగా తిరిగి షూటింగ్‌లో పాల్గొని తన అంకితభావాన్ని చాటుకుంది. ఆ తర్వాత 'జుదాయి' సమయంలో ఆమె తల్లి మరణించింది. కొడుకుగా మారి తన తల్లి అంత్యక్రియలను స్వయంగా నిర్వహించింది శ్రీదేవి.

అభినేత్రి..హృదయసామ్రాజ్ఞి



ఆటగాడు...



శ్రీరంగనీతులు..



కిరాయి కోటిగాడు



త్రిశూలం..

అజరామర పాత్రలతో సాగిన ప్రస్థానం

తెలుగు వెండితెరపై శ్రీదేవి పోషించిన పాత్రలు అజరామరంగా, స్మృతిపథంలో చెదరని జ్ఞాపకాలుగా అలరారుతూనే ఉంటాయి. తెలుగులో అరంగేట్ర చిత్రం 'పదహారేళ్ల వయసు' లోనే ప్రేక్షకుల హృదయాల్ని కొల్లగొట్టింది శ్రీదేవి. ఈ సినిమాలో ఆమె తొలి యవ్వనపు స్నిగ్ధ సౌందర్యాన్ని, ముగ్ధ మనోహర రూపాన్ని చూసి ప్రేక్షకులు మైమరచిపోయారు. ఈ సినిమాలో మల్లి పాత్రలో శ్రీదేవి అద్భుతాభినయం తెలుగువారిని మంత్రముగ్ధుల్ని చేసింది. రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన ఈ చిత్రం శ్రీదేవి కెరీర్‌కు ఘనమైన ఆరంభాన్నిచ్చింది. 'వసంత కోకిల' శ్రీదేవి సినీ జీవితంలో కీలక మలుపు. కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి బాలుమహేంద్ర దర్శకుడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తన గతాన్ని మరచిపోయిన భాగ్యలక్ష్మి పాత్రలో అసాధారణ అభినయాన్ని కనబరచింది. ఆరేళ్ల బాలిక మనస్తత్వంతో అమాయకపు హావభావాలు, ముద్దుముద్దు మాటలతో హృదయాల్ని స్పృశించింది. ఈ సినిమాతో శ్రీదేవి ఉత్తమనటిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారాన్ని అందుకుంది. ఈ చిత్రం 'సద్మా'గా హిందీలో పునర్నిర్మించబడి ఘన విజయాన్ని దక్కించుకుంది. ఈ చిత్రాన్ని శ్రీదేవి కెరీర్ తొలినాళ్లలో ఓ మైలురాయిగా అభివర్ణించవొచ్చు. బాలచందర్ దర్శకత్వం వహించిన 'ఆకలిరాజ్యం' చిత్రంలో దేవి పాత్రలో శ్రీదేవి అబ్బురపరిచే అభినయాన్ని ప్రదర్శించింది. వ్యంగ్యం, హాస్యం మేళవింపుతో చలాకీ అమ్మాయిగా ఆమె పాత్ర ప్రేక్షకుల్లో మనోఫలకాలపై ముద్రించుకుపోయింది. ఆమెలోని హాస్యచాతుర్యాన్ని చక్కగా ఆవిష్కరించింది.'కన్నెపిల్లవని కన్నులున్నవని' పాటలో శ్రీదేవి అభినయం సదా స్మరణీయం. శోభన్‌బాబు సరసన శ్రీదేవి నటించిన 'కార్తీకదీపం'ఆమెలోని ఆర్ద్రమైన అభినయానికి అద్దం పట్టింది. రాధగా ఆమె సంఘర్షణాభరిత పాత్రకు జీవం పోసింది. కృష్ణతో నటించిన 'పచ్చనికాపురం' శ్రీదేవిలోని మరో కోణాన్ని ఆవిష్కరించింది. భర్తను అపార్థం చేసుకొని అనుక్షణం సంఘర్షణకు గురయ్యే పాత్రలో ఆమె అభినయం అందరినీ మెప్పించింది. ఇక శోభన్‌బాబు సరసన నటించిన 'దేవత' చిత్రంలో అక్కకోసం తన ప్రేమను త్యాగం చేసిన పుణ్యమూర్తిగా శ్రీదేవి నటన హృదయాల్ని ద్రవింపజేసింది. అక్కినేనితో నటించిన 'ప్రేమాభిషేకం' చిత్రాన్ని శ్రీదేవి కెరీర్‌లో కలికితురాయిగా పేర్కొనవచ్చు. ప్రేమ విఫలై కలతచెందే దేవి పాత్రలో అక్కినేనితో సమానమైన అభినయంతో అందరి హృదయాల్ని గెలుచుకుంది. శ్రీదేవి నటించిన ప్రేమకథా చిత్రాల్లో 'ప్రేమాభిషేకం' ఓ క్లాసిక్‌గా నిలిచిపోయింది.



జగదేకవీరుడు అతిలోకసుందరి

అతిలోకసుందరి అరుదెంచిన వేళ

'జగదేకవీరుడు అతిలోక సుందరి' చిత్రంలో శ్రీదేవి అందచందాలు, అసమాన అభినయం తెలుగు ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేశాయి. అప్పటిరోజుల్లో తెలుగునాట శ్రీదేవి మానియా ఆవహించింది. దేవకన్య ఇంద్రజగా శ్రీదేవి అభినయానికి ప్రేక్షకులోకం నీరాజనం పట్టారు. 'ఈ మానవుని చెంత చేరి అచ్చికబుచ్చికలాడి, మచ్చికచేసుకొని నా అంగుళీకము సంపాదించెద' 'నీ వామ హస్తాన్ని నా దక్షిణ హస్తానికి అందించెదవా' వంటి సంభాషణలు పాపులర్ అయ్యాయి.'అబ్బనీ తియ్యనీ దెబ్బ' గీతం ఉర్రూతలూగించింది. 'అందాలలో అహో మహోదయం' అనిపించిన శ్రీదేవి సౌందర్యానికి ప్రేక్షకులందరూ సలామ్ కొట్టారు. అతిలోకసుందరిగా శ్రీదేవి సార్థకనామధేయురాలైంది. రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో 'క్షణం క్షణం'లో సత్య పాత్రలో శ్రీదేవి చలాకీ నటనతో ఆకట్టుకుంది. 'గోవిందా గోవిందా' చిత్రంలో నవీనగా అలరించింది. ఇవేగాక వేటగాడు, భోగభాగ్యాలు, అనురాగదేవత, జస్టిస్‌చౌదరి, బొబ్బిలిపులి, త్రిశూలం, కంచుకాగడ వంటి చిత్రాల్లో చక్కటి అభినయంతో మెప్పించింది శ్రీదేవి.

స్వయంకృషితో విజయప్రస్థానం

అంకితభావం, నిబద్ధతకు శ్రీదేవిని ప్రతీకలా భావిస్తారు. సుదీర్ఘ నట ప్రస్థానంలో ఉన్నత వ్యక్తిత్వమే శ్రీదేవిని నటిగా శిఖరాగ్రాన నిలిపాయని చెబుతారు. నేటి తరానికి ఆమె జీవితం ఓ స్ఫూర్తిదాయకం.

రాఘవేంద్రరావుతో 24 సినిమాలు



దర్శకుడు రాఘవేంద్రరావు, శ్రీదేవిలది తెలుగు చిత్రసీమలో విజయవంతమైన కాంబినేషన్. వీరిద్దరి కలయికలో 24 సినిమాలు(తెలుగులో 15, హిందీలో తొమ్మిది) రూపొందాయి. ఒక దర్శకుడు, కథానాయిక కలిసి అన్ని సినిమాలు చేయడం అరుదనే చెప్పవచ్చు. పదహారేళ్ల వయసు, వేటగాడు, గజదొంగ, భలే కృష్ణుడు, కొండవీటి సింహం, త్రిశూలం, దేవత, జస్టిస్‌చౌదరి, వజ్రాయుధం, ఆఖరిపోరాటం, జగదేకవీరుడు, అతిలోక సుందరి వంటి చిత్రాలు అద్భుత విజయాల్ని సొంతం చేసుకున్నాయి. శ్రీదేవి పాత్ర చిత్రణలో రాఘవేంద్రరావు ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. ప్రతి సినిమాలో హీరో పాత్రలకు ధీటుగా శ్రీదేవి పాత్రను తీర్చిదిద్దేవారు. శ్రీదేవిని పాటల్లో నయనమనోహరంగా ఆవిష్కరించేవాడు. రాఘవేంద్రరావు చిత్రాల ద్వారానే శ్రీదేవి అందాల తారాగా, అతిలోకసుందరిగా పేరు సంపాదించుకుంది. రాఘవేంద్రరావుతో 25వ సినిమా చేయాలన్నది తన కోరిక అని శ్రీదేవి చాలా సార్లు వెల్లడించింది. ఆ కోరిక తీరకుండానే తిరిగిరానిలోకాలకు పయనమయింది.

తెలుగులో ఆఖరి చిత్రం

సుదీర్ఘ ప్రస్థానంలో నటనకే తన జీవితాన్ని అంకితం చేసింది శ్రీదేవి. చాలా ఏళ్ల క్రితం తన సోదరి శ్రీలత కోసం చిరంజీవి కథానాయకుడిగా 'వజ్రాలదొంగ' అనే సినిమాను నిర్మించడానికి సంకల్పించింది. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో ఎమ్జీఆర్ చేతుల మీదుగా మొదలైన ఈ సినిమా అనివార్య కారణాల వల్ల మధ్యలోనే ఆగిపోయింది.

- చిరంజీవి కలిసి నటించిన 'ఎస్.పి. పరశురామ్ తర్వాత తెలుగులో సినిమాలు చేయలేదు శ్రీదేవి.

మూడుతరాలతో మమేకం..

ఎన్టీఆర్‌తో కలిసి నటించిన చిత్రాల ద్వారా శ్రీదేవి తెలుగులో కమర్షియల్ స్టార్‌డమ్‌ను అందుకుంది. వీరిద్దరు కలిసి 12 సినిమాల్లో నటించారు. అందులో వేటగాడు, అనురాగదేవత, కొండవీటి సింహం, సర్దార్ పాపారాయుడు, రౌడీ రాముడు, కొంటె కృష్ణుడు, ఆటగాడు, జస్టిస్ చౌదరి, బొబ్బిలిపులి, అగ్గిరవ్వ, కొండవీటి సింహాసనం మంచి విజయాల్ని సాధించాయి. ఏఎన్నార్‌తో ప్రేమకానుక, ప్రేమాభిషేకం, శ్రీరంగనీతులు, ఉరంతా సంక్రాంతి, ముద్దుల మొగుడు, బంగారు కానుక వంటి సినిమాల్లో జోడీ కట్టింది. వీరిద్దరి కలయికలో 'ప్రేమాభిషేకం' క్లాసిక్‌గా నిలిచిపోయింది. తెలుగులో కృష్ణతో కలిసి 30కిపైగా చిత్రాల్లో నటించింది. అందులో వజ్రాయుధం, ఖైదీ రుద్రయ్య, పచ్చని కాపురం, కంచు కాగడా, రామరాజ్యంలో భీమరాజు, కృష్ణావతారం, మహారాజశ్రీ మాయగాడు, జయం మనదే, కిరాయికోటిగాడు వంటి విజయవంతమైన చిత్రాలున్నాయి. శోభన్‌బాబుతో మోసగాడు, కార్తీకదీపం, దేవత, ఇల్లాలు వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నటించారు. చిరంజీవితో రాణికాసుల రంగమ్మ, జగదేకవీరుడు అతిలోక సుందరి, ఎస్పీ పరశురామ్ చిత్రాల్లో నటించింది. ఏఎన్నార్‌తో హిట్‌జోడీగా పేరు తెచ్చుకున్న శ్రీదేవి..ఆయన తనయుడు నాగార్జునతో కలిసి 'ఆఖరిపోరాటం' 'గోవిందా గోవిందా' చిత్రాల్లో నటించింది. రామానాయుడు నిర్మించిన అనేక చిత్రాల్లో నటించిన శ్రీదేవి ఆయన కుమారుడు వెంకటేష్‌తో కలిసి 'క్షణం క్షణం' చిత్రంలో జోడీ కట్టింది. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చిరంజీవి, నాగార్జున, వెంకటేష్... ఇలా మూడుతరాల కథానాయకులతో కలిసి నటించిన ఏకైక నాయిక శ్రీదేవి కావడం విశేషం.



'దేవత'..



'జగదేకవీరుడు అతిలోకసుందరి



ఆఖరిపోరాటం



క్షణ క్షణం

అతిలోకసుందరి శ్రీదేవి అర్థాంతరంగా తనువు చాలించడంతో భారతీయ సినీలోకం దిగ్భ్రాంతికిలోనయింది. యావత్ చిత్ర పరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది. శ్రీదేవి మరణవార్త తెలుసుకొని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని బాధాతప్తులయ్యారు.

భారత సినీ రంగంలో శ్రీదేవి లాంటి నటి మరొకరు లేరు రారు. చిన్న వయసులో ఆమెను కోల్పోవడం బాధగా వుంది. శ్రీదేవి కళ కోసమే పుట్టింది. కళే ప్రాణంగా బతికింది. ఆమెకున్న అంకితభావం మరెవరిలోనూ చూడలేదు. 'జగదేకవీరుడు అతిలోక సుందరి'లో ఇంద్రజ పాత్ర తన కోసమే పుట్టిందా? అన్నట్లు నటించి మెప్పించింది. శ్రీదేవితో నా కెరీర్ పరంగా కాకుండా కుటుంబ సాన్నిహిత్యమూ వుంది. ఇరు కుటుంబాల్లో ఏమైనా ఫంక్షన్‌లు జరిగితే ఒకరినొకరు ఆహ్వానించుకోవడం...హాజరుకావడం జరుగుతుంటుంది. నా 60వ జన్మదినం రోజున బోనీకపూర్, శ్రీదేవి దంపతులు వచ్చి ఆశీర్వదించారు. అంత గొప్పనటిని కోల్పోవడం నిజంగా భారతీయ చిత్రపరిశ్రమ చేసుకున్న దురదృష్టం.

– చిరంజీవి

శ్రీదేవి మృతి నన్ను కలచివేసింది. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి శ్రీదేవితో పరిచయం వుంది. 'పదహారేళ్ల వయసు' నుంచి 'జగదేకవీరుడు అతిలోక సుందరి' వరకు ఆమెతో చాలా సినిమాలు తీశాను. శ్రీదేవి అధిరోహించని మైలురాయి లేదంటే అతిశయోక్తి కాదు. బాలనటి నుంచి మహానటి వరకు నాతో ప్రయాణం చేసిన శ్రీదేవి హఠాన్మరణం అత్యంత బాధాకరం. భారతీయ చిత్రపరిశ్రమకు తీరనిలోటు. ఎక్కడ వున్నా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా.

– రాఘవేంద్రరావు

శ్రీదేవి చనిపోయారని తెలిసి షాక్‌కు గురయ్యాను. ఓ మంచి స్నేహితురాలిని కోల్పోయాను. చిత్రపరిశ్రమ గొప్ప నటిని కోల్పోయింది. శ్రీదేవి కుటుంబం ఎంత బాధపడుతున్నదో నేనూ అంతే బాధపడుతున్నాను.

– రజనీకాంత్

టీనేజ్ నుంచి గొప్ప నటిగా ఎదిగిన శ్రీదేవిని చూశాను. స్టార్‌డమ్‌కు ఆమె అర్హురాలే. ఆమె చనిపోయిందని తెలియగానే ఆఖరిసారి నేను శ్రీదేవిని కలిసిన జ్ఞాపకాలన్నీ ఒక్కసారి నా కళ్ల ముందు మెదిలాయి. 'సద్మా' చిత్రంలోని లాలిపాట ఇంకా వినపడుతూనే వుంది.

– కమల్‌హాసన్

ఈ బాధాకర వార్త విని దిగ్భ్రాంతి చెందాను. శ్రీదేవి తొలి లేడీ సూపర్‌స్టార్. 50 ఏళ్లు రాణించడం అద్భుతం. ఎంత చక్కటి ప్రయాణం. ఊహించని ముగింపు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా.

– ఎస్.ఎస్.రాజమౌళి

శ్రీదేవి మరణవార్త తెలిసి షాక్ అయ్యాను. చాలా విచారంగా వుంది. ఆమె అద్భుతమైన నటి. ఎప్పటికీ నా అభిమాన నటి. త్వరగా వెళ్లిపోయారు. ఆమె కుటుంబానికి, శ్రేయోభిలాషులకు ధైర్యాన్ని ఇవ్వాలని దేవుడ్ని కోరుకుంటున్నా. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి.

– మహేష్‌బాబు


భారతీయ వెండితెరపై తనదైన ముద్రను వేసిన శ్రీదేవిగారి హఠాన్మరణం నమ్మలేనిది. ఆమె చనిపోయారనే వార్త తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాను. అసమానమైన అభినయ ప్రతిభతో భారత ప్రేక్షక లోకం అభిమానాన్ని ఆమె చూరగొన్నారు. శ్రీదేవిగారు ఇక లేరు అనే మాట నమ్మలేనిది. ఆమె వెండితెరపై పోషించిన పాత్రలన్నీ చిరస్మరణీయాలే.

స్వర్గం నుంచి వచ్చారు. అక్కడికే తిరిగి వెళ్లిపోయారు.

– ఎన్టీఆర్

శ్రీదేవి చనిపోవడం చాలా బాధాకరం. భారతీయ సినీ పరిశ్రమకు నేడు దుర్దినం. ఆమె కుటుంబానికి ఆ దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలి.

– హీరో వెంకటేష్



శ్రీదేవి మృతికి సంతాపంగా ఒడిశా పూరీ బీచ్‌లో సుదర్శన్ పట్నాయక్ వేసిన సైకత శిల్పం


దుబాయిలో శ్రీదేవి కుటుంబసభ్యులతో కలిసి దిగిన ఆఖరి ఫొటో.


ఎమ్జీఆర్ చేతుల మీదుగా 1981 ఫిలింఫేర్ అవార్డు అందుకుంటున్న శ్రీదేవి (ఫైల్)



అఖిల భారతావని అభిమాన నాయిక

నమస్తే తెలంగాణ, సినిమా డెస్క్:

దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లి సూపర్‌స్టార్‌గా వెలుగొందిన కథానాయికల్లో శ్రీదేవి అపూర్వమైన స్థానం సంపాదించుకున్నదనడం అతిశయోక్తికాదు. బాలీవుడ్‌లో ఆమె సాధించిన అనితరసాధ్య విజయాలు భారతీయ సినీచరిత్రలో అతిలోకసుందరికి సమున్నతగౌరవాన్ని సంపాదించిపెట్టాయి. హిందీలో శ్రీదేవి తొలిచిత్రం 'సోల్వా సావన్'(1979) అంతగా ప్రజాదరణ పొందలేదు. అనంతరం జితేంద్ర సరసన నటించిన 'హిమ్మత్‌వాలా' (1983) ఆమె సమ్మోహన అభినయాన్ని హిందీ ప్రేక్షకులకు పరిచయం చేసింది. ఈ సినిమాలోని 'నైనోమే సప్నా..' అనే గీతం ఆనాటి యువతరాన్ని ఉర్రూతలూగించింది. ఆ తర్వాత రాఘవేంద్రరావు దర్శకత్వంలో రామానాయుడు నిర్మించిన 'తోఫా' చిత్రం కూడా మంచి విజయాన్ని దక్కించుకుంది. తెలుగు 'దేవత' చిత్రానికి రీమేక్‌గా 'తోఫా'ను తెరకెక్కించారు. ఈ చిత్రం శ్రీదేవిని హిందీ చిత్రసీమలో అగ్రతారగా నిలబెట్టింది. ఎనభయ్యో దశకంలో జితేంద్ర-శ్రీదేవి 16 చిత్రాల్లో జంటగా నటిస్తే అందులో 13 చిత్రాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. తమిళ రీమేక్ 'మూండ్రామ్ పిరై'ని హిందీ రీమేక్ 'సద్మా' శ్రీదేవికి పేరుప్రఖ్యాతుల్ని తీసుకొచ్చింది. 'నగీనా' (1986) చిత్రం నాగినిగా శ్రీదేవిని సరికొత్త అవతారంలో ఆవిష్కరించింది. పాము ఇతివృత్తంతో రూపొందిన భారతీయ అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా 'నగీనా' పేరు పొందింది. శేఖర్‌కపూర్ దర్శకత్వంలో వచ్చిన 'మిస్టర్ ఇండియా' (1987) శ్రీదేవి కెరీర్‌లో మరపురానిచిత్రంగా నిలిచింది. ఇందులో ఆమె క్రైమ్ రిపోర్టర్‌గా చక్కటి అభినయాన్ని కనబరచింది. హాస్యాభినయంతో మెప్పించింది. ఈ సినిమాలోని 'హవా హవాయి' గీతం అత్యంత జనాదరణను పొందింది. ఈ గీతం ప్రతిధ్వనులు అనేకచిత్రాల్లో వినిపించాయి. యష్‌చోప్రా దర్శకత్వంలో శ్రీదేవి 'చాందినీ', 'లమ్హే' చిత్రాల్లో నటించింది. 'చాందినీ' చిత్రంలో హిందీలో తొలిసారిగా డబ్బింగ్ చెప్పింది. 'లమ్హే' హృద్యమైన ప్రేమకథగా కల్ట్‌క్లాసిక్‌గా నిలిచిపోయింది. అనంతరం 'ఖుదాగవా', 'గుమ్రాహ్' 'రూప్‌కి రాణి ఛోరోంకా రాజా', 'లాడ్‌లా' 'జుదాయి' వంటి చిత్రాలు శ్రీదేవికి హిందీ చిత్రసీమలో తిరుగులేని గుర్తింపును తెచ్చిపెట్టాయి. బాలీవుడ్‌లో దాదాపు 70కి పైగా చిత్రాల్లో శ్రీదేవి నటించింది. జితేంద్ర మొదలుకొని అమితాబ్‌బచ్చన్, ధర్మేంద్ర, రిషికపూర్, అనిల్‌కపూర్, రాజేష్‌ఖన్నా, సన్నీడియోల్, సల్మాన్ ఖాన్, షారూఖ్‌ఖాన్ వంటి అగ్ర నాయకులందరితో శ్రీదేవి నటించింది. జితేంద్ర, అనిల్‌కపూర్‌తో అత్యధిక చిత్రాల్లో నటించింది. అమితాబ్‌బచ్చన్‌తో కలిసి 'ఇంక్విలాబ్' 'ఆఖరీ రాస్తా', 'ఖుదాగవా' చిత్రాల్లో నటించింది. 2012లో 'ఇంగ్లీష్ వింగ్లీష్' చిత్రం ద్వారా సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. శ్రీదేవి నటించిన చివరి చిత్రం 'మామ్' గత ఏడాది విడుదలైంది.


ముంబైలో శ్రీదేవి ఇంటిముందు కంటతడిపెడుతున్న అభిమానులు

పదమూడేండ్ల వయసులో హీరోయిన్‌గా అరంగేట్రం

1976లో తమిళ దిగ్గజ దర్శకుడు కే బాలచందర్ 'మూండ్రు ముడుచ్చు' చిత్రంతో 13 ఏండ్ల శ్రీదేవిని కథానాయికగా పరిచయం చేశారు. శ్రీదేవితోపాటు తమిళ చిత్రసీమలో అగ్రకథానాయకులైన కమల్ హాసన్, రజనీకాంత్ ప్రధానపాత్రధారులుగా తెరకెక్కిన ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించింది. సెల్వి పాత్రలో శ్రీదేవి నటనకు విమర్శకుల ప్రశంసలు లభించాయి. ఆ తర్వాత కే భాగ్యరాజా దర్శకత్వంలో రూపొందిన 'సిగప్పు రోజాక్కళ్, భారతీరాజా 'పదినారు వయదినిలే' బాలూమహేంద్ర 'మూండ్రాం పిరై' చిత్రాలు తమిళంలో ఆమెను అగ్రకథానాయికల్లో ఒకరిగా నిలబెట్టాయి.

తమిళ తెరపై తనదైనముద్ర

శ్రీదేవి తన సుదీర్ఘ సినీప్రయాణంలో తమిళంలో 72 సినిమాల్లో నటించింది. బాలచందర్, భారతీరాజా, బాలూమహేంద్ర వంటి అగ్రదర్శకులతో పాటు శివాజీగణేషన్, ఎమ్‌జీఆర్, రజనీకాంత్, కమల్‌హాసన్ నుంచి విజయ్ వరకు తమిళ స్టార్ హీరోలందరితో సినిమాలు చేసింది. సెల్వి (మూండ్రు ముడిచ్చు), మెయిల్(పథినారు వయథినిలే), కోకిల(మీండుం కోకిల), భాగ్యలక్ష్మి (మూండ్రుపిరై).. ఇలా ఆమె పోషించిన ప్రతిపాత్ర ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. మనిందారిల్ ఇతనాయ్ నిరంగల, ప్రియ, ధర్మయుద్ధం, కళ్యాణరామన్, పట్టాకత్తి భైరవన్, గురు, జానీతో పాటు పలు తమిళ సినిమాల్లో అసమాన అభినయంతో మెప్పించింది శ్రీదేవి. 1986లో రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కిన నాన్ అడిమై ఇల్లై సినిమా తర్వాత తమిళ సినిమాలకు దూరమైన శ్రీదేవి దాదాపు పందొమ్మిదేళ్ల విరామం తర్వాత 'పులి' సినిమాలో ప్రతినాయిక పాత్రలో నటించింది.

కమల్‌హాసన్,రజనీకాంత్‌లతో..

తమిళంలో రజనీకాంత్, కమల్‌హాసన్ తనకు అత్యంత సన్నిహితులని తరుచుగా చెబుతుండే శ్రీదేవి ఈ ఇద్దరితోనే ఎక్కువగా సినిమాలు చేసింది. దక్షిణాది చిత్రసీమలో రజనీకాంత్, శ్రీదేవి విజయవంతమైన జోడీల్లో ఒకరిగా గుర్తింపును సొంతం చేసుకున్నారు. తమిళం, మలయాళం, తెలుగు, హిందీ భాషల్లో వీరిద్దరి కాంబినేషన్‌లో 20కి పైగా సినిమాలు వచ్చాయి. తాయిల్లామల్ నానిల్లై, ధర్మయుద్ధం, రామ్‌రాబర్ట్‌రహీమ్ (తెలుగు), జానీ, పోకిరి రాజా, అడుత్త వరిసుతోపాటు హిందీలో భగవాన్‌దాదా, జానీఉస్తాద్, చాల్‌బాజ్, ఫరిష్తే చిత్రాలతోపాటుగా రజనీకాంత్, శ్రీదేవి నటించిన ప్రతి సినిమా ప్రేక్షకాదరణతో హిట్ కొట్టింది. అలాగే కమల్‌హాసన్‌తో దాదాపు 20 సినిమాలు చేసింది. మూండ్రు ముడిచ్చు, సిగప్పు రోజాక్కల్, చక్కిపోడు రాజా, నీల మలర్గళ్, కళ్యాణరామన్, గురు, మీండుం కోకిల, ఆకలిరాజ్యం(తెలుగు), వాళ్వే మాయం, ఆఖ్రీ సంగ్రామ్ (హిందీ) తదితర చిత్రాల్లో కమల్ హాసన్, శ్రీదేవి జంట ప్రేక్షకుల హృదయాల్ని ఓలలాడించింది. తమిళ, హిందీ పరిశ్రమలకే పరిమితం కాకుండా మలయాళం, కన్నడ భాషల్లోనూ నటిగా తనదైన ముద్రను చాటుకున్నది శ్రీదేవి. మలయాళంలో 26 సినిమాలు, కన్నడంలో ఆరు సినిమాల్లో నటించింది.

అదే గొప్ప నిర్ణయం

బోనీకపూర్‌తో కలిసి తొలిసారి 'మిస్టర్ ఇండియా' సినిమా చేసింది శ్రీదేవి. ఆ సినిమాతో మొదలైన వారి స్నేహబంధం పెళ్లికి దారితీయడానికి దాదాపు పదేండ్లు పట్టింది. తొలిసారి తల్లి చికిత్స కోసం న్యూయార్క్ వెళ్లిన శ్రీదేవికి బోనీకపూర్ అండగా నిలిచారు. ఆ సమయంలోనే ఇద్దరి మధ్య స్నేహం బలపడింది. తన మంచి మనసుతో శ్రీదేవి హృదయాన్ని గెలిచాడు బోనీ కపూర్. శ్రీదేవి నటించిన సినిమాలు చూసి ఆమెతో ప్రేమలో పడిపోయాడు బోనీకపూర్. ఆమెపై ఉన్న ఇష్టంతోనే 'మిస్టర్ ఇండియా' సినిమా తీశాడు. ఆ సినిమాతో వారి మధ్య అనుబంధం బలపడింది. బోనీకపూర్‌తో పెండ్లికి శ్రీదేవి అంగీకరించడం అభిమానులు, ఇండస్ట్రీ వర్గాలతోపాటు కుటుంబ సభ్యులను ఆశ్చర్యానికి లోనుచేసింది. అప్పటికే బోనీకపూర్‌కు మోనాషౌరీతో పెండ్లి అయ్యింది. ఆమెతో మనస్పర్థల కారణంగా బోనీకపూర్ శ్రీదేవికి దగ్గరవ్వడమే కాకుండా పెండ్లి కూడా చేసుకున్నారు. తల్లిదండ్రులు దూరమై శ్రీదేవి కష్టాల్లో ఉన్నప్పుడు బోనీకపూర్ ఆమెకు అండగా నిలిచాడు. ఆమెలో ధైర్యాన్ని నింపాడు. అందుకే అతడితో పెండ్లికి సిద్ధపడింది శ్రీదేవి. తన జీవితంలో తీసుకున్న అతి గొప్ప నిర్ణయాల్లో బోనీకపూర్‌ను పెండ్లిచేసుకోవడం ఒకటని చాలాసార్లు చెప్పింది. పెండ్లి తర్వాత సినిమాలకు దూరమైన శ్రీదేవి పూర్తిగా కుటుంబానికే అంకితమైంది. చాలాసార్లు సినిమా అవకాశాలు తలుపుతట్టినా తన కూతుళ్లు జాహ్నవి, ఖుషీల ఆలనాపాలనే ముఖ్యమని తిరస్కరించింది.





పద్మశ్రీ పురస్కారం

భిన్నభాషల్లో చెరగని ముద్రవేసిన శ్రీదేవిని ఎన్నో పురస్కారాలను వరించాయి. సినీరంగానికి ఆమె చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2013లో పద్మశ్రీఅవార్డుతో సత్కరించింది. 15 సార్లు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయిన శ్రీదేవి ఆరుసార్లు ఆ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నది. 'క్షణక్షణం' సినిమాలో అద్వితీయ నటనతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న ఆమెను నంది పురస్కారం వరించింది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమనటి పురస్కారంతోపాటు పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను సొంతం చేసుకున్నది.

సెకండ్ ఇన్నింగ్స్

దాదాపు పదిహేనేండ్ల తర్వాత 'ఇంగ్లిష్ వింగ్లిష్' సినిమాతో మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది శ్రీదేవి. ఇంగ్లిష్‌భాష రాక ఇబ్బందులు పడే మధ్యతరగతి గృహిణిగా సహజ అభినయంతో ఆకట్టుకొని తనలో నటన పట్ల ఉన్న ఆసక్తి కొంచెం కూడా తగ్గలేదని నిరూపించింది. చిత్రసీమలో అడుగుపెట్టిన తొలినాళ్లలో భాషల కారణంగా తాను ఎదుర్కొన్న అనుభవాలే ఈ సినిమాలో నటించడానికి తనకు స్ఫూర్తినిచ్చాయని ప్రారంభోత్సవ వేడుకలో చెప్పింది. తమిళ చిత్రం 'పులి'లో ప్రతినాయిక పాత్రలో కనిపించి తనకుతానే సాటి అని నిరూపించుకున్నది. ఆతర్వాత దాదాపు రెండేండ్లు విరామం తీసుకున్న శ్రీదేవి 'మామ్' సినిమాను ఒప్పుకుంది. తన కూతురికి జరిగిన అన్యాయంపై ప్రతీకారం తీర్చుకునే తల్లి పాత్రలో శ్రీదేవి అసమాన అభినయానికి విమర్శకుల ప్రశంసలు దక్కాయి.

జయతో ప్రత్యేక అనుబంధం

చెన్నై: టాలీవుడ్‌ను, ఆ తర్వాత బాలీవుడ్‌ను ఏలిన శ్రీదేవి చిన్ననాట తమిళ సినిమా ఒడిలో నటనలో నడకలు నేర్చింది. 1969లో తునైవర్ సినిమాతో బాలనటిగా అడుగుపెట్టిన శ్రీదేవి రెండో చిత్రమే 'నమ్‌నాడు'. ఎమ్జీఆర్, జయలలిత జంటగా నటించిన ఆ చిత్రంలో శ్రీదేవి ఓ అబ్బాయి వేషం వేసి అందరినీ ఆకట్టుకుంది. అప్పటినుంచి జయలలితకు శ్రీదేవికి ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. తర్వాత చాలాచిత్రాల్లో ఇద్దరూ నటించారు. ఆదిపరాశక్తిలో బేబీ శ్రీదేవి మురుగన్‌గా నటించింది. తెలుగుచిత్రం భార్యాబిడ్డలులో మరోసారి ఇద్దరూ కలిసి నటించారు. 1974లో తిరుమాంగల్యంలో వారి కాంబినేషన్ ప్రేక్షకులకు ఎంతగానో నచ్చింది. ఇద్దరి మధ్య అలాఅలా లోతైన అనుబంధం ఏర్పడింది. గత ఏడాది జయ పాత్రలో శ్రీదేవి నటించడం గురించిన చర్చ వచ్చింది. దానిపై శ్రీదేవి స్పందిస్తూ అది చాలా పెద్దభారమే అవుతుందని చెప్పారు. ఉభయుల అభిమానులకు మాత్రం తీరని కోరిక మిగిలిపోయింది. జయలలిత వందేండ్ల సినిమా ఉత్సవాల్లో శ్రీదేవి సేవలకుగాను ఘనంగా సత్కరించారు. మంచి మాటకారి, సంస్కారి, ఆప్యాయతగల జయమ్మతో కలిసి ఎన్నో చిత్రాల్లో పనిచేయడం తన అదృష్టమని ఆమె చనిపోయినప్పుడు శ్రీదేవి ట్విట్టర్‌లో నివాళులు అర్పించారు.

శ్రీదేవి చిరస్మరణీయురాలు
సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ సినీనటి శ్రీదేవి హఠాన్మరణంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర విచారం వ్యక్తంచేశారు. తెలుగు, హిందీతోపాటు దేశంలోని పలు ప్రాంతీయ భాషల సినిమాల్లో నటించిన శ్రీదేవి తన అందం, నటన, నృత్యాలతో ఎందరో అభిమానులను సంపాదించుకున్నారని చెప్పారు. సినిమాల్లో నటిస్తూనే చిన్న వయసులో ఆమె మరణించడం విచారకరమని పేర్కొన్నారు. శ్రీదేవి మరణం భారతీయ సినీ పరిశ్రమకు, తెలుగు సినిమా అభిమానులకు ఎంతో వెలితిని మిగులుస్తుందని సీఎం చెప్పారు. సీనియర్ ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వర్‌రావు, శోభన్‌బాబు వంటి ప్రముఖ నటులతో తీసిన చిత్రాలు మంచి గుర్తింపును తీసుకొచ్చాయని, శ్రీదేవి పోషించిన ఎన్నో అద్భుతమైన పాత్రలు ఆమెను చిరస్మరణీయంగా ఉంచుతాయని పేర్కొన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

షాక్‌కు గురయ్యా: మంత్రి కేటీఆర్



ప్రముఖ సినీనటి శ్రీదేవి మరణంపై రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అనేకమంది అభిమానుల్లాగే ఆమె మరణవార్త విని తానూ షాక్‌కు గురయ్యానని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కేటీఆర్ ఓ ట్వీట్ చేశారు. 'శ్రీదేవి మరణం షాక్‌కు గురిచేసింది. రెండేండ్ల కిందట ఓ స్టార్టప్ కార్యక్రమంలో ఆమెతో భేటీ అయ్యాను. ఆమె నమ్రత, వ్యక్తిత్వం ఆకట్టుకుంది' అని పేర్కొంటూ సంతాపాన్ని ప్రకటించారు.

త్వరలో శ్రీదేవి సంతాపసభ: తలసాని

సినీనటి శ్రీదేవి ఆకస్మిక మృతిపై సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆమె మృతి చిత్ర పరిశ్రమకే కాకుండా ఆమె అభిమానులకు తీరని లోటన్నారు. త్వరలో సినీరంగ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్‌లో శ్రీదేవి సంతాపసభను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నటనతో అభిమానులను మెప్పించారని, ఆమె కుటుంబసభ్యులకు తలసాని సానుభూతి తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే లక్ష్మణ్ శ్రీదేవి మృతికి సంతాపాన్ని తెలియజేశారు.

శ్రీదేవి మృతి నన్ను కలిచివేసింది. ఆమె నటనకు, స్వభావానికి నేను పెద్ద అభిమానిని. ప్రేమ, గౌరవంతో మిమ్మల్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకునే ఉంటాం మాడమ్.
– బాలీవుడ్ నటుడు ఆమిర్‌ఖాన్

ఇంద్రుడికి కన్ను కుట్టింది. ఇంతటి సౌందర్యరాశి భూలోకంలో ఉండటం ఏమిటని సురులకు అసూయ పుట్టింది. అందుకే మన శ్రీదేవిని తీసుకెళ్లిపోయారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి. **– రచయిత పరుచూరి గోపాలకృష్ణ**

ఆమె మరణవార్త విని షాక్ నుంచి తేరుకోలేకపోతున్నా. నేను శ్రీదేవిని పప్పి అని పిలిచేదాన్ని. ఆమెతో నాకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిది. ఆమె నిగర్వి. **– నటి శారద**

శ్రీదేవి మరణం భారతీయ సినీ పరిశ్రమను షాక్‌కు గురిచేసింది. ఆమె ఎవరూ చేయలేనంత గొప్పగా నటించింది.
– నటుడు కృష్ణంరాజు

శ్రీదేవి హఠాన్మరణం బాధాకరం. ఆమెతో నాన్నగారు చాలా సినిమాల్లో నటించారు. ఎలాంటి భావాన్నైనా కండ్లతోనే పలికించగల మహానటి. **– నటుడు నందమూరి బాలకృష్ణ**

శ్రీదేవి మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇది దుర్వార్త. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతున్నా.
–హీరో అల్లు అర్జున్

ఇది నిజం కాకూడదని అనుకుంటున్నా. శ్రీదేవి చనిపోవడం నిజంగా చాలా బాధాకరం. **– హీరో నితిన్**

బాలనటిగా ఉన్నప్పటి నుంచి శ్రీదేవి నాకు తెలుసు. అందరితోనూ ఎంతో చలాకీగా ఉండేది. **– నటుడు చంద్రమోహన్**

ఆమె మృతివార్తను నమ్మలేను. లెజెండరీ నటి ఇకలేరు. భారత చిత్ర పరిశ్రమలో ఆమె స్థానం, ఖ్యాతి చెరిగిపోనిది.
– నటి రకుల్‌ప్రీత్‌సింగ్

ఆమె మృతివార్తను నమ్మలేకపోతున్నా. మాటలు రావడం లేదు. కపూర్, జాన్వి, ఖుషి ధైర్యంగా ఉండాలి.
– పరిణీతి చోప్రా

శ్రీదేవి మరణవార్త విని గుండె పగిలిపోయింది. ఆమె ఆత్మకు శాంతి కలుగాలి. **– నటి రమ్యకృష్ణ**

శ్రీదేవి మృతిని నమ్మలేకపోతున్నా. అసమాన ప్రతిభావంతురాలైన ఆమె.. మరణించడంపై ఏం మాట్లాడాలో తెలియడం లేదు. **– నటి శృతిహాసన్**

శ్రీదేవి మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె నిజమైన తార, అత్యంత గౌరవనీయురాలు. **– నటి నయనతార**

శ్రీదేవి మరణం నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఆమె మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు. ఆమె అందరికీ రోల్ మోడల్.
– నటి రోజా

శ్రీదేవి హిట్‌సాంగ్స్

అతిలోకసుందరి శ్రీదేవి నటించిన చిత్రాల్లోని అనేక గీతాలు ఎప్పటికీ ప్రేక్షకుల్ని అలరిస్తూనే ఉంటాయి. ఆమె గుర్తుకొస్తే ఎన్నో మరపురాని గీతాలు మస్తిష్కంలో కదలాడుతుంటాయి. శ్రీదేవి నటించిన సినిమాల్లోని జనాదరణ పొందిన కొన్ని గీతాలివి..

1. సిరిమల్లెపువ్వా.. సిరిమల్లెపువ్వా.. చిన్నారి చిలకమ్మా..(పదహారేళ్ల వయస్సు)
2. నా కళ్లు చెబుతున్నాయి... నిన్ను ప్రేమించానని.. (ప్రేమాభిషేకం)
3. అబ్బనీ.. తియ్యనీ.. దెబ్బ.. ఎంత కమ్మగా ఉందిరో అబ్బ (జగదేగవీరుడు అతిలోక సుందరి)
4. వెన్నెలయినా.. చీకటైనా.. చేరువైనా.. దూరమైనా.. (పచ్చని కాపురం)
5. వెల్లువచ్చి గోదారమ్మా ఎల్లాకిల్లా పడ్డాదమ్మా (దేవత)
6. అమ్మ బ్రహ్మదేవుడో ఎంత గొప్ప సొగసురో.. (గోవిందా గోవిందా)
7. జామురాతిరి.. జాబిలమ్మా, అమ్మాయి ముద్దు ఇవ్వందే. (క్షణ క్షణం)
8. కన్నెపిల్లవని.. కన్నులున్నవని..(ఆకలిరాజ్యం)
9. అందాలలో.. అహో.. మహోదయం (జగదేకవీరుడు అతిలోక సుందరి)
10. ఆకుచాటు పిందెతడిసే.. (వేటగాడు)
13. కలగా కల్పనగా కనిపించెను (వసంతకోకిల)
14. నమస్తే సుస్వాగతం..(కిరాయి కోటిగాడు)
15. ఈ బుగ్గ మీద గోరుగిచ్చుడు ఏంటబ్బా (వజ్రాయుధం)
16. పంటచేలలో (పదహారేళ్ల వయసు)
17. తెల్లచీర.. మల్లెపూలు(సర్దార్ పాపారాయుడు)
18. ఇది ఒకటో నంబర్ బస్సు..., తెల్లా తెల్లా చీరలోన చందమామ..(బొబ్బిలిపులి)
19. జాబిలితో చెప్పనా..(వేటగాడు)
20. రా గురూ.. (ఖైదీ రుద్రయ్య)
21. నవీనా నవీనా.. (గోవిందా గోవిందా)
22. నీ చేతులలో తలదాచి.. (కార్తీకదీపం)
23. స్వాతి చినుకు.. (ఆఖరి పోరాటం)
24. మైనే తేరీ దుష్మన్.. (నగీనా)
25. చుడియా.. (లమ్హే)
26. ఆ మేరీ జాన్.., మిత్వా.. (చాందిని)
27. ఛమ్ ఛమ్ ఛాని.. (సుహాగ్)
28. తూ ముజే సునా.. (చాందిని)
29. గోరీ తేరే అంగ్ అంగ్.. (తోఫా)
30. తూ ముజే కాబూల్.. (ఖుదాగవా)

అతిలోకసుందరి.. నటలోక చాందినీ

శ్రీదేవి అనే మూడక్షరాలు వేసిన చెరగని ముద్రను అపురూపంగా గుండెల్లో దాచుకున్న అభిమానజనులను శోకసంద్రంలో ముంచి ఓ తార మళ్లీ దివికేగింది. బాలీవుడ్ చరిత్రలో మొట్టమొదటి సూపర్‌స్టార్‌గా వెలుగొందిన శ్రీదేవి ఏకాఏకిన ఈ లోకం నుంచి సెలవు తీసుకుంది. అవును, మృత్యువుకు జాలే కాదు తెలివీ లేదని తేలిపోయింది. శ్రీదేవి మరణం అనేది పొసగని పదబంధమే మరి. అప్పుడెప్పుడో శివకాశిలో కన్నుతెరచిన ఆ మెరుపుతీగ దుబాయి పెండ్లిసందడిలో ఏదో గుర్తొచ్చినట్టు హఠాత్తుగా కన్నుమూసింది. ఆమెను ఆరాధించే అశేషజనానికి కాళ్లకింద నేల తొలుచుకుపోయింది.

నమస్తే తెలంగాణ, సెంట్రల్ డెస్క్: బాలనటిగా, యువనటిగా, ప్రౌఢనటిగా కొన్నితరాలను అలరించిన శ్రీదేవి మరణం నమ్మలేని నిజమై నిలిచింది. ఎదిగే కూతుళ్ల ఆలనాపాలనా చూసుకోవాలని మురిసిపోయిన శ్రీదేవి శనివారం రాత్రి దుబాయ్‌లో ఓ పెండ్లి విందులో కుప్పకూలింది. భారీస్థాయిలో వచ్చిన గుండెపోటు వల్లే ఆమె కన్నుమూసినట్టు వార్తలు వెలువడ్డాయి. బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్ సతీమణి అయిన శ్రీదేవి మరణవార్త విని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆమె అభిమానులు తీవ్రదిగ్భ్రాంతికి గురయ్యారు. సుమారు ఐదు దశాబ్దాలపాటు వెండితెరను వెలిగించిన ఆ నగుమోము ఇకలేదని తెలిసి హతాశులయ్యారు. ఆమె కేవలం అభిమానుల నటే కాదు. దర్శకుల నటి. హీరోల నటి. అందరి నటి. సినీ పరిభాషలో చెప్పాలంటే లక్కీనటి. ఆమె పేరు పడితే చాలు. మినిమం గ్యారంటీ. మగమహారాజులు దర్జా ఒలకబోసే సినీరంగంలో ఆధిక్యాన్ని సాధించడం కేవలం శ్రీదేవికే చెల్లింది. దక్షిణాది హీరోలు, ఉత్తరాది హీరోలు.. అందరికీ శ్రీదేవే కావాలి. పెద్ద తరం, కొత్తతరం.. హీరో ఎవరైనా హీరోయిన్‌గా శ్రీదేవే కావాలి. అంతటి డిమాండ్ మరే ఇతర హీరోయిన్‌కు రాలేదు. దివి నుంచి భువికి దిగివచ్చిన దివ్య సుందరిగా ప్రజల మనసుల్లో ఆమె నిలిచిపోయింది. అఖిలభారతస్థాయిలో ఇంతగా అభిమా నం పొందిన తార మరొకరు లేరు.

సిసలైన సూపర్‌స్టార్

80, 90 దశకంలో దక్షిణాది నుంచి బాలీవుడ్‌కు రివ్వున దూసుకుపోయిన శ్రీదేవి సుదీర్ఘకాలం అఖిలభారతస్థాయిలో అగ్రతారగా కొనసాగింది. ఎందరో పెద్దతారల మలిదశ ఇన్నింగ్స్‌కు ఆమె అండదండలు అందించింది. హుందాతనంతో కూడిన అందం, అందుకు తగిన అభినయ విన్యాసంతో ఆమె ఐదు దశాబ్దాల సినీజీవితంలో రెండు దశాబ్దాలు సూపర్ హీరోయిన్‌గా వెలిగింది. నిజజీవితంలో మొహమాటస్థురాలిగా పేరున్న శ్రీదేవి వెండితెర మీద మాత్రం చలాకీ నటనతో మెప్పించింది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రాణించి హిందీరంగానికి వెళ్లి స్థిరపడ్డ శ్రీదేవి బాలనటిగా తమిళ సినిమా దునైవన్‌తో అరంగేట్రం చేసింది. తెలుగుతెరపై అగ్రతారలతో బాలనటిగా నటించి తర్వాత పెద్దయ్యాక వారితోనే హీరోయిన్‌గా నటించి ఒప్పించింది. ఎన్టీఆర్‌కు ఓ చిత్రంలో మనుమరాలిగా, ఏఎన్నార్‌కు మరో సినిమాలో కూతురిగా నటించిన శ్రీదేవి తర్వాత వారితోనే సూపర్ డూపర్ హిట్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించింది. వారి తర్వాతి తరం నటులతోనూ హీరోయిన్‌గా నటించింది. ముఖ్యంగా ఏఎన్నార్ కుమారుడైన నాగార్జునతో హీరోయిన్‌గా నటించి మెప్పించింది.



బాలనటి హీరోయిన్‌గా ఎదిగింది

బాలనటి శ్రీదేవి పెద్దయ్యాక హీరోయిన్‌గా పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటించింది. పదహారేళ్ల వయసు చిత్రంతో రెండు భాషల్లో ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఆ సినిమాతోనే బాలీవుడ్‌లో (సోల్వా సావన్) అడుగుపెట్టింది. కొత్త దర్శకుల ప్రయోగాలతో సినిమారంగంలో వీస్తున్న కొత్తగాలి శ్రీదేవికి కలిసివచ్చింది. సిరిమల్లె పువ్వా అని పాడుతూ తెల్లని వోణీతో ఉయ్యాలలూగే శ్రీదేవి ప్రేక్షకుల మనసుల్లో ముద్దేసుకుంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో అగ్రహీరోలందరితో నటించి తానే దక్షిణాది అగ్రతారగా ఎదిగింది. ఆటపాటలతో, ఫార్ములా కథలతో సాగే పక్కా కమర్షియల్ చిత్రాలతో పాటు ఆలోచింపజేసే ప్రయోగాత్మక చిత్రాల్లోనూ ఆమె నటించింది. రెండింటి మధ్య ఒరకమైన సమతూకం సాధించింది. గ్లామర్ హీరోయిన్‌గా రాణిస్తూనే వసంతకోకిల (హిందీలో సద్మా) వంటి నటనకు పెద్దపీట వేసే చిత్రాల్లో మెప్పించింది. ఆ సినిమాలో జ్ఞాపకశక్తి కోల్పోయిన అమ్మాయి పాత్రను శ్రీదేవి అద్భుతంగా పోషించింది. జిలుగువెలుగులతోపాటు నటనాపటిమ గల తారగా పేరు సంపాదించింది. తెలుగులో ఆటగాడు, వేటగాడు, ప్రేమాభిషేకం, కార్తీకదీపం వంటి కమర్షియల్ హిట్స్ తరహాలోనే హిందీలో హిమ్మత్‌వాలాతో భారీవిజయం సొంతం చేసుకుంది. శ్రీదేవి ఉంటే విజయం మనవెంటే అన్న ధోరణి నిర్మాతలు, దర్శకులు, హీరోల్లో స్థిరపడిపోయింది. కొన్నాళ్లు దక్షిణాదికి, బాలీవుడ్‌కు మధ్య అటూఇటూ తిరిగి చివరకు పూర్తిగా బాలీవుడ్‌కే అంకితమైంది. మవాలీ, తోఫా, మాస్టర్జీ, నజరానా వంటి హిట్లు తన ఖాతాలో వేసుకున్న తర్వాత బోనీకపూర్ నిర్మించిన మిస్టర్ ఇండియా (1987) చిత్రంతో అఖిలభారత స్థాయిలో తిరుగులేనితారగా నిలిచిపోయింది.



అందం నటనల కలబోత

శ్రీదేవి కామిక్ టైమింగ్, గ్లామర్ ఆమెను అగ్రస్థానానికి తీసుకువెళ్లాయి. చంద్రబింబంలాంటి ముఖం, చక్రాల్లాంటి కండ్లు, నవ్వగానే తళుక్కుమనే పలువరుస, మెరుపుతీగలాంటి రూపలావణ్యం, వీటన్నిటిని మించిన నటనాచాతుర్యం.. ఇందులో ఏ ఒక్కటీ తీసేయలేం. చక్రాల్లాంటి ఆ కళ్లు పలికించే రకరకాల భావాలకు ముగ్ధులు కానివారు లేరు. పసితనం ఇంకా వీడని అమాయకమైన నవ్వు శ్రీదేవి సిగ్నేచర్. యశ్ చోప్రా చాందినీ సినిమా శ్రీదేవి కెరీర్‌లో మరో మైలురాయి. చోప్రా తీసిన లమ్హే సినిమాలో శ్రీదేవి తల్లికూతుళ్లుగా చేసిన ద్విపాత్రాభినయం విమర్శకుల ప్రశంసలు పొందింది.

వ్యక్తిగతంలో కలతలు, కన్నీళ్లు

సినీకెరీర్‌లో రాకెట్‌వేగంతో దూసుకుపోయినా వ్యక్తిగత జీవితంలో మాత్రం సమస్యలు వెంటాడాయి. వివాదాలకు దూరంగా ఉన్న శ్రీదేవికి తల్లి మరణం పెద్ద దెబ్బ. సోదరితో ఆస్తితగాదాలు తలనొప్పి కలిగించాయి. నిర్మాత బోనీకపూర్‌తో వివాహంపై కుటుంబసభ్యులు అభ్యంతరపెట్టినా శ్రీదే వి పట్టించుకోలేదు. పైగా అది తన జీవితంలో అతిగొప్ప నిర్ణయంగా చెప్పుకొన్నది. ఇద్దరు చక్కటి పాపలు పుట్టారు. జాన్వీ, ఖుషీ వారి పేర్లు. సంసార బాధ్యతలతో తెరకు దూరమైన శ్రీదేవి దశాబ్దంన్నర విరామం తర్వా త మళ్లీ ఇంగ్లిష్ వింగ్లిష్‌తో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టి సక్సెస్‌తో పాటు పేరును సంపాదించింది. తమిళంలో చాన్నాళ్ల విరామం తర్వాత పులి సినిమాలో వ్యాంప్ తరహా పాత్ర పోషించింది. చివరి చిత్రం మామ్‌లో అమ్మ తపనకు అద్దం పట్టింది. తన పెద్ద కూతురు జాన్వీ తొలిచిత్రం ధడక్ ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. ఎప్పుడూ కూతుళ్ల భవిష్యత్తు గురించే మథనపడే శ్రీదేవి వారు జీవితంలో స్థిరపడటం చూడకుండానే అర్ధాంతరంగా కన్నుమూయడం అభిమానులను బాధిస్తున్నది.

28న ఎర్రోళ్ల శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఈ నెల 28న ఎర్రోళ్ల శ్రీనివాస్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉదయం 10 గంటలకు జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. గత నెల ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. కమిషన్ చైర్మన్‌గా సిద్దిపేట జిల్లాకు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యులుగా సూర్యాపేట జిల్లాకు చెందిన బోయిళ్ల విద్యాసాగర్, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కుర్సం నీలాదేవి, హైదరాబాద్‌కు చెందిన సుంకపాక దేవయ్య, రంగారెడ్డి జిల్లాకు చెందిన రాంబాల్‌నాయక్, చిలకమర్రి నర్సింహను ప్రభుత్వం నియమించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన తెలంగాణ మలిదశ ఉద్యమంలో విద్యార్థి నాయకునిగా శ్రీనివాస్ కొనసాగారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఏర్పడిన టీఆర్‌ఎస్‌పార్టీలో ఆవిర్భావం నుంచి ఆయన కొనసాగుతున్నారు. టీఆర్‌ఎస్ విద్యార్థి విభాగానికి తొలి అధ్యక్షునిగా పనిచేశారు. టీఆర్‌ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యునిగానూ వ్యవహరించారు.

తొమ్మిదేండ్ల తర్వాత పూర్తిస్థాయి కమిషన్: రాష్ట్రంలో దాదాపు తొమ్మిదేండ్ల తర్వాత పూర్తిస్థాయి కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది.ఉమ్మడి రాష్ట్రం లో 2009లో ఏర్పాటైన కమిషన్ తరువాత ఇప్పటి వరకు నియమించలేదు. తెలంగాణ ఏర్పాటయ్యాక పూర్తిస్థాయి కమిషన్‌ను ప్రస్తుతం టీఆర్‌ఎస్ ప్రభుత్వం నియమించింది.

ప్రశాంతంగా ఎస్జీటీ పరీక్ష

- పలు కేంద్రాల్లో వందశాతం హాజరు నమోదు
- నేడు స్కూల్ అసిస్టెంట్ పరీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) ప్రశాంతంగా జరిగిందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ చరిత్రలోనే మొదటిసారిగా పలు పరీక్ష కేంద్రాల్లో రికార్డుస్థాయిలో వందశాతం హాజరు నమోదైందని చెప్పారు. ఉదయం సెషన్ ఎస్జీటీ (తెలుగు మీడియం)లో హైదరాబాద్ జిల్లా పరిధిలో 91.9 శాతం, రంగారెడ్డిలో 97.89 శాతం, మేడ్చల్ జిల్లాలో 97.4 శాతం మంది అభ్యర్థుల హాజరు నమోదైనట్టు వెల్లడించారు. మధ్యాహ్నం ఎస్జీటీ (ఇంగ్లిష్ మీడియం)లో హైదరాబాద్ జిల్లాపరిధిలో 97.18 శాతం, రంగారెడ్డిలో 99.16 శాతం, మేడ్చల్ జిల్లాలో 97.38 శాతం హాజరు నమోదైందని తెలిపారు. సోమవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్ సబ్జెక్ట్), మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంట్ గణితం, సాంఘికశాస్త్రం (ఇంగ్లిష్ మీడియం) పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.



సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నుంచి ఆశీర్వాదం అందుకుంటున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సీఎంకు ఉద్యోగసంఘాల జేఏసీ కృతజ్ఞతలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ ఉద్యోగులకు ఒక నెల మూలవేతనం ప్రోత్సాహకం ప్రకటించినందుకు తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటున్నదని జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగులు పడ్డ శ్రమకు తగిన గుర్తింపు లభించిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఉద్యోగులు తప్పకుండా అమలుచేయాలని.. తద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో తక్కువ వేతనంతో ఇబ్బందిపడ్డ ఉద్యోగులు స్వరాష్ట్రంలో వేతనాలు పెంచడంతో సంతోషం గా ఉన్నారని ఉద్యోగసంఘాల సెక్రటరీ జనరల్ మమత పేర్కొన్నారు.

జిల్లా రెవెన్యూ కోర్టుల ఏర్పాటు

మంచి నిర్ణయం

- అభిప్రాయపడ్డ రెవెన్యూరంగం నిపుణులు
- నల్సార్ లా యూనివర్సిటీలో రౌండ్‌టేబుల్ సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూ వివాదాల పరిష్కారానికి జిల్లాస్థాయిలో రెవెన్యూకోర్టులు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించడంపై రెవెన్యూరంగంలో నిపుణులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పేదలు న్యాయం కోసం అడ్వకేట్లను నియమించుకొనే పరిస్థితి ఉండదని, అలాంటి వారికోసం ట్రిబ్యునళ్ల వద్ద న్యాయ సలహాదారులను నియమించాలని అభిప్రాయపడ్డారు. కోర్టులు గ్రామాలకు వెళ్లాలని, అక్కడే చాలావరకు భూ సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఆదివారం శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో తెలంగాణ తహసీల్దార్ల సంఘం ఆధ్వర్యంలోని తెలంగాణ రెవెన్యూ మాసపత్రిక, నల్సార్ లా యూనివర్సిటీ సంయుక్తంగా 'దేశంలో భూ వివాద పరిష్కార వ్యవస్థలు- రెవెన్యూకోర్టులు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాయి. దీనికి నల్సార్ లా వర్సిటీ అనుబంధ అధ్యాపకులు ఎం సునీల్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించగా, తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి అధ్యక్షత వహించారు. భూ వివాదాల పరిష్కారంలో తహసీల్దార్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు కీలకంగా ఉండాలని, వీరిపైన జిల్లా ట్రిబ్యునల్ ఉండాలని హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బీ ప్రకాశ్‌రావు చెప్పారు. రెవెన్యూచట్టాల్లో కొన్నింటిని ప్రస్తుత అవసరాలకు పనికిరావని గుర్తించి, వాటిని తీసేయాలని సర్కార్‌కు నివేదించామని నల్సార్ లా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధికారులు మధుసూదన్‌రావు, శ్రీనివాసరావు, రాజారావు, తెలంగాణ తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు గౌతంకుమార్ పాల్గొన్నారు.

బొన్సాయ్ మొక్కలపై ప్రచారం కల్పించాలి

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పుణెలో బొన్సాయ్ అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి తలసాని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బొన్సాయ్ మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని పుణెలో నిర్వహించిన బొన్సాయ్ అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లో ఇలాంటి సదస్సు ఏర్పాటుచేస్తే ప్రభుత్వపరంగా సహకరిస్తామని మంత్రి తలసాని సూచించారు. తెలంగాణలో 14 శాతం ఉన్న పచ్చదనాన్ని 30 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం హరితహారం చేపట్టి కోట్ల మొక్కలు నాటినట్టు తెలిపారు.

పోలీస్ అధికారులకు లీడర్‌షిప్ ట్రైనింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్‌శాఖలో సిబ్బంది నైపుణ్యాభివృద్ధి, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా పోలీస్‌శాఖ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నది. డీజీపీ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో డీజీపీ కార్యాలయంలోని లెర్నింగ్ సెంటర్‌లో ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, సీఐస్థాయి అధికారులకు డీజీపీ మహేందర్‌రెడ్డితోపాటు సీనియర్ ఐపీఎస్ అధికారులు తరగతులు తీసుకుంటున్నారు. విధుల్లో టెక్నాలజీ వినియోగం, సోషల్ మీడియా నిర్వహణ, కేసుల పరిశోధనలో టెక్నాలజీ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో టెక్నాలజీ, సీ-డాట్ టెక్నాలజీ వినియోగించుకుని క్రైంరికార్డ్స్ నిర్వహణ, సైబర్ క్రైం పరిశోధనలో టెక్నాలజీ, సీసీటీఎన్‌ఎస్ డ్యాష్‌బోర్డు తదితరాల అమలుపై శిక్షణ ఇస్తున్నారు.

ఏపీ ఆప్కో చైర్మన్ తండ్రి లైంగికదాడి చేశాడు

- వీడియోలు చిత్రీకరించి బ్లాక్‌మెయిల్ చేశాడు: బాధితురాలు

ఖైరతాబాద్: ఆంధ్రప్రదేశ్ ఆప్కో చైర్మన్ తండ్రి తనపై లైంగికదాడి చేశారని కడప జిల్లాకు చెందిన బాధితురాలు (18) ఆరోపించారు. ఐదునెలల క్రితం ఆప్కోలో ఉద్యోగం లభించడంతో ఎంతో సంతోషించానని, కానీ, ఉద్యోగంలో చేరిన నాటినుంచే చైర్మన్ తండ్రి గుజ్జల రామకృష్ణ తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారని సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎదుట ఆమె వాపోయారు. ఓసారి ఎవరూ లేని సమయంలో తనను బలవంతంగా ఆప్కో గోదాం పక్కనే ఉన్న ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశారని ఆరోపించారు. కొద్దిరోజుల తర్వాత తనకు ఫోన్‌చేసి లైంగికదాడి చేసేక్రమంలో వీడియోలు తీశానని, వాటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తానని బెదిరించారని బాధితురాలు ఆరోపించారు. అతడి అకృత్యాలు భరించలేక పలుమార్లు ఆత్మహత్యకు యత్నించానని పేర్కొన్నారు. ఈ విషయంపై కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే సిబ్బంది తనను బెదిరించారని, తన శీలానికి రూ.50 వేలు వెలకట్టి తెల్లకాగితంపై సంతకం పెట్టించుకున్నారని వాపోయారు.

బోసిపోయిన టీటీడీపీ కార్యాలయం

- కానరాని నేతలు.. ఖాళీ కుర్చీలే దర్శనం
- అక్కడ ఆఫీసు ఉన్నట్టు కూడా తెలియని వైనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ టీడీపీ కార్యాలయం నిత్యం బోసిపోయి కనిపిస్తున్నది. అధినేత హైదరాబాద్‌లో ఉంటే తప్ప నాయకులు కార్యాలయం ముఖంచూడని పరిస్థితి ఉంది. పార్టీ కార్యకర్తలకైతే అసలు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఉన్నదనే విషయం తెలియకుండా పోయింది. ఇటీవల నిర్వహించిన రైతు ఆత్మహత్యలపై పోరుయాత్ర కార్యకర్తలు లేక వెలవెలబోయింది. పల్లెపల్లెకు తెలుగుదేశం నామమాత్రంగా సాగుతున్నది. తెలంగాణవ్యాప్తంగా పార్టీ క్యాడర్ టీఆర్‌ఎస్‌లో చేరుతున్న నేపథ్యంలో టీటీడీపీ నేతలు వారిని కాపాడుకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ప్రతిపక్ష పార్టీగా ప్రజలతో మమేకమై ఉండాల్సిన నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. పార్టీలో ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒక ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అవినీతి కేసులో జైలుకు వెళ్లివచ్చారు. మరో ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య బీసీ సంక్షేమసంఘం పనుల్లో నిమగ్నమై పార్టీకి సమయం కేటాయించే పరిస్థితిలో లేరు. పార్టీ అధినేత తీరు నచ్చక, చంద్రబాబు తెలంగాణ వ్యతిరేక తీరుపై నొచ్చుకుని టీడీపీ నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ అధ్యక్షుడు ఎల్ రమణ అధినేత కనుసన్నల్లో ఉంటారనే ఆరోపణలున్నాయి. మోత్కుపల్లి నర్సింహులు ఇటీవల చంద్రబాబును విమర్శించినా ఆయనపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. టీటీడీపీ వ్యవహారాలపై విజయవాడ కేంద్రంగా చంద్రబాబు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రతీ సమస్యకు అక్కడకు వెళ్లాల్సి రావడం, వెళ్లినా అధినేత కోసం రోజుల తరబడి వేచిఉండాల్సి వస్తున్నదని పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

200 కోట్లతో దేవాలయాల పునరుద్ధరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర దేవాదాయశాఖ రూ. 200 కోట్లతో దేవాలయాల అభివృద్ధి పనులను చేపట్టింది. ఇప్పటికే 600 దేవాలయాల్లో జీర్ణోద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఆలయాల పునరుద్ధరణ కోసం రూ.150 కోట్లు అవసరమని దేవాదాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. 2018- 19 సంవత్సరం కోసం బడ్జెట్ ప్రతిపాదనలను ఇచ్చారు. ప్రస్తుతం వివిధ దేవాలయాల నుంచి సర్వశ్రేయోనిధికి రూ.15 కోట్లు మాత్రమే జమ అవుతున్న నేపథ్యంలో అభివృద్ధిపనులు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌లో సర్వశ్రేయోనిధికి రూ.50కోట్లు కేటాయించింది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో దేవాదాయశాఖకు బడ్జెట్ నుంచి ఒక్కరూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి 2017-18 బడ్జెట్‌లో దేవాదాయశాఖకు రూ.100కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో సర్వశ్రేయోనిధికి రూ.50కోట్లు, దేవాదాయశాఖ పరిపాలనా వ్యయం కోసం రూ. 50 కోట్లు కేటాయించారు. జీర్ణ దేవాలయాల ఉద్ధరణలో భాగంగా ఇప్పటికే పనులు జరుగుతున్న దేవాలయాలకు రూ.160 కోట్లు మంజూరు చేశారు. 600 దేవాలయాల్లో ముఖమండపాలు, రాజగోపురాలు, కల్యాణమండపాలు, ఆళ్వార్‌మండపాలు, ప్రహరీనిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం చారిత్రక ప్రాధాన్యం గల ఆలయాలను పునరుద్ధరించేందుకు.. నిధులను కేటాయించేందుకు వీలుగా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. తెలంగాణ పల్లెల నుంచి ఆలయాల ఉద్ధరణ కోరుతూ వచ్చే ప్రతిపాదనలన్నింటికీ న్యాయం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బలహీనవర్గాల కాలనీల్లో రామమందిరాల నిర్మాణాలను చేపట్టారు. వీటి నిర్మాణాలకు రూ.10లక్షలకు కేటాయిస్తున్నారు. 500 కాలనీల్లో రామమందిరాలు నిర్మించాలని ప్రతిపాదనలు రాగా.. 294 రామమందిరాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

సర్వశ్రేయోనిధి కోసం రూ.150కోట్ల ప్రతిపాదనలు



జగిత్యాల జిల్లా రాయికల్‌లోని కేశవనాథస్వామి ఆలయం (ఫైల్)

గిరిజన గూడాల్లో దేవాలయాలు

మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని చెంచుగూడాల్లో 200 దేవాలయాల నిర్మాణాల పనులు చేపట్టారు. ఒక్కో దేవాలయానికి రూ.5 లక్షలు కేటాయించారు. ఐటీడీఏ సహకారంతో ఈ ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రతీ చెంచుగూడెంలోని గిరిజనులు కోరుకున్న పద్ధతుల్లో ఆలయాలను నిర్మిస్తున్నారు. గిరిజనుల్లో భక్తిశ్రద్ధలు పెంచాలనే లక్ష్యంతో దేవాలయాల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

లక్ష్యాన్ని మించిన రాబడి

- 17 శాతం వృద్ధితో స్థిరమైన అభివృద్ధి
- అంచనాలను మించిన స్టాంపులు, రిజిస్ట్రేషన్, ఆబ్కారీ ఆదాయం
- పుంజుకున్న రియల్‌ఎస్టేట్ రంగం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రెవెన్యూ సొంత రాబడులు స్థిరంగా పెరుగుతున్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ, ఆబ్కారీ ఆదాయం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి రికార్డుస్థాయిలో పెరిగింది. వాణిజ్యపన్నుల (వ్యాట్, జీఎస్టీ, ఐజీఎస్టీ) రాబడిలో 16 నుంచి 17 శాతం వృద్ధి నమోదైంది. ఫిబ్రవరిలో వాణిజ్యపన్నులశాఖ రాబడి రూ.30 వేల కోట్లు దాటింది. డిసెంబర్ నెలాఖరువరకు రెవెన్యూ రాబడులు రూ.51వేల కోట్లు ఉండగా జనవరి లో అది రూ.60వేల కోట్లకు చేరినట్టు తెలిసింది. ఆబ్కారీ, రిజిస్ట్రేషన్ల రాబడి బడ్జెట్‌లో అంచనావేసిన దానికంటే మించి వృద్ధిరేటు నమోదుచేసుకుంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో ఈసారి స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ రాబడి లక్ష్యం రూ.3100 కోట్లుగా నిర్ధారించగా జనవరి ఆఖరులోపే లక్ష్యాన్ని మించిపోయింది. ఆబ్కారీ రాబడి రూ.9వేల కోట్లుగా లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే 80శాతం దాటింది. ఈ ఏడాది మార్చి నాటికి పన్నుల రాబడులు రూ.79,624కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా డిసెంబర్ ఆఖరుకు రూ.51వేల కోట్ల వరకు రాబడులు సమకూరినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తన నివేదికలో పేర్కొన్నది. జనవరి ఆఖరు నాటికి అది రూ.60 వేల కోట్లకు చేరింది. కాగ్ నివేదిక ప్రకారం గత ఏడాది కంటే నెల సరిగా సొంత రాబడుల్లో గణనీయమైన వృద్ధి చోటు చేసుకుంది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రాష్ట్ర సొంత రెవెన్యూ రాబడులు రూ.50,272 కోట్లుగా ఉన్నట్టు కాగ్ తెలిపింది. గత ఏడాది ఇదే సమయానికి రాష్ట్ర సొంత రాబడులు రూ.43 వేల కోట్ల వరకు ఉన్నాయి. డిసెంబర్ నాటికే ఏడు వేల కోట్ల రాబడి అధికంగా వచ్చింది. వాణిజ్యపన్నులు మొత్తం కలుపుకొని ఫిబ్రవరి వరకు రాబడి రూ.30 వేల కోట్లను దాటింది. ఇది గతంతో పోలిస్తే 17 శాతం వృద్ధిరేటని వాణిజ్యపన్నులు, ఆబ్కారీశాఖల ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి రాబడి రూ.38 వేల కోట్లు దాటుతుందని అంచనా వేశారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత వాణిజ్యపన్నుల రాబడి వృద్ధిరేటు నమోదైన రాష్ట్రాల్లో తెలంగాణ మొదటిస్థానంలో ఉందని చెప్పారు.

రిజిస్ట్రేషన్‌శాఖలో రికార్డు ఆదాయం

రాష్ట్రంలో స్థిరాస్తుల క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. పెద్దనోట్ల రద్దు తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలో కొంతకాలం స్తబ్ధత నెలకొన్నా గత నాలుగు నెలల నుంచి స్థిరాస్తుల క్రయ, విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రూ.1266 కోట్లు అదనంగా రాబడి వచ్చింది. గత ఏడాది రూ.3,374 కోట్ల రాబడి రాగా ఈ ఏడాది ఇప్పటికే రూ.4,640 కోట్లకు చేరిందని రిజిస్ట్రేషన్ శాఖ జాయింట్ కమిషనర్ వేముల శ్రీనివాసులు తెలిపారు.

టెలిమెట్రీపై తీరుమారని కృష్ణాబోర్డు

- ధ్రువీకరణపత్రాలపై మారని వైఖరి
- తెలంగాణ ప్రభుత్వం సీరియస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా ప్రాజెక్టులపై టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు తీరుమారడం లేదు. టెలిమెట్రీ ఏర్పాటును వేగవంతం చేయాలని పదేపదే డిమాండ్ చేస్తున్న తమనే జాప్యానికి కారణంగా చిత్రీకరించేందుకు బోర్డు అధికారులు ప్రయత్నిస్తుండటంపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఈ అంశాన్ని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లేందుకు సమాయత్తమవుతున్నట్టు సమాచారం. కృష్ణాప్రాజెక్టులపై టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటు మొదటిదశను దాదాపు రెండేండ్లపాటు సాగదీసిన కృష్ణాబోర్డు.. రెండోదశను గాలికొదిలేసింది. మొదటి దశలో కాంట్రాక్టు సంస్థకు చెల్లించాల్సిన బిల్లుల అంశంపై గందరగోళాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నది. టెండరు నిబంధనల్లో ఉన్నపదాలను వక్రీకరిస్తూ.. పని పూర్తయినట్టుగా ధృవీకరణ పత్రాలను జారీచేయాలని బోర్డు గతంలోనే ప్రాజెక్టు ఇంజినీర్లను ఆదేశించిన విష యం విదితమే. దీనిని వ్యతిరేకిస్తూ తెలంగాణ నీటిపారుదలశాఖ లేఖ రాసినప్పటికీ బోర్డు వైఖరిలో మార్పురాకపోగా, బోర్డు పరిధిని తెరపైకి తీసుకువచ్చి ప్రాజెక్టు ఇంజినీర్లపై ఒత్తిడి తో ధృవీకరణపత్రాలను జారీ చేయించేందుకు పావు లు కదుపుతున్నది. రెండ్రోజుల క్రితం బోర్డు సభ్యకార్యదర్శి నీటిపారుదలశాఖ ఈఎన్సీకి రాసిన లేఖలోనూ.. టెలిమెట్రీ ఏర్పాటు జాప్యానికి తెలంగాణనే కారణమని ఆరోపించారు. టెండరు నిబంధనల్లో ఉన్న 'ఇంజినీర్-ఇన్-చార్జి' పదాన్ని ప్రాజెక్టు ఏఈ/ఏఈఈలుగా పరిగణిస్తుండటంపై మరోసారి లేఖ ద్వారా స్పష్టత ఇవ్వాలనుకుంటున్నట్టు తెలిసింది.

కృష్ణాబోర్డు చైర్మన్‌గా శర్మ బాధ్యతల స్వీకరణ నేడు

కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) చైర్మన్‌గా వైకే శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. బోర్డు చైర్మన్‌గా గతంలో ఉన్న శ్రీవాత్సవ గత జనవరిలో పదవీ విరమణ చేశారు. భారత్-భూటాన్ సంయుక్తంగా చేపట్టిన పునసాంగ్చ్యూ హైడ్రాలిక్ ప్రాజెక్టుకు ఇన్‌చార్జిగా ఉన్న శర్మను ఈ నెల 15న కేంద్ర జల వనరుల మంత్రిత్వశాఖ కేఆర్‌ఎంబీ చైర్మన్‌గా నియమించింది. ఈయన నియామకం తర్వాత తెలుగు రాష్ట్రాలతో, ఢిల్లీలో కేంద్ర జల వనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శి సమావేశంతోపాటు హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు జరిగింది.

గాడినపడుతున్న వక్ఫ్‌బోర్డు

దురాక్రమణలు ఒక్కొక్కటిగా తొలిగింపు • అద్దెల పెంపుతో రూ.2 కోట్ల ఆదాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు గాడిలో పడుతున్నది. స్వరాష్ట్రంలో బోర్డు పనితీరు మెరుగుపడుతున్నది. వివిధ రూపాల్లో బోర్డుకు ఆదాయ వనరులు పెరుగుతున్నాయి. సమైక్య పాలనలో రూ.కోట్లు విలువజేసే వక్ఫ్ ఆస్తులు కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకోగా, టీఆర్‌ఎస్ ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధతోపాటు బోర్డుకు కొత్త పాలకవర్గం రావడంతో ఆక్రమణలు తొలిగిపోతున్నాయి. న్యాయస్థానాల్లో బోర్డు కేసులను వాదిస్తున్న స్టాండింగ్ కౌన్సిల్స్‌ను మార్చి సీనియర్ న్యాయవాదులను నియమించడం, రిటైర్డ్ జడ్జిని సలహాదారుడిగా నియమించడంతో కేసుల విషయంలో ప్రయోజనం కలుగుతున్నది. రూ.కోట్ల విలువ చేసే గుట్టల బేగంపేట ఈద్గా స్థలాన్ని బోర్డు రక్షించుకొని, దాని గెజిట్ నోటిఫికేషన్‌ను పొందగలిగింది. కలెక్టర్లు, పోలీసు కమిషనర్, ఎస్పీలతో సమావేశాలు నిర్వహిస్తూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, పాలకవర్గ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని జుమ్మెరాత్‌బజార్ ప్రాంతంలో ఉన్న ఊంట్‌వాడీ ముస్లిం శ్మశానవాటిక ప్రహరీని కొందరు కూల్చి ఒంటెలు, గుర్రాల స్థావరంగా మార్చారు. బోర్డు ఆ స్థలాన్ని కాపాడుకున్నది. హైటెక్‌సిటీ ఖానామెట్ వద్ద పురాతన కుతుబ్‌షాహీ మసీదుకు చెందిన 1.15 ఎకరాల స్థలాన్ని వక్ఫ్ బోర్డు ఆధీనంలో తీసుకొని, ప్రహరీ నిర్మించింది. నాదర్‌గుల్‌లోని కుతుబ్‌షాహీ మసీదును ఆధీనంలోకి తెచ్చుకోగలిగింది.

పెరిగిన ఆదాయం..

కీలకమైన వ్యాపార, వాణిజ్య కేంద్రాల్లో ఉన్న వక్ఫ్ ఆస్తుల అద్దెలను పెంచడం ద్వారా ఈ ఏడాది రూ.2 కోట్ల ఆదాయం పెంచుకోగలిగింది. జీహెచ్‌ఎంసీ ఆధీనంలోకి వెళ్లిన వక్ఫ్ భూములు, ఆస్తులకు సంబంధించి రూ.350 కోట్ల నష్టపరిహారం వక్ఫ్‌బోర్డుకు రావాల్సి ఉన్నది. ఇటీవల రూ.2.20 కోట్ల నిధుల విడుదలకు జీహెచ్‌ఎంసీ అంగీకరించింది. మిగతావి త్వరలో విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. వక్ఫ్ ఫండ్ ఆదాయం కూడా ఈ ఏడాది రూ.1.50 కోట్లు పెరిగింది.

మైనారిటీ నిరుద్యోగులకు కార్లు

60 శాతం సబ్సిడీతో 500 మందికి పంపిణీ • తొలుత 101 మంది అభ్యర్థుల ఎంపిక త్వరలో సీఎం కేసీఆర్ చేతులమీదుగా అందజేత • మార్చి నెలాఖరు నాటికి మిగతా వారికి..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డ్రైవింగ్ నేర్చుకొని నిరుద్యోగులుగా ఉన్న పేద మైనారిటీ యువతకు ఉపాధి కల్పించడానికి కార్లు అందచేయాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీఎస్ ఎంఎఫ్‌సీ) నిర్ణయం తీసుకున్నది. రూ.22 కోట్లతో మారుతి కంపెనీకి చెందిన 500 స్విఫ్ట్ డిజైర్ కార్లను అర్హులకు అందజేస్తామని కార్పొరేషన్ చెప్పింది. మైనారిటీల జనాభా ఆధారంగా ఆయా జిల్లాలకు కార్ల పంపిణీ సంఖ్యను నిర్దేశించింది. కార్ల పంపిణీకి ఇప్పటికే 101 మంది యువకులను ఎంపికచేశారు. త్వరలో వీరికి సీఎం కేసీఆర్ చేతులమీదుగా అందజేయడానికి టీఎస్‌ఎంఎఫ్‌సీ సన్నాహాలు చేస్తున్నది. మిగతా 399 మందికి ఈ మార్చిలోగా ఇవ్వనున్నట్టు టీఎస్‌ఎంఎఫ్‌సీ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ తెలిపారు. ఈ వాహనాలు క్యాబ్, ట్యాక్సీలుగా నడుపుకోవడం ద్వారా ఉపాధి కలుగుతుందని చెప్తున్నారు. కారుకు అయ్యే ఖర్చులో 60 శాతం కార్పొరేషన్ సబ్సిడీ ఇస్తుండగా మిగతా 40 శాతాన్ని అభ్యర్థి సొంతంగా లేదంటే బ్యాంకు రుణంగా భరించాల్సి ఉంటుంది. మైనారిటీ యువతి, యువకులకు ఆయా వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి రాష్ట్రంలో 37 శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయాలని టీఎస్‌ఎంఎఫ్‌సీ నిర్ణయం తీసుకున్నది.

రిటైర్డ్ పారామిలిటరీ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం

- హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి



చాంద్రాయణగుట్టలోని సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ రక్షణ కోసం తమ ప్రాణాలు పణంగా పెట్టి పోరాటం చేస్తున్న పారామిలిటరీ, బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్, ఐటీబీపీ, అస్సాం రైఫిల్స్ సైనికుల సేవలు మరువలేనివని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. అఖిలభారత మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చాంద్రాయణగుట్టలోని సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో పారామిలిటరీ మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబసభ్యులతో నిర్వహించిన సమావేశంలో హోంమంత్రి పాల్గొన్నారు. మాజీ సైనికోద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి తుమ్మల రాజేశ్ కుమార్, ఆర్పీఎఫ్ అదనపు డీజీ పంకజ్‌కుమార్, సీఐఎస్‌ఎఫ్ ఐజీ జగ్బీర్‌సింగ్, ఆర్పీఎఫ్ డీఐజీ పాండే, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అహ్మద్ అలీ, సంఘం జాతీయ అదనపు క్యాదర్శి, తెలంగాణ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కేపీ సైదులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఫార్మసిస్టులకు సర్టిఫికెట్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఎట్టకేలకు స్పందించింది. తెలంగాణ ఫార్మసీ విద్యార్థుల సర్టిఫికెట్లను గుంటూరులోని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ చేసి, విద్యార్థులకు ఇవ్వడం ప్రారంభించింది. తెలంగాణలో ఫార్మసీ కౌన్సిల్ కార్యకలాపాలు ప్రారంభం కాకపోవడంతో 2016-17లో డీ ఫార్మసీ పూర్తిచేసుకున్న అభ్యర్థులు గుంటూరులోని ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం 238 గ్రేడ్-2 ఫార్మసిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టుల దరఖాస్తుకు ఫార్మసీ విద్యార్థుల సర్టిఫికెట్లు 'ఫార్మసీ కౌన్సిల్'లో రిజిస్టరై ఉండాలి. కానీ, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ నుంచి తెలంగాణ అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. దీనిపై 'సర్టిఫికెట్లు అందక ఫార్మసిస్టుల ఆందోళన' శీర్షికన ఈ నెల 4న 'నమస్తే తెలంగాణ' వార్తాకథనాన్ని ప్రచురించి సమస్యను వెలుగులోకి తెచ్చింది. సర్టిఫికెట్ల జారీపై తెలంగాణ ఫార్మ సొసైటీ అధ్యక్షుడు ఆకుల సంజయ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

భూ రిజిస్ట్రేషన్ల బాధ్యతలకు సమయం కావాలి

- ప్రభుత్వానికి తహసీల్దార్ల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూముల రిజిస్ట్రేషన్ల బాధ్యతలు స్వీకరించడానికి తమకు సమయం కావాలని రాష్ట్ర తహసీల్దార్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం నల్సార్ లా యూనివర్సిటీలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, అధ్యక్షుడు గౌతంకుమార్ నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూముల రిజిస్ట్రేషన్ల బాధ్యతలు నిర్వర్తించేందుకు తహసీల్దార్లకు, కిందిస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కాకుండా కొన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పూల్‌సింగ్, యాదగిరి, కార్యదర్శులు కే రామకృష్ణ, కే వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు జే నరసింహ, ఎస్కే ముంతాజ్, ఎండీ అన్వర్, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సూర్యాపేటవాసికి పీఎం శ్రమ్ అవార్డు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ డీఆర్డీఎల్‌లోని బ్రహ్మోస్ ఎయిరోస్పేస్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సూర్యాపేటకు చెందిన హీరాకర్ సంతోష్ ప్రధానమంత్రి శ్రమ్ అవార్డు-2015కు ఎంపికయ్యారు. సోమవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో ప్రధాని చేతులమీదుగా సంతోష్ ఈ పురస్కారం అందుకోనున్నారు. సంతోష్ తండ్రి హీరాకర్ హరిమోహన్ లాల్ నీటిపారుదలశాఖలో పనిచేశారు.

గవర్నర్‌ను కలిసిన ఏపీ స్పీకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆదివారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను కలుసుకున్నారు. మార్చి ఐదు నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ ప్రసంగానికి రావాల్సిందిగా గవర్నర్‌ను ఆహ్వానించారు. మరోవైపు భారత్‌లో బంగ్లాదేశ్ హైకమిషనర్ సయ్యద్ ముజామలి రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

'నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా': బోండా ఉమ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విజయవాడలో తాను ఒక్క గజం స్థలమైనా కబ్జా చేసినట్టు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటానని టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర్‌రావు సవాల్ విసిరారు. స్వాతంత్ర్య సమర యోధుల భూమితోపాటు పలుచోట్ల భూ కబ్జాలకు పాల్పడినట్టు వస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఆదివారం విజయవాడలో మీడియాకు వెల్లడించారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక కుట్రపన్నుతున్నారని ఆయన విమర్శించారు.

ఓబీసీలో మరో కుంభకోణం!

వెలుగులోకి రూ.200 కోట్ల మోసం

సింభౌలి షుగర్స్, బ్యాంక్ అధికారులపై సీబీఐ కేసు నమోదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రోజుకో మోసం వెలుగు చూస్తున్నది. ఆదివారం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ.. మరో బ్యాంక్ మోసం కేసును నమోదు చేసింది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)కు రూ.200 కోట్ల కుపైగా నష్టం కలిగించారన్న ఆరోపణలపై కొందరు బ్యాంక్ అధికారులతోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ ప్రైవేట్ షుగర్ కంపెనీ, దాని ఉన్నతాధికారులపై సీబీఐ కేసుల్ని దాఖలు చేసింది. సీబీఐ తెలిపిన వివరాల ప్రకారం 2011, 2015లో మీరట్‌లోని ఓబిసి శాఖ నుంచి చెరకు రైతుల కోసం, స్వయం సహాయక బృందాల కోసం తీసుకున్న రుణాలను హాపూర్ ఆధారిత సింభౌలి షుగర్స్ లిమిటెడ్ దుర్వినియోగ పరిచింది. కాగా, ఈ కేసు విచారణలో భాగంగా హాపూర్‌తో పాటు నొయిడాల్లో ఒక్కొక్క చోట, ఢిల్లీలో ఆరు చోట్ల ఉన్న సంస్థ కార్యాలయాలు, అధికారుల ఇండ్లలో సీబీఐ సోదాలు నిర్వహించింది. సంస్థ సీఎండీ గుర్మిత్ సింగ్ మన్, డిప్యూటీ ఎండీ గుర్పాల్ సింగ్, సీఎఫ్‌వోసహా మరో ఎనిమిది మంది, ఎగ్జిక్యూటివ్, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, బ్యాంక్ అధికారులను ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొన్నది. ఆర్బీఐ స్కీం కింద 2011లో రూ.148.60 కోట్ల రుణాన్ని సింభౌలి షుగర్స్‌కు ఓబీసీ మంజూరు చేసింది. చెరకు సరఫరా కోసం 5,762 మంది రైతులకు ఇవ్వాల్సిన ఈ సొమ్మును సంస్థ తమ ఇతరత్రా వ్యక్తిగత అవసరాలకు వాడుకుంది. అయితే ఈ రుణంలో రూ.97.85 కోట్ల ఔట్‌స్టాండింగ్ లోన్ చెల్లింపులకుగాను మరో రూ.109.08 కోట్ల కార్పొరేట్ రుణాన్ని 2015 జనవరి 28న బ్యాంక్ ఇవ్వడం గమనార్హం. ఈ క్రమంలో 2015 మార్చి 31న తొలి రుణాన్ని, 2016 నవంబర్ 29న రెండో రుణాన్ని మొండి బకాయిగా బ్యాంక్ ప్రకటించింది. బ్యాంకు ఫిర్యాదుతో సీబీఐ కేసు నమోదు చేయగా, బ్యాంక్ సిబ్బంది కుమ్మక్కయ్యారన్న కోణంలో దర్యాప్తు సాగుతున్నది.

కార్పొరేట్ రుణాలపై వేటు శ్రేయస్కరం కాదు

■ **పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వానికి సీఐఐ హెచ్చరిక**



సీఐఐ అధ్యక్షురాలు శోభనా కామినేని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణాన్ని దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే రుణాలపై వేటు వేయరాదని, ప్రత్యేకించి బ్యాంకుల రుణ వితరణ సామర్థ్యాన్ని పెంచుకుని అధిక వృద్ధిరేటు సాధించేందుకు దేశ ఆర్థిక వ్యవస్థ సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం ఇటువంటి చర్యలు చేపట్టడం ఎంతమాత్రం మంచిది కాదని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) హెచ్చరించింది. దేశంలో ఆర్థిక మోసాలను నియంత్రించేందుకు మరింత మెరుగైన నియంత్ర వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లో ప్రభుత్వం తన వాటాను క్రమంగా 33 శాతానికి తగ్గించుకోవాలని, ఆర్థిక మోసాలను అరికట్టేందుకు బ్యాంకులపై పర్యవేక్షణను పెంచడం, కార్పొరేట్ పరిపాలనకు సంబంధించిన ఉత్తమ ప్రమాణాలను విస్తరించడం సహా ద్విముఖ వ్యూహాన్ని అనుసరించాలని సీఐఐ సూచించింది. ఆర్థిక రంగంలో వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పాటు నియంత్రణా సంస్థలు, పారిశ్రామిక రంగం మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని, ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం, బ్లాక్‌చైన్, బిగ్ డాటా అనలిటిక్స్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నిర్వహణా సామర్థ్యాన్ని పెంచుకోవడం, పీఎస్‌బీల్లో ప్రభుత్వ వాటాను తగ్గించుకోవడం బ్యాంకింగ్ రంగానికి మూడు కీలక పరిష్కారాలని సీఐఐ ప్రెసిడెంట్ శోభనా కామినేని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

నష్టం ఉండదంటున్న వజ్రాల వ్యాపారులు

ఇదిలావుంటే, పీఎన్‌బీ కుంభకోణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు రుణ వితరణకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేసినప్పటికీ తమ వ్యాపారానికి పెద్దగా నష్టమేమీ వాటిల్లబోదని సూరత్‌లోని వజ్రాల పరిశ్రమ ప్రతినిధులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద బ్యాంకుల్లో రెండవదిగా ఉన్న పీఎన్‌బీలో కొద్ది రోజుల క్రితం రూ.11,400 కోట్ల భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పటికీ బ్యాంకు రుణాల కోసం వజ్రాల కటింగ్, పాలిషింగ్ విభాగాలకు చెందిన చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నామని వారు తెలిపారు. సూరత్‌లోని దాదాపు 6 వేల డైమండ్ ప్రాసెసింగ్ యూనిట్లలో సుమారు 100 పెద్ద సంస్థలు మాత్రమే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నాయని, మిగిలిన చిన్న, మధ్య తరహా సంస్థలన్నీ ప్రైవేటు పెట్టుబడిదారులపైనే ఎక్కువగా ఆధారపడి పనిచేస్తున్నాయని జీజేఈపీసీ (జెమ్స్ అండ్ జువెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్) రీజినల్ చైర్మన్ దినేష్ నవాడియా స్పష్టం చేశారు.

నీరవ్‌కు ముందే తెలుసా?

పాలకులతో సంబంధాలపై అనుమానాలు

పెద్ద నోట్ల రద్దుకు కొన్ని గంటల ముందే పీఎన్‌బీలో రూ.90 కోట్లు డిపాజిట్ చేసిన స్కామ్‌స్టర్



అనుమానాలను మరింత పెంచుతున్న దావోస్ ఫొటో

ముంబై, ఫిబ్రవరి 25: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడిన సెలబ్రిటీ జువెల్లర్ నీరవ్ మోదీ దేశంలో పెద్ద నోట్లు రద్దు కావడానికి కేవలం కొన్ని గంటల ముందు ఆ బ్యాంకుకు చెందిన ఒక శాఖలో రూ.90 కోట్ల నగదును డిపాజిట్ చేసినట్లు తెలుస్తున్నది. ఈ నగదును ఆయన బంగారంగా గానీ లేక మరో రూపంలోకి గానీ మార్చుకుని ఉండవచ్చని, ఇందులో వాస్తవాన్ని వెలికితీసేందుకు సమగ్రమైన దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) ఎంపీ మజీద్ మెమన్ అంటున్నారు. దేశంలో పాత 1000, 500 రూపాయల నోట్ల చెలామణిని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2016 నవంబర్ 8వ తేదీ రాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ప్రధాని ఈ ప్రకటన చేయడానికి కేవలం కొద్ది గంటల ముందే పీఎన్‌బీ శాఖలో నీరవ్ మోదీ రూ.90 కోట్లు డిపాజిట్ చేశారన్న వార్తను చూస్తుంటే ఆయనకు, కేంద్ర ప్రభుత్వంలోని 'పెద్దల'కు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, నోట్ల రద్దు నిర్ణయం గురించి నీరవ్ మోదీకి ముందే తెలిసి ఉంటుందని స్పష్టమవుతోందని మజీద్ మెమన్ పేర్కొన్నారు.

ఇంటి దొంగల నుంచి కాపాడుకునేందుకు మరింత బీమా రక్షణపై బ్యాంకుల దృష్టి



దేశంలో వరుస కుంభకోణాలతో కుదేలవుతున్న బ్యాంకులు ఇప్పుడు తమ ఇంటి దొంగల మోసాల నుంచి తమను తాము కాపాడుకునేందుకు బీమా పరంగా రక్షణ పెంచుకోవాలని యోచిస్తున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన రెండు భారీ కుంభకోణాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్లు, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)కు రూ.390 కోట్ల నష్టం వాటిల్లడంతో తమను ఈ దిశగా ఆలోచింపజేస్తున్నదని, ఇప్పటివరకూ తీసుకుంటున్న ప్రాథమిక నష్టపరిహార పాలసీలతో సరిపుచ్చకుండా బీమా రక్షణను మరింత పెంచుకోవాలని యోచిస్తున్నామని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. సొంత ఉద్యోగుల ప్రమేయంతో జరిగే మోసాల నుంచి కాపాడుకునేందుకు బ్యాంకులు అంతర్గత రిస్క్ మెకానిజమ్, నిఘా వ్యవస్థలను బలోపేతం చేసుకోవడంతో పాటు బీమా పరమైన రక్షణను మరింత పెంపొందించుకోవడంపై దృష్టి సారించాయని, బ్యాలెన్స్ షీట్‌కు రక్షణ కల్పించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆ అధికారి తెలిపారు.

పీఎన్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను మరోసారి ప్రశ్నించిన సీబీఐ



కేవీ బ్రహ్మాజీరావు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన రూ.11,400 కోట్ల భారీ కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఈ కేసులో ఆదివారం ఆ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీ బ్రహ్మాజీరావును రెండో రోజు కూడా ప్రశ్నించింది. 35 ఏండ్ల క్రితం విజయా బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన బ్రహ్మాజీరావు పనిచేసిన జోన్లలో పీఎన్‌బీ కుంభకోణం జరిగిన ముంబై జోన్ కూడా ఉన్నదని, దీంతో ఆయనతో పాటు పీఎన్‌బీకి చెందిన పలువురు ఇతర అధికారులను కూడా ప్రశ్నిస్తున్నామని సీబీఐ అధికారులు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతానికి వీరిని నిందితులుగా పరిగణించడం లేదని, ఈ కుంభకోణాన్ని పీఎన్‌బీ ఏవిధంగా గుర్తించిందన్న అంశంతో పాటు ఆ బ్యాంకులో పాటించే నియమ నిబంధనలేమిటి?, వాటిలో ఉల్లంఘనలు ఏమైనా జరిగాయా? అనే అంశాలపై దృష్టి సారించామని సీబీఐ అధికారులు తెలిపారు. బ్రహ్మాజీరావు ప్రస్తుతం తమ బ్యాంకులో ఇంటిగ్రేటెడ్ రిస్క్ మేనేజ్‌మెంట్, క్రెడిట్ ఆపరేషన్స్ విభాగాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడని, స్టాక్ ఆడిట్, పోర్టుఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసు (పీఎంఎస్) సహా రూ.50 కోట్ల కంటే ఎక్కువ రుణాలకు సంబంధించిన ఖాతాలను ఆయన పర్యవేక్షిస్తున్నాడని పీఎన్‌బీ తమ వెబ్‌సైట్‌లో స్పష్టం చేసింది.

నీరవ్, చోక్సీ విదేశీ ఆస్తులపై ఈడీ గురి

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన దర్యాప్తును ముమ్మరం చేస్తున్నది. ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారులైన వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, అతని మామ, గీతాంజలి జెమ్స్ సంస్థ అధినేత మెహుల్ చోక్సీకి విదేశాల్లో గల ఆస్తులు, వ్యాపారాలకు సంబంధించిన సమాచారాన్ని రాబట్టేందుకు ఈడీ త్వరలో డజనుకు పైగా దేశాలకు న్యాయపరమైన విజ్ఞప్తులను పంపనున్నది. నీరవ్, చోక్సీలకు చెందిన వ్యాపార సంస్థలు ఉన్నట్లుగా గుర్తించిన బెల్జియం, హాంకాంగ్, స్విట్జర్లాండ్, అమెరికా, బ్రిటన్, దుబాయ్, సింగపూర్, దక్షిణాఫ్రికా తదితర 17 దేశాలకు పంపాల్సిన రెగొరేటరీ లెటర్లను పొందేందుకు ముంబైలోని సంబంధిత కోర్టును ఈడీ సంప్రదించబోతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.


ఒక్క నిర్ణయం.. లక్షల కోట్ల లాభం



వారెన్ బఫెట్‌కు కార్పొరేట్ పన్ను కోతల కిక్కు

బెర్క్‌షైర్ హాథవేకు రూ. 2 లక్షల కోట్ల ప్రయోజనం

అమెరికాలో 35 నుంచి 21 శాతానికి పన్ను తగ్గడమే కారణం



న్యూయార్క్, ఫిబ్రవరి 25: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం.. వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హాథవే లాభాల్ని అమాంతం పెంచేసింది. అగ్రరాజ్య నూతన పన్ను చట్టంతో సంస్థ లాభం ఏకంగా రూ.2 లక్షల కోట్ల మేర ఎగబాకింది మరి. గతేడాది కంపెనీకి 65.3 బిలియన్ డాలర్ల నిర్వహణపరమైన లాభం రాగా, ఇందులో వ్యాపార కార్యకలాపాల వల్ల వచ్చింది 36 బిలియన్ డాలర్లు మాత్రమే. 29.3 బిలియన్ డాలర్లు కార్పొరేట్ పన్ను కోతలతోనే మిగలడం గమనార్హం. డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి మారకం విలువ ప్రకారం ఇది రూ.1,89,600 కోట్లతో సమానం. ఈ విషయాన్ని భాగస్వాములకు రాసిన వార్షిక లేఖలో బెర్క్‌షైర్ చైర్మన్, సీఈవో వారెన్ బఫెట్ పేర్కొన్నారు. అమెరికా కార్పొరేట్ సంస్థలు చెల్లించే పన్నును నిరుడు డిసెంబర్‌లో 35 శాతం నుంచి 21 శాతానికి ట్రంప్ సర్కారు తగ్గించిన సంగతి విదితమే. ఇది అక్కడి కార్పొరేట్లకు కాసుల వర్షం కురిపిస్తుండగా, బిలియనీర్ ఇన్వెస్టరైన బఫెట్‌కు మరింత కలిసొస్తున్నది. ట్రంప్ నిర్ణయం.. బెర్క్‌షైర్ కార్పొరేట్ పన్ను చెల్లింపులను భారీగా తగ్గించింది. ఇక 2017లో బెర్క్‌షైర్ నికర ఆదాయం ఒక్కసారిగా 44.94 బిలియన్ డాలర్లకు ఎగిసింది. 2016లో ఇది 24.07 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. తగ్గిన కార్పొరేట్ పన్నుతో మా ఆదాయం కూడా పెరిగిందని వారెన్ బఫెట్ తన లేఖలో స్పష్టం చేశారు. కాగా, బెర్క్‌షైర్ హాథవేకు పదుల సంఖ్యలో సంస్థలుండగా, డైరీ క్వీన్ నుంచి డ్యూరాసెల్ వరకు బెర్క్‌షైర్‌వే. అంతేగాక అమెరికన్ ఎక్స్‌ప్రెస్, యాపిల్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, చార్టర్ కమ్యూనికేషన్స్, కోకా-కోలా, డెల్టా ఎయిర్‌లైన్స్, జనరల్ మోటార్స్, గోల్డ్‌మన్ సాచ్స్, మూడీస్, వెల్స్ ఫార్గో, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ తదితర సంస్థల్లోనూ బెర్క్‌షైర్‌కు చెప్పుకోదగ్గ వాటాలే ఉన్నాయి. 87 ఏండ్ల బఫెట్.. 11వ యేట నుంచే పెట్టుబడులు పెడుతుండటం విశేషం. బెర్క్‌షైర్ హాథవే నగదు నిల్వలు 116 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు బఫెట్ తెలిపారు. మున్ముందు మరిన్ని సంస్థల కొనుగోలుకు ఈ నిధులను వినియోగిస్తామని ఈ సందర్భంగా బఫెట్ ప్రకటించారు. 2017 నాటికి సంస్థ ఈక్విటీ విలువ 358 బిలియన్ డాలర్లకు చేరిందని చెప్పారు.

పారిశ్రామిక రంగం విస్తరిస్తేనే పెట్టుబడుల్లో రెండంకెల వృద్ధి

■ **తాజా నివేదికలో సిటీ గ్రూపు స్పష్టీకరణ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: పెట్టుబడుల విషయంలో భారత్ రెండంకెల వృద్ధిరేటును సాధించి, పెరుగుతున్న కార్మిక శక్తికి అనుగుణంగా తగినన్ని ఉద్యోగాలు సృష్టించాలంటే దేశంలో పారిశ్రామిక రంగాన్ని మరింత విస్తరించుకోవడంతో పాటు 2025 నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో తయారీ రంగం వాటాను 25 శాతానికి పెంచుకోవాల్సిన అవసరం ఉందని సిటీ గ్రూపు తన తాజా నివేదికలో పేర్కొన్నది. కార్మిక ఉత్పాదకతను, పెట్టుబడులను, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం జీడీపీ వృద్ధికి మూడు ప్రధాన చోదకాలని సిటీ గ్రూపు స్పష్టం చేసింది. జీడీపీ వృద్ధిరేటు 8 శాతం దాటాలంటే పెట్టుబడుల వృద్ధిరేటును కనీసం 10 శాతానికి పెంచుకోవడంతో పాటు కార్మిక ఉత్పాదకతను 6 శాతానికి పైగానూ, ఉత్పత్తి సామర్థ్యాన్ని 3 శాతానికి పైగానూ పెచుకోవాల్సిన అవసరం ఉందని సిటీ గ్రూపు అభిప్రాయపడింది. దేశంలో పెట్టుబడులను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను సిటీ గ్రూపు ఈ నివేదికలో వివరిస్తూ.. మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు 1 శాతం పెరిగితే జీడీపీ వృద్ధిరేటు 1.2 శాతం పెరుగుతుందని పేర్కొన్నది.

రూ.2.18 లక్షల కోట్ల పెట్టుబడులకు 364 ఏంవోయూలు కుదుర్చుకున్న ఏపీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 25: విశాఖపట్నంలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 3,84,662 ఉద్యోగాలను సృష్టించేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) సహా వేర్వేరు సంస్థలతో రూ.2,18,814 కోట్ల విలువైన అవగాహనా ఒప్పందాలను (ఎంవోయూలను) కుదుర్చుకున్నది. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ సదస్సులో తొలి రెండు రోజుల్లోనే 364 ఎంవోయూలు కుదిరాయని, వీటిలో ఒక్క రిలయన్స్ సంస్థే ఆయిల్, గ్యాస్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో రూ.52 వేల కోట్ల పెట్టుబడులు పెడతామని హామీ ఇచ్చినట్లు ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి ఎన్ అమర్‌నాథ్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. విద్యుత్ రంగంలో అత్యధికంగా రూ.1,11,921 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 34 సంస్థల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, పారిశ్రామిక, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక రంగాల్లో రూ.39,281 కోట్ల పెట్టుబడులకు 22 ఒప్పందాలు, వైమానిక, రక్షణ రంగాల్లో రూ.9,406 కోట్ల పెట్టుబడులకు 10 ఒప్పందాలు కుదిరాయని ఆయన వివరించారు. ఈ సదస్సులో తొలి రోజు 79 ఎంవోయూలు, రెండో రోజు 285 ఎంవోయూలు కుదిరాయని కుదిరాయని అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

పోటెత్తనున్న పబ్లిక్ ఆఫర్లు

రాబోయే నెలల్లో పబ్లిక్ ఆఫర్లు వెల్లువెత్తనున్నాయి. ప్రాజెక్టుల అభివృద్ధి, వ్యాపార విస్తరణలో భాగంగా మరిన్ని సంస్థలు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్లలోకి రావాలనుకుంటుండటంతో మున్ముందు పబ్లిక్ ఇష్యూలు పోటెత్తనున్నాయి. 24కుపైగా సంస్థలు ఐపీవో ప్రయత్నాలు చేస్తుండగా, రూ.25,000 కోట్ల నిధులను సమీకరించాలని చూస్తున్నాయి. హిందుస్థాన్ ఏరోనాటిక్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, బార్బిక్-నేషన్ హాస్పిటాలిటీ, ఫ్లెమింగో ట్రావెల్ రిటైల్, భారత్ డైనమిక్స్, ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, ఆర్ఐటీఈఎస్, మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్, బంధన్ బ్యాంక్, ఇండోస్టార్ క్యాపిటల్ ఫైనాన్స్, నజర టెక్నాలజీస్, రౌటే మొబైల్ తదితర సంస్థలు ఐపీవో సన్నాహాలు చేస్తున్నాయి. గతేడాది 36 సంస్థలు ఐపీవోల నుంచి రూ.67,000 కోట్లు అందుకున్న విషయం తెలిసిందే. 2010లో అత్యధికంగా రూ.37,535 కోట్లు పొందగా, ఆ తర్వాత 2017లోనే పెద్ద ఎత్తున ఐపీవోల ద్వారా నిధుల సమీకరణ జరిగింది.

హిండ్‌కాన్ కెమికల్ ఐపీవో నేడే

రసాయన ఉత్పత్తుల తయారీ సంస్థ హిండ్‌కాన్ కెమికల్స్ ఐపీవో సోమవారం ప్రారంభం కానుంది. రూ.7.73 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా వస్తున్న ఈ ఐపీవో బుధవారం ముగియనున్నది. రూ.10 ముఖ విలువ కలిగిన మొత్తం 27,60,000 ఈక్విటీ షేర్లను ఈ సందర్భంగా అమ్మకానికి పెడుతున్నట్లు ఆదివారం హిండ్‌కాన్ తెలియజేసింది. ఒక్కో షేర్ ధరను రూ.28గా నిర్ణయించారు. గత ఆర్థిక సంవత్సరం (2016-17) సంస్థ నికర ఆదాయం రూ.33.94 కోట్లుగా ఉంటే, ఇందులో నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ ఎగుమతుల ద్వారా పొందినదే 32.14 శాతమని హిండ్‌కాన్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

ఆర్థిక గణాంకాలపై ఆధారం


బ్యాంక్ మోసాలతో ట్రేడింగ్ ప్రభావం • రూపాయి విలువ కూడా కీలకమేనంటున్న నిపుణులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: స్థూల ఆర్థిక గణాంకాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్, గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు కూడా భారతీయ మార్కెట్లను శాసించగలవని చెబుతున్నారు. ఇక పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంతోపాటు, ఇతరత్రా బ్యాంకుల్లో మోసాల ప్రభావం ఉండనే ఉంటుందన్న అభిప్రాయాల్ని మార్కెట్ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వెలుగుచూస్తున్న వరుస స్కాంలతో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న విషయం తెలిసిందే. గత వారం సెన్సెక్స్ 131.39 పాయింట్లు, నిఫ్టీ 38.75 పాయింట్లు లాభపడ్డాయి. బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవగా, సీబీఐ విచారణ, అరెస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తులు వంటివి మదుపరులను కొనుగోళ్ల వైపునకు వెళ్లకుండా అడ్డపడ్డాయి. ఈ వారం కూడా ఇదే పరిస్థితులకు ఎక్కువ అవకాశాలున్నాయని పలువురు నిపుణులు అంటున్నారు. కాగా, బుధవారం ఉత్పాదక రంగం కోసం పీఎంఐ గణాంకాలు విడుదలవుతుండగా, ఈ జనవరి-మార్చి త్రైమాసికానికిగాను జీడీపీ అంచనాలూ వెల్లడి కానున్నాయి. దీంతో మదుపరులు వీటి ఆధారంగా తమ పెట్టుబడులపై ఓ నిర్ణయానికి రావచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు. ఇక శుక్రవారం హోలీ సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో ఈ వారం నాలుగు రోజులే ట్రేడింగ్ జరుగనున్నది.

సెబీ, ఎక్స్ఛేంజ్‌ల విచారణ

కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల ఈక్విటీ, డెరివేటివ్‌ల ట్రేడింగ్‌లో అవకతవకలు జరిగాయా? అన్న కోణంలో అటు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, ఇటు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ విచారణ జరుపుతున్నాయి. సెబీ లోగోతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను ఉద్దేశిస్తూ ఈ నెల 21న వాట్సాప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఓ నకిలీ లేఖ చక్కర్లు కొట్టిన నేపథ్యంలోనే ఈ విచారణకు తెరలేచింది. పీఎన్‌బీ కుంభకోణం మధ్య ఈ లేఖ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ సృష్టించగా, మదుపరులను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశ్యంతోనే ఈ లేఖ విడుదలైందని తర్వాత గుర్తించారు. అయినా ఎవైనా అక్రమాలు చోటుచేసుకున్నాయా? అని విచారణ జరుగుతున్నది.

రూ.58,650 కోట్లు ఎగిసిన ఎనిమిది సంస్థల మార్కెట్ విలువ



బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లోని టాప్-10 కంపెనీల్లో ఎనిమిదింటి విలువ గత వారం రూ.58,650.26 కోట్లు ఎగిసింది. దేశీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ అత్యధికంగా రూ.26,742.6 కోట్లు ఎగిసి రూ.5,89,007.15 కోట్ల వద్దకు చేరింది. ఆ తర్వాత ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువ రూ.7,790.98 కోట్లు పుంజుకుని రూ.5,91,607.74 కోట్లను తాకింది. టాప్-10 సంస్థల్లో హిందుస్థాన్ యునీలివర్, మారుతి సుజుకీల మార్కెట్ విలువ మాత్రమే దాదాపు రూ.10,500 కోట్లు పడిపోగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐల సంపద రూ.24,000 కోట్లకుపైగా పెరిగింది. ప్రస్తుతం టాప్-10 సంస్థల్లో మార్కెట్ విలువ ఆధారంగా ఆర్ఐఎల్ మొదటి స్థానంలో ఉండగా, తర్వాతి స్థానంలో టీసీఎస్ ఉన్నది.

పీఎన్‌బీ దెబ్బకు రూ.10వేల కోట్లు పోయాయి



దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఈ నెలలో ఇప్పటిదాకా విదేశీ మదుపరులు దాదాపు రూ.10,000 కోట్ల (1.5 బిలియన్ డాలర్లు) పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో బ్యాంక్ షేర్లు విపరీతంగా అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. అమెరికా స్టాక్ మార్కెట్ల భారీ పతనం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే ఈ నెల 1-23 మధ్య రూ.9,899 కోట్ల పెట్టుబడులను విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) లాగేసుకున్నారు. అంతకుముందు నెల జనవరిలో రూ.13,780 కోట్లకుపైగా పెట్టుబడులను ఎఫ్‌పీఐలు స్టాక్ మార్కెట్లలోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల 14న రూ.11,400 కోట్ల (1.77 బిలియన్ డాలర్లు) కుంభకోణాన్ని పీఎన్‌బీ ప్రకటించిన సంగతీ విదితమే. దేశ, విదేశీ మదుపరుల భయాందోళనల మధ్య ఆ తర్వాతి ఐదు రోజుల్లోనే పీఎన్‌బీ మార్కెట్ విలువ ఏకంగా రూ.10,939 కోట్లు హరించుకుపోయింది. ఈ కుంభకోణంతో సంబంధమున్న ఇతర బ్యాంకుల షేర్లూ భారీ నష్టాలకు లోనయ్యాయి. మరోవైపు రుణ మార్కెట్లలోకి ఈ నెలలో రూ.1,500 కోట్లకుపైగా పెట్టుబడులను ఎఫ్‌పీఐలు తెచ్చారుతెచ్చారు.



బోధన్‌లోని బాహుబలి విగ్రహానికి మహామస్తకాభిషేకంలో భాగంగా క్షీర, పుష్పాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎల్లయ్య, ప్రముఖులు

బోధన్ బాహుబలికి మహా మస్తకాభిషేకం

బోధన్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బాహుబలికి ఆదివారం మహామస్తకాభిషేకం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం శ్రావణ బెళగోలలో దేశంలోనే అత్యంత ఎత్తయిన గోమతేశ్వరుడి విగ్రహానికి ఈ నెల 17న ప్రారంభమైన మహామస్తకాభిషేకం ఆదివారం ముగుస్తున్న సందర్భంగా, ఇక్కడి బాహుబలి విగ్రహానికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు.

నేటినుంచి ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

- సర్వాంగ సుందరంగా నర్సన్న సన్నిధి
- మార్చి 10వరకు వేడుకలు
- 5న ఆలయానికి సీఎం కేసీఆర్

ధర్మపురి టౌన్: బ్రహ్మోత్సవాలకు జగిత్యాల జిల్లా ధర్మపురిలోని లక్ష్మీనృసింహుడి సన్నిధి ముస్తాబైంది. సోమవారం నుంచి మార్చి 10వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు తెలంగాణతోపాటు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వేలాదిమంది తరలిరానుండగా, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన పాలకమండలి అధ్యక్షుడు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఈవో సుప్రియ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.




విద్యుత్‌దీపాలతో కాంతులీనుతున్న ధర్మపురి ఆలయం.. ఉగ్ర నరసింహస్వామి

ఉత్సవాలు ఇలా..: బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమై మార్చి 10 వరకు కొనసాగనున్నాయి. 27న స్వామివారి కల్యాణం, మార్చి 1 నుంచి 3వరకు బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో లక్ష్మీనరసింహస్వామి(యోగా, ఉగ్ర), వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం నిర్వహిస్తారు. 7న రథోత్సవం, 8నుంచి 10వరకు స్వామివార్ల ఏకాంతోత్సవాలను నిర్వహించనున్నారు.

మార్చి 5న సీఎం కేసీఆర్ రాక: ధర్మపురి నృసింహుడిని మార్చి 5న ముఖ్యమంత్రి కేసీఆర్ దర్శించుకుంటారు. ఉదయం 10 గంటలకు హెలీక్యాప్టర్‌లో వచ్చి, స్వామివారిని దర్శించుకున్న అనంతరం నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సమావేశంలో పాల్గొని బాసరకు బయలుదేరుతారు. ఈ మేరకు ఏర్పాట్లను ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ పర్యవేక్షిస్తున్నారు.



భద్రాద్రి రామాలయంలో నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

భద్రాద్రిలో భక్తుల సందడి

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం రామాలయం భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు రోజు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తజనం తరలివచ్చింది. గోదావరిలో పుణ్యస్నానాలు చేసి, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బేడా మండపంలో సీతారాముల నిత్య కల్యాణ్యాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

సింగరేణి.. ఉద్యోగాల గని

పూర్వవైభవం తీసుకొచ్చేందుకు సీఎం చర్యలు

ఆరు భూగర్భ గనులకు రేపు సీఎం కేసీఆర్ శంకుస్థాపన

దాదాపు 8వేల మందికి ఉపాధి అవకాశాలు

నిరుద్యోగుల్లో పెరుగుతున్న ఆశలు

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

సింగరేణి బొగ్గు గనులు మరోమారు ఉద్యోగాల గనిగా మారనున్నది. ఒకప్పుడు లక్ష మందికిపైగా ఉద్యోగులతో కళకళలాడిన సింగరేణి సంస్థ సమైక్య ప్రభుత్వాల నిర్వాకంతో క్రమంగా ప్రాభవం తగ్గింది. గత ప్రభుత్వాలు భూగర్భ గనులకు స్వస్తి పలికి కేవలం ఓపెన్ కాస్ట్‌లకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వడంతో రోజురోజుకు ఉద్యోగుల సంఖ్య పడిపోయింది. ఈ పరిస్థితిని గుర్తించిన సీఎం కేసీఆర్ సింగరేణి అభివృద్ధికి నడుం బిగించారు. ఇప్పటికే పలు రకాలుగా ఉపాధి అవకాశాలు కల్పించగా తాజాగా మంగళవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ వేదికగా ఆరు కొత్త భూగర్భ గనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు 7వేల నుంచి 8వేల మందికి ఉపాధి దొరికే అవకాశాలున్నాయి.

సింగరేణి సంస్థలో 2017 అక్టోబర్‌లో నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అనుబంధ సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని సింగరేణి కార్మికులు గెలిపించిన విషయం తెలిసిందే. పెద్దపల్లి, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థలో ప్రస్తుతం 52,534మంది కార్మికులు పని చేస్తున్నారు. సింగరేణి సంస్థలో ఆరు జిల్లాల్లో కలిపి 11 డివిజన్లు ఉన్నాయి. గతేడాది నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో 11 డివిజన్లకు గాను తొమ్మిది చోట్ల బెల్లంపల్లి, శ్రీరాంపూర్, ఆర్‌జీ-1, ఆర్‌జీ-2, ఆర్‌జీ-3, కార్పొరేట్, ఇల్లందు, కొత్తగూడెం, మణుగూర్ డివిజన్లలో టీబీజీకేఎస్‌కు పట్టం కట్టారు.

హామీ ఇచ్చిన నాలుగు నెలలకే..

టీబీజీకేఎస్‌ను గుర్తింపు సంఘంగా గెలిపించిన సందర్భంగా సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులతో 2017 అక్టోబర్ 8న హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి త్వరలోనే కొత్తగా ఆరు భూగర్భ బొగ్గు గనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆ హామీని కేవలం నాలుగు నెలల్లోనే అమలు చేయడానికి సీఎం కేసీఆర్ సిద్ధమయ్యారు.



మంచిర్యాలలోని సింగరేణి భూగర్భ గని (ఫైల్)

గతంలో పడిపోయిన ఉద్యోగుల సంఖ్య..

ప్రస్తుతం పెద్దపల్లి, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాది కొత్తగూడెం జిల్లాల్లో 52 వేలకుపైగా కార్మికులు పని చేస్తున్నారు. సింగరేణి సంస్థలో గడిచిన 20 ఏండ్ల కాలంలో కార్మికుల సంఖ్య దాదాపు 50 శాతానికి పడిపోయింది. 1990 తరువాత అసలు ఉద్యోగాల ఊసే లేకుండాపోయింది. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నది. 2014 నుంచి ఇప్పటివరకు 5,600 మందికి సంస్థలో కొత్తగా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. మరో 750 పోస్టులకు గత నెలలో నోటిఫికేషన్ విడుదల చేశారు. గతంలో మెడికల్ అన్‌ఫిట్ అయిన వారిలో నెలకు 25 మందిని మాత్రమే సంస్థ ఉద్యోగంలోకి తీసుకునేది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ మెడికల్ అన్‌ఫిట్ అయిన 3600 కార్మికుల పిల్లలకు ఒకేసారి ఉద్యోగాలు కల్పించారు. సింగరేణి ద్వారా జాబ్‌మేళా నిర్వహించి వేలాది మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. సంస్థ లాభాలతోపాటు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే యోచనతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి వ్యాప్తంగా కొత్తగా 11 భూగర్భ బొగ్గు గనులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మొదటి విడుతలో ఆరు గనులు ప్రారంభిస్తామని సీఎం కేసీఆర్ సింగరేణి ఎన్నికల తరువాత ప్రకటించారు. ఆ మేరకు వాటిని మంగళవారం ప్రారంభించనున్నారు. వీటి ద్వారా సుమారు 7వేల నుంచి 8వేల వరకు కొత్త ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉన్నది. ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వ చొరవపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త గనులు ఇవే..

కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలో కొండాపురం గని, కొత్తగూడెం ఏరియాలో రాంపురం షాఫ్ట్ బ్యాక్, మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో కేకే-6 గని, కాసిపేట-2గని, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేటీకే-5గని, కేటీకే-3 గనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. మిగిలిన ఐదు భూగర్భ గనులను సైతం త్వరలోనే ప్రారంభించడానికి సింగరేణి అధికారులు చర్యలు చేపడుతున్నారు.



జనగామ జిల్లా పాలకుర్తిలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

'గీత' సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్

పాలకుర్తి రూరల్: గీత కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ పేర్కొన్నారు. జనగామ జిల్లా పాలకుర్తిలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివృత్తుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, బంగారు తెలంగాణ సాధనలో గౌడ కులస్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో ట్రాక్టర్ నడుపుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో ఎంపీ సీతారాం నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

ప్రపంచ దేశాల దృష్టిని

ఆకర్షిస్తున్న తెలంగాణ

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి.. నర్సంపేటలో కిసాన్ మేళా

నర్సంపేట, నమస్తేతెలంగాణ: సీఎం కేసీఆర్ సమర్థవంతమైన పాలనతో తెలంగాణ రాష్ట్రం ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షిస్తున్నదని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో కిసాన్‌మేళా నిర్వహించారు. రూ.8.71కోట్ల విలువైన 270 సబ్సిడీ ట్రాక్టర్లను పంపిణీ చేశారు. కడియం మాట్లాడుతూ.. ప్రపంచదేశాల్లో ఒక్క తెలంగాణలోనే వ్యవసాయానికి పెట్టుబడుల కోసం ఏడాదికి ఎకరాకు రూ.8 వేల చొప్పున అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గోదావరి జలాలను నర్సంపేటలోని పాకాల, రంగయ్య చెరువుల్లోకి రప్పించి లక్ష ఎకరాలకు సాగునీటిని రప్పించే పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి, ఇంచార్జి కలెక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో చైన్‌స్నాచింగ్‌కు యత్నం

అడ్డొచ్చిన భర్త, మరో వ్యక్తిపై దాడి


జగిత్యాల క్రైం: పందులకు ఆహారం వేస్తున్న ఓ మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లేందుకు ముగ్గురు యువకులు ప్రయత్నించారు. మహిళ కేకలు వేయడంతో అడ్డొచ్చిన భర్త, మరో వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన పందుల వ్యాపారి చంద ఆంజనేయులు భార్య అరుణ తమ ఫాంలో పందులకు ఆహారం వేస్తుండగా, చెట్ల పొదల్లోంచి ముగ్గురు యువకులు అకస్మాత్తుగా వచ్చి ఆమె మెడలో మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. అరుణ ప్రతిఘటించి కేకలు వేయడంతో సమీపంలో మేకలు కాస్తున్న అరుణ్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా, దుండగులు అతడిపై బీరు సీసాతో దాడి చేశారు. అరుణ్ చెవిపై దెబ్బతగలడంతో అక్కడే పడిపోయాడు. అరుణ అరుపులు విన్న భర్త ఆంజనేయులు పరుగెత్తుకుంటూ రాగా, దుండగులు అతని ముఖంపై బీరు సీసాతో పొడిచారు. వారి కేకలు విన్న సమీపంలోని వారు ఘటనా స్థలానికి చేరుకునేలోపు దుండగులు బైక్‌పై పారిపోతుండగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

టీఆర్‌ఎస్‌లో వెల్లువలా చేరికలు

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి భారీగా వలసలు కొనసాగుతున్నాయి. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదాద్రి మండలం చొల్లేరు గ్రామంలో డీసీసీ ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులతోపాటు సుమారు 500 మంది, ఇతర పార్టీలు, సంఘాల నుంచి మరో 300మంది టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో సీపీఐ రాష్ట్ర నాయకుడు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండె వీరహనుమంతరావుతోపాటు సుమారు 500మంది ఎమ్మెల్యే జలగం వెంకటరావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఇదే జిల్లా చుంచుపల్లికి చెందిన సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు సుమారు 75మంది కూడా ఎమ్మెల్యే జలగం వెంకటరావు సమక్షంలో గులాబీగూటికి చేరారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సుందిళ్ల, ముస్త్యాల, పెద్దంపేట, మంగళ్‌పల్లి గ్రామాల నుంచి టీడీపీ, కాంగ్రెస్‌కు చెందిన దాదాపు 700 మంది నాయకులు, కార్యకర్తలు మంథనిలో ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో టీఆర్‌ఎస్ కండువా కప్పుకొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పద్మశాలీ సంఘం నాయకులు దాదాపు 200మందికిపైగా టీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీలు పురాణం సతీశ్‌కుమార్, నారదాసు లక్ష్మణ్‌రావు, టీఆర్‌ఎస్ ఇంచార్జి మూల విజయారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల ఆవాసం రామలింగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులతోపాటు 30 కుటుంబాలకు చెందిన 200మంది రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్ సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీఆర్‌ఎస్ నేత గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో 100 మంది యువకులు, విద్యార్థులు పార్టీలో చేరారు. వరంగల్ రూరల్ జిల్లా చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామశివారు కందిగడ్డతండా, ఔసులతండా, నడిగడ్డతండాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు 350మంది టీఆర్‌ఎస్‌లో చేరగా, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ పార్టీలోకి ఆహ్వానించారు.




భూపాలపల్లి జిల్లాలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి. పక్కన ఎంపీ సీతారాంనాయక్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో సీపీఐ నేత వీరహనుమంతరావుకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే జలగం



భువనగిరి జిల్లా చొల్లేరులో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న రాష్ట్రనాయకుడు మహేందర్‌రెడ్డి



ఆసిఫాబాద్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్సీలు పురాణం, నారదాసు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వర్గీకరణపై బీజేపీ నేతలను నిలదీస్తాం

నాలుగేండ్లుగా కాలయాపన

టీఎమ్మార్పీఎస్ నేతలు యాతాకుల, వంగపల్లి



ఖమ్మంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

మయూరిసెంటర్: వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతామని ప్రకటించిన బీజేపీ, అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు గడుస్తున్నా వర్గీకరణ ఊసెత్తకుండా దళితులను మోసం చేస్తున్నదని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగలు విమర్శించారు. ఆదివారం ఖమ్మం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత నిర్వహించిన మాదిగ చైతన్య సదస్సులో వారు మాట్లాడారు. వర్గీకరణ చేపట్టకుండా బీజేపీ నేతలు యాత్రల పేరిట దళితుల బస్తీల్లోకి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దళితులపై దాడులు చేస్తూనే దళిత్ అదాలత్ పేరిట బీజేపీ నేతలు తమ బస్తీల్లోకి రావాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్ర పేరుతో దళితులను మరోసారి మోసం చేయడానికి వస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలను మాదిగలు నమ్మే స్థితిలో లేరన్నారు. వర్గీకరణపై మాట్లాడకుండా పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బస్సు యాత్రచేస్తే దళితులు నమ్మే పరిస్థితులో లేరన్నారు. ఎమ్మార్పీఎస్ నుంచి 50 మంది రాష్ట్ర నాయకులు తమ సంఘంలోకి చేరడం శుభసూచకమన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర నాయకులు మధు మాదిగ, మందుల ప్రభాకర్ మాదిగ, ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా కొండగట్టులో మాల విరమణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈటల రాజేందర్, పక్కన ఎంపీ వినోద్



కొండగట్టులో పురాతన మెట్లదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన ఎంపీ వినోద్, ఎమ్మెల్యే శోభ

కరువులేని రాష్ట్రంగా తెలంగాణ

- సంక్షేమ పథకాలతో పేదలకే ప్రజాధనం
- ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్
- కొండగట్టు ఆలయాభివృద్ధికి చర్యలు: మంత్రి అల్లోల

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టు, సాగునీటి పథకాలతో రానున్న కాలంలో కరువులేని రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకోనున్నదని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజన్నను ఆయన దర్శించుకున్నారు. అనంతరం కొండగట్టు గుట్టపై రూ.2.5 కోట్లతో నిర్మించనున్న మాల విరమణ మండపం, మల్యాలలో రూ.1.30 కోట్లతో పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలతో ప్రజాధనం పేద ప్రజలకే చేరుతున్నదన్నారు. తెలంగాణ ఏర్పడిన అనతికాలంలోనే దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందన్నారు. ఖజానా నుంచి నేరుగా నిధులు విడుదల చేసి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నది దేశంలో ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన పేర్కొన్నారు.

రూ.6.11కోట్లతో కొండగట్టుకు భగీరథ నీరు: మంత్రి అల్లోల

కొండగట్టు ఆలయంలో నీటి ఎద్దడి నివారణకు రూ.6.11 కోట్లతో మిషన్ భగీరథ పథకం ద్వారా నీళ్లు అందించేందుకు పనులు ప్రారంభించినట్టు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. కొండగట్టు దేవస్థానంలో రూ.2.25 కోట్ల నిధులతో మెట్ల దారి ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అల్లోల మాట్లాడుతూ యాదాద్రి, వేములవాడ, కాళేశ్వరం, భద్రాద్రి వంటి దేవాలయాలకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. కొండగట్టు అంజన్న దేవస్థానానికి సైతం రూ.5కోట్లు మంజూరు చేశామన్నారు. మార్చి 31, మే 10న నిర్వహించనున్న హన్మాన్ జయంతి ఉత్సవాలకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు

పగటిపూట ఉక్కబోత.. రాత్రి వేళ చలి గాలులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే రెండు డిగ్రీల మేర పెరిగాయి. ఫలితంగా ఎండల తీవ్రత కొనసాగుతున్నది. ఆదివారం మంచిర్యాల, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 37.9 డిగ్రీలు, కుమ్రంభీం ఆసిఫాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ జిల్లాల్లో 37.8 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లాలో 10.4, మేడ్చల్ జిల్లాలో 10.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పగలు ఉక్కబోత, రాత్రి వేళ చలి గాలులు వీస్తున్నాయని, వారం వరకు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు కొనసాగే అవకాశాలున్నట్టు వాతావరణ అధికారులు తెలిపారు.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
వికారాబాద్	37.2	10.0
మహబూబ్‌నగర్	37.8	10.0
రంగారెడ్డి	37.2	10.4
నాగర్‌కర్నూల్	36.9	10.7
మేడ్చల్	35.7	10.9
సంగారెడ్డి	37.5	11.0
భద్రాద్రి కొత్తగూడెం	37.9	11.1
జోగుళాంబ గద్వాల	36.0	11.2
యాదాద్రి భువనగిరి	37.2	11.6
మెదక్	37.5	11.9
కామారెడ్డి	37.2	12.1
ఖమ్మం	37.8	12.1
నల్లగొండ	37.2	12.4
వనపర్తి	37.4	12.5
సిద్దిపేట	37.2	12.5
వరంగల్ అర్బన్	37.8	12.8
మహబూబాబాద్	37.9	12.8
రాజన్న సిరిసిల్ల	37.8	13.0
జనగామ	37.8	13.0
నిజామాబాద్	37.8	13.5
సూర్యాపేట	37.5	13.6
వరంగల్ రూరల్	37.8	13.8
జయశంకర్ భూపాలపల్లి	37.8	13.8
కరీంనగర్	37.5	13.9
జగిత్యాల	37.8	14.2
పెద్దపల్లి	37.7	14.5
నిర్మల్	37.7	14.5
కుమ్రంభీం ఆసిఫాబాద్	37.8	14.6
ఆదిలాబాద్	37.3	14.7
మంచిర్యాల	37.9	15.0
హైదరాబాద్	35.9	16.3



మాతా దర్శనం కోసం నిరీక్షిస్తున్న అమిత్‌షా దంపతులు

యానగుంది మాణిక్యగిరి క్షేత్రానికి అమిత్‌షా

మాతా దర్శనం దొరక్క వెనక్కి..

నారాయణపేట, నమస్తే తెలంగాణ: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని యానగుంది మాణిక్యగిరి క్షేత్రానికి ఆదివారం సాయంత్రం బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, ఆయన సతీమణి సోనల్ హెలీకాప్టర్‌లో వచ్చారు. ఆలయ ట్రస్టు సభ్యులతోపాటు బీజేపీ నాయకులు వారికి స్వాగతం పలికారు. దర్శనం కోసం ఆలయంలో 15నిమిషాలపాటు వేచి చూసినా మాతా మాణికేశ్వరి దర్శనం ఇవ్వకపోవడంతో అమిత్‌షా కర్ణాటకలోని సుర్పూర్‌లో జరిగే పార్టీ కార్యకర్తల సమావేశానికి వెళ్లిపోయారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
సోమవారం 26 ఫిబ్రవరి 2018



మాటలు రావడం లేదు..

న్యూఢిల్లీ: వెండితెర హృదయ సామ్రాజ్ఞి, అందాల తార శ్రీదేవి హఠాన్మరణం పట్ల క్రీడా లోకం తీవ్ర దిగ్భ్రాంత్రికి లోనైంది. ఆమె మరణం తమను షాక్‌కు గురి చేసిందని పలువురు క్రీడాకారులు బాధను వ్యక్తం చేశారు. గతంలో ఆమెతో కలిసి గడిపిన మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

“ ఇది చాలా బాధాకరమైన విషయం. నిద్ర నుంచి మేల్కొన్న వెంటనే ఇలాంటి విషయాన్ని చదువడం నిజంగా విచారకరం.. ఆమె గురించి చెప్పడానికి నాకు మాటలు రావడం లేదు. ఎందుకంటే ఆమెను చూస్తూ పెరిగా. శ్రీదేవి లేదన్న విషయం జీర్ణించుకోవడం కష్టంగా ఉంది. ఆమె కుటుంబ సభ్యులకు, ఆమెను ఆరాధించే అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి.

– సచిన్

“ శ్రీదేవి మరణవార్త విని షాక్‌కు గురయ్యా. కొన్ని నెలల కిందటే నా షోలో ఆమెను కలిశా. నిజంగా ఈ విషయాన్ని నమ్మలేకపోతున్నా.

–గంగూలీ

“ మీ మరణం తీవ్రంగా కలిచి వేసింది. మిమ్ముల్ని మిస్ అవుతున్నందుకు చాలా బాధగా ఉంది మేడమ్. –సైనా

అరుణా రెడ్డికి గవర్నర్ అభినందన

హైదరాబాద్: జిమ్నాస్టిక్స్ వరల్డ్‌కప్‌లో భారత్‌కు తొలి కాంస్య పతకం అందించిన అరుణా రెడ్డిని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అభినందించారు. ‘అరుణ ప్రదర్శనను చూసి దేశం గర్వపడుతున్నది. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలి’ అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అరుణకు ఏడో స్థానం

జిమ్నాస్టిక్స్ వరల్డ్‌కప్ వాల్ట్ విభాగంలో సంచలనాలు సృష్టించిన తెలంగాణ అమ్మాయి బుద్దా అరుణారెడ్డి.. ఫ్లోర్ ఈవెంట్‌లో నిరాశపర్చింది. ఆదివారం జరిగిన ఈ ఈవెంట్ టైటిల్ పోరులో అరుణ 10.833 పాయింట్లతో ఏడోస్థానంతో సరిపెట్టుకుంది. ప్యారలర్ బార్స్ ఫైనల్స్‌లో రాకేశ్ పాత్రా 13.433 పాయింట్లతో ఏడోస్థానంలో నిలిచింది. స్వర్ణం పతకం సాధించిన జియోమింగ్ వు (చైనా) కంటే 1.400 పాయింట్లు తక్కువ. ఢిల్లీ కామన్వెల్త్ ఆసియా గేమ్స్ కాంస్య పతక విజేత ఆశిష్ కుమార్.. వాల్ట్ విభాగంలో 13.583 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు.



మాకు మేమే పోటీ

సఫారీ పరీక్షలో విరాట్‌సేన అదుర్స్

కోహ్లీ, ధోనీకి విశ్రాంతి

ముక్కోణపు టీ20 టోర్నీకి కెప్టెన్‌గా రోహిత్



51 రోజులు..12 మ్యాచ్‌లు..8 విజయాలు..2 సిరీస్‌లు..టెస్టుల్లో నంబర్ వన్ హోదా..అన్నిటికీ మించి మూడు దశాబ్దాల కల సాకారం అయిన వేళ, ప్రపంచ క్రికెట్‌లో మాకు మేమే పోటీ అని మరోసారి సాటి చెప్పింది. ఉప్పొంగుతున్న సంతోషంతో టీమ్ ఇండియా స్వదేశంలో సగర్వంగా అడుగుపెడుతున్నది.. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి భారత్ ఎంతో నేర్చుకున్నా..నేర్చుకోవాల్సింది ఇంకా ఉన్నది..బలాలు, బలహీనతలు బయటపడ్డాయి..లోపాలను సరిదిద్దుకుంటూ బలగాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తేనే 2019 ప్రపంచకప్ వరకు పూర్తి స్థాయి జట్టుగా ఎదుగుతుంది.

(నమస్తే తెలంగాణ స్పోర్ట్స్‌డెస్క్)

రెండు నెలల క్రితం భారత జట్టును తక్కువ అంచనా వేసిన విమర్శకులకు విరాట్ సేన దీటైన సమాధానమిచ్చింది. సఫారీ పరీక్షలో ఫస్ట్ క్లాస్‌లో పాసై తమ సత్తా ఏంటో నిరూపించుకున్నది.వన్డే సిరీస్‌తో పాటు టీ20 సిరీస్‌నూ గెలిచి టీమ్‌ఇండియా సంచలనం నమోదు చేసింది. ఆఖరిదైన ఐదో టీ20లో విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–1తో గెలుచుకున్నది. అంతకు ముందు 5–1తో వన్డే సిరీస్ గెలుచుకున్న భారత్ సఫారీ గడ్డపై వరుసగా రెండు సిరీస్‌లు గెలిచి రికార్డు సృష్టించింది. సుదీర్ఘ విరామం భారత్ తరపున ఆడిన సురేశ్ రైనా (27 బంతుల్లో 43; 5 ఫోర్లు, 1 సిక్స్) ధవన్ (47)తో కలిసి టీమ్‌ఇండియాకు చెప్పుకోదగ్గ స్కోరు (172/7) అందించడంలో కీలకపాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో మెరిసిన రైనా బౌలింగ్‌లోనూ రాణించి కీలకమైన మిల్లర్ (24) వికెట్ తీసి దక్షిణాఫ్రికాను ఆదిలోనే దెబ్బతీశాడు. డుమినీ (55), జాన్‌కర్ (49) కాసేపు భారత శిబిరాన్ని కంగారు పెట్టినా భువనేశ్వర్ (2/24) లాంఛనం పూర్తి చేశాడు. ప్రత్యర్థి 20 ఓవర్లలో 165/6కు పరిమితమవడంతో భారత్ 7 పరుగుల తేడాతో గెలిచి సిరీస్ దక్కించుకున్నది. ఓవరాల్‌గా దక్షిణాఫ్రికా పర్యటనలో నాలుగు, ఐదు స్థానాలో భారత బ్యాట్స్‌మన్ ఆకట్టుకోలేకపోయారు. ఆల్‌రౌండర్ పాత్రలో పాండ్య ఆశించిన మేర రాణించలేకపోయాడు. బ్యాటింగ్ భారమంతా కెప్టెన్ కోహ్లీ, ధవన్‌పైనే అధికంగా పడింది. రోహిత్ అడపాదడపా మెరుస్తున్నాడే తప్ప, నిలకడను చూపించలేకపోతున్నాడు. బౌలింగ్‌లోనూ బుమ్రా, భువనేశ్వర్‌కు అంతే స్థాయిగల ప్రత్యామ్నాయం కనిపించడం లేదు.

కోహ్లీకి నంబర్ వన్ ‘గద’

దక్షిణాఫ్రికా గడ్డపై టెస్ట్ సిరీస్ కోల్పోయినప్పటికీ నంబర్‌వన్ ర్యాంకులోనే టీమ్‌ఇండియా కొనసాగుతున్నది. దీంతో ఐసీసీ కోహ్లీకి టెస్టు చాంపియన్‌షిప్ ‘గద’ను అందజేసింది. ‘హాల్ ఆఫ్ ఫేమ్’ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, గ్రేమీ పొలాక్.. గదతో పాటు మిలియన్ డాలర్ల (రూ. ఆరున్నర కోట్లు) ప్రైజ్‌మనీని కోహ్లీకి అందజేశారు.



కోహ్లీకి గద అందజేస్తున్న గవాస్కర్, గ్రేమీ పొలాక్

గత నెలలో జొహాన్నెస్‌బర్గ్‌లో జరిగిన టెస్టు మ్యాచ్ గెలువడం ద్వారా టీమ్‌ఇండియా నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకుంది. కటాఫ్ తేదీ ఏప్రిల్ 3 వరకు మరే జట్టూ నంబర్‌వన్‌కు చేరే అవకాశం లేదు. 2002 తర్వాత ఐసీసీ గదను అందుకున్న పదో కెప్టెన్ విరాట్.

కెప్టెన్‌గా రోహిత్ రికార్డ్

విరాట్ కోహ్లీ వెన్నునొప్పి కారణంగా చివరి టీ20కి దూరమవడంతో..కెప్టెన్సీ చేపట్టి భారత్‌కు విజయాన్ని అందించిన రోహిత్ విశిష్ట కెప్టెన్ల జాబితాలో చేరాడు. సారథ్యం చేపట్టిన తొలి మ్యాచ్‌నే గెలువడం ద్వారా సిరీస్‌ను దక్కించుకుని అరుదైన ఘనత సాధించాడు. మిస్బావుల్ హక్, అఫ్రిదీ, సర్ఫరాజ్, సంగక్కర, మలింగ గతంలో తాము నాయకత్వం వహించిన తొలి మ్యాచ్‌లో గెలిచి సిరీస్ దక్కించుకున్నారు. 2017లో శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో రోహిత్ సారథ్య బాధ్యతలు చేపట్టి ఆ సిరీస్‌ను 3–0తో గెలుచుకున్న సంగతి తెలిసిందే.

రైనాకు మళ్లీ చాన్స్

న్యూఢిల్లీ: ప్రపంచకప్ ఆడటమే తన లక్ష్యమని చెప్పిన రైనా..ఆ దిశగా దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో సత్తాచాటి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించడంతో ఇతడిని ముక్కోణపు టీ20 సిరీస్‌కు ఎంపిక చేశారు. శ్రీలంకలో మార్చి 6 నుంచి జరుగబోయే టోర్నీకి రోహిత్‌శర్మ సారథ్యంలోని జట్టును ఆదివారం ప్రకటించారు. కోహ్లీ, ధోనీ, పాండ్య, బుమ్రా, భువీలకు విశ్రాంతి ఇచ్చి విజయ్‌శంకర్, దీపక్‌హుడా,రిషబ్‌ను జట్టులోకి తీసుకున్నారు. టీమ్‌ఇండియాలో స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో ముక్కోణపు టోర్నీకి ఎంపికైన క్రికెటర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహతహలాడుతున్నారు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనలు ఆ తర్వాత ప్రపంచకప్ ఉండటంతో..ఈ మెగా టోర్నీని దృష్టిలో పెట్టుకుని బలమైన రిజర్వ్ బెంచ్‌ను తయారుచేసేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ పక్కా ప్రణాళికతో సిద్ధమైంది. ఈ నేపథ్యంలో రైనాకు, రాహుల్, మనీశ్ నుంచి తీవ్రమైన పోటీ ఎదురవనుంది. ధోనీకి ఆల్టర్నేట్‌గా నిరూపించుకోవడానికి దినేశ్, రిషబ్‌కు ఇది మంచి అవకాశం.



జట్టు: రోహిత్ (కెప్టెన్), ధవన్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, రైనా, మనీశ్, దినేశ్, రిషబ్ పంత్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చహాల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్, జైదేవ్, సిరాజ్.

పాండ్యాకు ప్రత్యామ్నాయం


కపిల్‌దేవ్ తర్వాత అంతటి నిఖార్సైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యానే అంటూ కొందరు కితాబిచ్చినప్పటికీ, ఈ యువ ఆల్‌రౌండర్ దక్షిణాఫ్రికా పర్యటనలో భారీ ప్రదర్శనలేమీ ఇవ్వలేకపోయాడు. అందుకే ప్రత్యామ్నాయంగా దీపక్ హుడా, విజయ్ శంకర్, వాషింగ్టన్ సుందర్‌ను ముక్కోణపు టోర్నీకి ఎంపిక చేశారు. ఈ ముగ్గురు తమ సత్తాను నిరూపించుకునేందుకు సువర్ణావకాశమనే చెప్పాలి. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా, మీడియం పేస్ బౌలర్‌గా తనకంటూ ప్రత్యేకతను ఏర్పరుచుకున్న తమిళనాడు క్రికెటర్ విజయ్‌శంకర్ దుమ్మురేపేందుకు సిద్ధంగా ఉన్నాడు. దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్ స్పిన్, బ్యాటింగ్‌లో అదురగొట్టగల సమర్థులు.

సిరాజ్ కా సిల్ సిలా



హైదరాబాదీ యువ పేసర్ మహ్మద్ సిరాజ్‌పై సెలక్టర్లు మరోసారి నమ్మకం ఉంచారు. గత ఏడాది కాలంగా ఇతడిని జట్టులో కొనసాగిస్తున్న సెలక్టర్లు ముక్కోణపు టోర్నీకీ ఎంపిక చేశారు. తాజాగా విజయ్‌హజారే టోర్నీలో ఐదు వికెట్ల ఫీట్ సాధించడంతో పాటు వరుస మ్యాచుల్లో వికెట్ల పండుగ చేసుకుంటున్న ఈ హైదరాబాదీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరాటపడుతున్నాడు. ఈ టోర్నీ తర్వాత ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనలు ఉండటంతో వాటిలో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా తన బౌలింగ్‌లో దమ్ము చూపిస్తే సరి. సిరాజ్‌తో పాటు ఉనద్కట్, శార్దూల్ అసలైన పరీక్షకు సిద్ధమయ్యారు.

భువీ, శిఖర్‌ర్యాంక్‌లు మెరుగు..



ధవన్

దుబాయ్: దక్షిణాఫ్రికా గడ్డపై విశేషంగా రాణించిన ఓపెనర్ శిఖర్ ధవన్, పేసర్ భువనేశ్వర్ కుమార్.. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌నూ మెరుగుపర్చుకున్నారు. ఆదివారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో ధవన్ 14 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ ర్యాంక్ 28కి చేరుకున్నాడు. టీ20 సిరీస్‌లో 143 పరుగులు చేయడం శిఖర్‌కు కలిసొచ్చింది. ఏడు వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్ 20 స్థానాలు మెరుగుపర్చుకుని 12వ ర్యాంక్‌లో నిలిచాడు. సఫారీ కెప్టెన్ డుమిని 24వ ర్యాంక్‌లో నిలిచాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ ఒక రేటింగ్ పాయింట్‌ను సాధించగా, దక్షిణాఫ్రికా ఓ పాయింట్‌ను చేజార్చుకుంది. పాకిస్థాన్ (126), ఆస్ట్రేలియా (126) దశాంశమానం తేడాతో వరుసగా టాప్–2లో కొనసాగుతుండగా భారత్ మూడో ర్యాంక్‌లో ఉంది.

ఐపీఎల్ షెడ్యూల్‌ను మార్చలేం: బీసీసీఐ



న్యూఢిల్లీ: కోల్‌కతాలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లను రీ షెడ్యూల్ చేయాలని ఐసీసీ చేసిన విజ్ఞప్తిని బీసీసీఐ తోసిపుచ్చింది. షెడ్యూల్‌ను మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఏప్రిల్ 22 నుంచి 26 వరకు కోల్‌కతాలో ఐసీసీ అత్యున్నత స్థాయి సమావేశం జరుగనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది క్రికెట్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. కానీ అదే సమయంలో నైట్‌రైడర్స్‌కు కోల్‌కతాలో ఎలాంటి హోమ్ మ్యాచ్‌లు లేవు. దీంతో ఎలాగైనా తమ ప్రతినిధుల కోసం కొన్ని మ్యాచ్‌లు ఉండేలా షెడ్యూల్‌ను మార్చాలని ఐసీసీ.. బీసీసీఐని కోరింది. షెడ్యూల్ ప్రకారం నైట్‌రైడర్స్ తన హోమ్ మ్యాచ్ ఏప్రిల్ 6న, మే 3న ఆడనుంది. ఏప్రిల్ 22 నుంచి 26 మధ్య హైదరాబాద్, ముంబై, ఇండోర్, బెంగళూరు, జైపూర్‌లో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ షెడ్యూల్‌ను మారిస్తే అంతా గందరగోళంగా తయారవుతుందని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు ఈ సమావేశానికి పీసీబీ చైర్మన్ నజమ్ సేథీ హాజరుకావడంపై అనిశ్చితి నెలకొని ఉంది.

విజయ్ హజారే ఫైనల్లో సౌరాష్ట్ర



జడేజా (56)

న్యూఢిల్లీ: విజయ్ హజారే టోర్నీలో సౌరాష్ట్ర ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో సౌరాష్ట్ర 59 పరుగుల తేడాతో ఆంధ్రపై ఘన విజయం సాధించింది. తొలుత స్టార్ ఆల్‌రౌండర్ జడేజా(56), అర్పిత్ వసావద(58) అర్ధ సెంచరీలతో సౌరాష్ట్ర నిర్ణీత 50 ఓవర్లలో 255 స్కోరు చేసింది. 69 పరుగులకు 4 వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు వచ్చిన జడేజా సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోయిన ప్రత్యర్థి ఆంధ్ర బౌలర్లకు ఏ మాత్రం అవకాశమివ్వకుండా కీలక ఇన్నింగ్స్‌తో రాణించాడు. అర్పిత్‌తో కలిసి ఐదో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. తన ఇన్నింగ్స్‌లో 4 ఫోర్లు, ఓ భారీ సిక్స్‌తో జడేజా సమయోచిత ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. కార్తీక్ రామన్(4/69) నాలుగు వికెట్లు పడగొట్టాడు. సౌరాష్ట్ర నిర్దేశించిన 256 పరుగుల లక్ష్యఛేదనలో ఆంధ్ర 45.3 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌటైంది. సుమంత్(42), రవితేజ(42) మినహా ఎవరూ రాణించలేకపోయారు. ధర్మేంద్ర జడేజా(4/40) నాలుగు వికెట్లతో అదురగొట్టాడు. ఈనెల 27న కర్ణాటక, సౌరాష్ట్ర మధ్య ఫైనల్ పోరు జరుగుతుంది.



చాపెల్ నన్ను ముంచాడు

ఆత్మకథలో గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు

కోల్‌కతా: సాధారణంగా కొంత మంది ఆత్మకథలు ఆసక్తిరేపడంతో పాటు వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతాయి. తమ జీవితంలో జరిగిన సంఘటనల సమహారంగా చేసుకుని ఆత్మకథలను రాస్తూ ఉంటారు. భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆత్మకథ ‘ఏ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్’ అనే పుస్తకంలో ఆసక్తికర విషయాలను పంచుకునే ప్రయత్నం చేశాడు.మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణంతో తీవ్ర సంక్షోభంలో దిక్కుతోచని స్థితిలో ఉన్న జట్టు నాయకత్వ పగ్గాలను గంగూలీ అందుకున్నాడు. సహచర ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తూ జట్టుకు చిరస్మరణీయ విజయాలందించడంలో కీలకమయ్యాడు. అయితే అలాంటి గంగూలీ.. గ్రెగ్ చాపెల్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. కెరీర్ పరంగానే కాదు వ్యక్తిగతంగా చాలా కష్టాలకు గురిచేశాడు చాపెల్. ఎవరి మాట వినిపించుకోకుండా అతన్ని కోచ్‌గా చేసినందుకు తనకు తగిన శాస్తి జరిగిందని ఆత్మకథలో చెప్పుకొచ్చాడు.

చెప్పకుండా బయటికి వెళ్లద్దు: భారత మాజీ కెప్టెన్ గంగూలీకి వింత అనుభవం ఎదురైంది. 2004లో ద్వైపాక్షిక సిరీస్ కోసం పాకిస్థాన్‌లో పర్యటించిన జట్టుకు కెప్టెన్ అయిన గంగూలీని అప్పటి దేశాధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ మందలించిన సందర్భం తాజాగా వెలుగులోకి వచ్చింది. లాహోర్‌లోని ఓ హోటల్లో జట్టుకు బస ఏర్పాటు చేశారు. అయితే భద్రతా సిబ్బంది కండ్లు గప్పి అర్ధరాత్రి పూట లాహోర్ వీధుల్లో తిరుగేందుకు దాదా బయటికి వెళ్లాడు. అక్కడి వారు గుర్తించారు. చేసేది ఏమి లేక బుకాయిస్తూ అక్కడి నుంచి మెల్లగా జారుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ముషారఫ్..గంగూలీని సుత్తిమెత్తగా వారించాడు. బయటికి వెళ్లాలనుకుంటే చెప్పండి భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, అంతేగాని సహసాలు చేయద్దని ముషారఫ్ ఫోన్‌లో మందలించాడు.

అమిత్‌కు స్వర్ణం

- మేరీకోమ్‌కు రజతం



మేరీకోమ్

సోఫియా (బల్గేరియా): స్ట్రాండ్జా స్మారక బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ల పంచ్ అదిరింది. ఆదివారం జరిగిన పురుషుల 49 కేజీల ఫైనల్ బౌట్‌లో అమిత్ పంగల్.. సైద్ మోర్దాజీ (మొరాకో)పై గెలిచి స్వర్ణంతో మెరిశాడు. హోరాహోరీగా సాగిన ఈ బౌట్‌లో.. ఆరంభంలో కాస్త తడబడిన హర్యానా బాక్సర్ చివరి రెండు రౌండ్లలో పదునైన పంచ్‌లతో విరుచుకుపడ్డాడు. మహిళల విభాగంలో భారత్‌కు రెండు రజతాలు దక్కాయి. 48 కేజీల ఫైనల్ బౌట్‌లో స్టార్ బాక్సర్ ఎంసీ మేరీకోమ్.. .. స్వెదా అసెనోవా (బల్గేరియా) చేతిలో ఓడి రెండోస్థానంలో నిలిచింది. బౌట్ ఆద్యంతం అద్భుతమైన పంచ్‌లతో ఆకట్టుకున్న మేరీకి ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు. అయితే ఎక్కువ శాతం భారత బాక్సరే పంచ్‌లు విసిరినా ఆశ్చర్యకర ఫలితం వచ్చింది. +81 కేజీల ఫైనల్ బౌట్‌లో సీమా పూనియా.. అన్నా ఇవనోవా (రష్యా) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. మీనా కుమారి దేవి (54 కేజీ), సరితా దేవి (60 కేజీ), స్వీటీ బూరా (75 కేజీ), భగ్యభతి కచారి (81 కేజీ)లకు కాంస్యాలు లభించాయి.

ద్రవిడ్ డిమాండ్‌కు బీసీసీఐ అంగీకారం

న్యూఢిల్లీ: జెంటిల్‌మన్‌కు సరైన నిర్వచనం తానే అని భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ మరోసారి నిరూపించుకున్నాడు. అండర్–19 ప్రపంచకప్‌ను భారత్ దక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించిన ద్రవిడ్, ఆ ఘనతను అందరికీ సమానంగా పంచిన విషయం తెలిసిందే. బీసీసీఐ తనకు రూ.50లక్షలు, మిగతా సహాయక సిబ్బందికి ఒక్కొక్కరికీ రూ.20లక్షలు ప్రకటించడంపై అసంతృప్తి తెలిపి, అందరికీ సమానంగా నజరానా ఇవ్వాలన్న డిమాండ్‌నూ వినిపించాడు. అయితే ద్రవిడ్ డిమాండ్‌కు బీసీసీఐ అంగీకరించింది. ద్రవిడ్‌తో పాటు సహాయక సిబ్బందికి రూ.25లక్షల చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది.

కివీస్ బోణీ

హామిల్టన్: ఇంగ్లండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 3 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యాన్ని కివీస్ 49.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. టేలర్ (113) సెంచరీ చేశాడు. తొలుత బట్లర్(79), రూట్(71) అర్ధసెంచరీలతో ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 284/8 స్కోరు చేసింది.

సమీర్‌కు స్విస్ ఓపెన్ టైటిల్



సమీర్

బసెల్ (స్విట్జర్లాండ్): భారత షట్లర్ సమీర్‌వర్మ స్విస్ ఓపెన్ సూపర్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఫైనల్లో జార్గెన్‌సెన్‌కు షాక్ ఇచ్చి విజేతగా నిలిచాడు.ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో సమీర్ 21–15, 21–13తో జార్గెన్‌సెన్(డెన్మార్క్)ను చిత్తు చేశాడు. గతేడాది సయ్యద్ మోడీ గ్రాండ్ ప్రిక్స్ గోల్డ్ టైటిల్ గెలిచిన సమీర్, 2016లో హాంకాంగ్ సూపర్ సిరీస్ చేజార్చుకున్నాడు. ఈ ఏడాది సమీర్‌కు ఇదే తొలి టైటిల్. గతంలో స్విస్ ఓపెన్‌ను శ్రీకాంత్ (2015), ప్రణయ్ (2016) గెలుచుకోగా ఆ జాబితాలో సమీర్ చేరాడు. “ టైటిల్ గెలువడం ఆనందంగా ఉంది. బాగా ఆడుతానన్న నమ్మకంతోనే బరిలోకి దిగాను, కానీ ఫైనల్ మ్యాచ్ ఇంత సులువుగా సాగుతుందని ఊహించలేదు. జార్గెన్‌సెన్ వందశాతం ఫిట్‌గా లేడు. “ అని సమీర్ విజయానంతరం తెలిపాడు.



ప్యోయాంగ్‌చాంగ్‌లో ఆదివారం వింటర్ ఒలింపిక్స్ పోటీలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో దక్షిణకొరియా అధ్యక్షునితో పాటు ఇవాంకా ట్రంప్ పాల్గొంది.

శాశ్వత దేశాధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్!

- **రెండుసార్లు మించరాదన్న నిబంధన తొలిగింపు**
- **చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతిపాదన**



బీజింగ్, ఫిబ్రవరి 25: చైనా కమ్యూనిస్టు పార్టీ అసాధారణ రీతిలో జీ జిన్‌పింగ్‌ను శాశ్వతంగా దేశాధ్యక్షుడిగా కొనసాగేందుకు భూమిక సిద్ధం చేసింది. రెండుసార్లకు మించి దేశాధ్యక్ష పదవిలో కొనసాగరాదన్న నిబంధనను తొలిగిస్తూ అధికార చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) రాజ్యాంగ సవరణను ప్రతిపాదించింది. ప్రస్తుతం రెండోసారి దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ (64) పదవీకాలం 2022తో ముగుస్తుంది. కానీ రాజ్యాంగ సవరణ చేయడంతో ఆ తర్వాత కూడా దేశాధ్యక్షుడిగా కొనసాగేందుకు వీలవుతుంది. 'దేశాధ్యక్షుడు, ఉపాధ్యక్ష పదవుల్లో నియమితులయ్యే వారు రెండుసార్లకు మించి ఎన్నికవ్వరాదు' అన్న చైనా రాజ్యాంగంలోని నిబంధనను సవరించాలని సీపీసీ కేంద్ర కమిటీ ప్రతిపాదించిందని అధికార వార్తా సంస్థ 'జిన్హువా' ఆదివారం తెలిపింది. ఈ ప్రతిపాదనను సోమవారం జరుగనున్న చైనా కమ్యూనిస్టు పార్టీ ప్లీనరీలో ఆమోదిస్తారని భావిస్తున్నారు. అదే జరిగితే ఆధునిక చైనాలో నిర్దిష్ట కాల పరిమితి లేని దేశాధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్ నిలుస్తారు. దీంతో చైనాలో శక్తిమంతమైన నేతగా అవతరిస్తారు. ఎవరైనా జీ జిన్‌పింగ్‌ను వ్యతిరేకిస్తే పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కింద పరిగణిస్తారు. 2013లో తొలిసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా, దేశాధ్యక్షుడిగా ఎన్నికైన జీ జిన్‌పింగ్‌కు 2016లో సీపీసీ 'కీలక' నేత హోదానిచ్చింది. తాజాగా అవినీతిని అరికట్టేందుకు నూతన అత్యున్నత సంస్థ 'జాతీయ పర్యవేక్షణ సంఘం' ఏర్పాటు చేయాలని కూడా సీపీసీ ప్రతిపాదించింది. ఇంతకు ముందు ఏడుగురు సభ్యుల నాయకత్వ కమిటీ ఉమ్మడి నిర్ణయాలు తీసుకునేది.

కానిస్టేబుల్ కాల్పుల్లో అసిస్టెంట్ కమాండర్ మృతి

షిల్లాంగ్: మేఘాలయ రాష్ట్రంలో ఓ ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ జరిపిన కాల్పుల్లో అసిస్టెంట్ కమాండర్ మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నైరుతి ఖాసీ హిల్స్ జిల్లాలో జరిగింది. 'నిందితుడిని అదుపులోకి తీసుకున్నాం. సర్వీస్ రివాల్వర్‌ను సీజ్ చేశాం. విచారణ కొనసాగుతున్నది' అని ఎస్పీ హెచ్‌జీ లింగ్డో తెలిపారు. ఆర్‌పీఎఫ్ అధికారి ముఖేశ్ త్యాగిని అక్కడే పనిచేస్తున్న కానిస్టేబుల్ అర్జున్ దేశ్‌వాల్ తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చిచంపారు.

కశ్మీర్‌లో పోలీస్ పోస్టులపై ఉగ్రదాడులు

- **ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు మృతి**

శ్రీనగర్, ఫిబ్రవరి 25: కశ్మీర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం మిలిటెంట్లు జరిపిన దాడిలో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు మృత్యువాత పడ్డారని డీజీపీ ఎస్పీ వైద్ తెలిపారు. బద్గామ్ జిల్లా పరిధిలోని చరారే షరీఫ్ దర్గా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కుల్తార్ సింగ్‌పై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన కుల్తార్‌సింగ్.. దవాఖానలో చికిత్స పొందుతూ మరణించాడు. శ్రీనగర్‌లోని సౌరా ప్రాంతంలోని హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫజల్ హక్ ఖురేషీ నివాసం బయట గల పోలీస్ పోస్టుపైనా ఉగ్రవాదులు కాల్పులు జరుపడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. ఈ వార్త తెలియగానే మిలిటెంట్లను పట్టుకునేందుకు ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో ఇద్దరు కానిస్టేబుళ్లు అమరులు కావడంపై డీజీపీ వైద్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'మనం పాకిస్థాన్‌తో పరోక్ష యుద్ధం చేస్తున్నాం. పోలీసు జవాన్లు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి' అని సూచించారు.

సరిహద్దుల్లో కాల్పులకు తెగబడిన పాక్

జమ్ముకశ్మీర్‌లోని రాజోరి జిల్లాలో ఆదివారం పాక్ మళ్లీ కాల్పులకు తెగబడింది. రెండు గంటలపాటు ఇరువైపులా భారీగా కాల్పులు జరిగాయి. అయితే ఎవరికీ ప్రాణహాని జరుగలేదని అధికారులు తెలిపారు. గత పదినెలలుగా నియంత్రణరేఖ (ఎల్వోసీ) వెంబడి పాక్ జరిపిన కాల్పుల్లో ఆరుగురు పౌరులు మృత్యువాత పడగా, మరో 13మంది గాయపడ్డారు. 2017 మార్చి ఒకటి నుంచి 2018 ఫిబ్రవరి 25 వరకు పాక్ జరిపిన కాల్పుల్లో 169 ఇండ్లు, 12 ప్రభుత్వ కార్యాలయాల భవనాలు ధ్వంసమయ్యాయని రాజౌరి జిల్లా డెవలప్‌మెంట్ కమిషనర్ షాహిద్ ఇక్బాల్ చౌదరి చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల బీభత్సం

- **బీజాపూర్‌లో బాంబులు పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు**
- **సుక్మా జిల్లాలో రహదారులను మూసివేసిన మావోలు**

కొత్తగూడెం క్రైం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు మరో సారి పోలీసులపై విరుచుకుపడ్డారు. బీజాపూర్‌లోని తార్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో దుడేడా ప్రాంతంలో రోడ్డునిర్మాణ పనుల వద్ద సీఏఎఫ్ 12వ బెటాలియన్ జవాన్లు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన బాంబులు పేలడంతో భువనేశ్వర్ యాదవ్, పురాన్‌సిన్హాలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. సుక్మా జిల్లాలోని గంధిరస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు మార్గాలను మూసివేశారు. మావోయిస్టుల నిర్మూలన కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ ప్రహార్ -2'కు వ్యతిరేకంగా నక్సల్స్ ఈ విధ్వంసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

బస్తర్‌లో సీఆర్పీఎఫ్ బైక్ అంబులెన్స్‌లు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) మరింత ఉధృతం చేసింది. బస్తర్ అటవీప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ప్రాథమిక వైద్య సేవలు అందించడానికి బైక్ అంబులెన్స్‌లను ప్రారంభించింది. బీజాపూర్ జిల్లాలోని 70 గ్రామాల్లో రోగులకు, గాయపడిన వారికి చికిత్స అందించడానికి వైద్య బృందాలను, భద్రతా సిబ్బందితో కూడిన బైక్ అంబులెన్స్‌లను పంపుతున్నది. ప్రధాన నక్సల్ ప్రభావిత ప్రాంతమైన దంతేవాడకు కూడా ఈ సేవలను మొదలుపెట్టింది. పెట్రోలింగ్‌లో భాగంగా, ప్రజల వినతి మేరకు వీరు గ్రామాలకు వెళ్లి సేవలందిస్తారు.

యూరోపాపై జీవం మనుగడకు అవకాశం

బృహస్పతి ఉపగ్రహంపై నీటిజాడలు



వాషింగ్టన్, ఫిబ్రవరి 25: సూర్య మండలంలోని అతిపెద్ద గ్రహం బృహస్పతికి గల ఉపగ్రహం 'యూరోపా'లో జీవం మనగలిగే వాతావరణం ఉందని బ్రెజిల్‌లోని సావోపోలో యూనివర్సిటీ పరిశోధకులు నిర్ధారించారు. 10 కి.మీ. లోతున మంచు రూపంలో ఒక సముద్ర పరిమాణం స్థాయిలో నీటి ఉనికి ఉన్నదని అంచనా వేశారు. దక్షిణాఫ్రికాలోని మోనెంగ్ బంగారు గనిలో 2.8 కి.మీ లోతున గల పరిస్థితులకు, యూరోపాపై పరిస్థితులకు సామీప్యత ఉన్నదని తేల్చారు. యూరోపా ఉపరితలంపై ఉష్ణోగ్రత శూన్యమని, అక్కడ జీవ సంబంధ ఇంధన వనరులు కూడా అందుబాటులో ఉన్నాయని బ్రెజిల్ నేషనల్ సింక్రోట్రోన్ లైట్ లేబరేటరీ (ఎల్ఎన్ఎల్ఎస్) పరిశోధకుడు డౌగ్లాస్ గాలంటే చెప్పారు.అపారమైన థర్మల్ ఇంధన వనరులున్నాయని తెలిపారు.

అమెరికాతో చర్చలకు సిద్ధమన్న ఉత్తర కొరియా

సియోల్ : అమెరికాతో చర్చలు జరిపేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని ఉత్తర కొరియా ప్రతినిధులు తెలిపారు. దక్షిణ కొరియాలో శీతాకాల ఒలింపిక్స్ ముగింపు వేడుక సందర్భంగా ఉత్తర కొరియా ప్రతినిధులు దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జేతో సమావేశమయ్యారు. అమెరికాతో పాటు ఉభయ కొరియా దేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొనాలని కోరుకుంటున్నట్లు ఉత్తర కొరియా ప్రతినిధులు ఆశాభావం వ్యక్తంచేశారు. అయితే అణ్వాయుధాలకు తెరదించిన తర్వాతనే చర్చలంటూ అమెరికా చెబుతుండటం విశేషం.

యూజీసీ నెట్ -2018

విద్య, ఉద్యోగ సమాచారం

జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ కోసం జాతీయస్థాయిలో నిర్వహించే యూజీసీ- నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) - జూలై 2018 నోటిఫికేషన్‌ను సీబీఎస్‌ఈ విడుదలచేసింది.



- **నెట్‌లో రెండు పేపర్లు మాత్రమే**
- **వయోపరిమితి పెంపు**



వివరాలు:

యూజీసీ ఆధ్వర్యంలో సీబీఎస్‌ఈ నెట్‌ను నిర్వహిస్తుంది. మొత్తం 84 సబ్జెక్టుల్లో, 91 కేంద్రాల్లో దీన్ని నిర్వహిస్తారు.

- **నెట్:** నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్. నెట్‌ను యూజీసీ నెట్/సీబీఎస్‌ఈ నెట్‌గా పిలుస్తారు. దేశంలోని ప్రామాణికమైన బోధనా నిపుణులకు, పరిశోధనార్థులకు ఉండాల్సిన కనీస ప్రమాణాలను పరిశీలించడానికి ఈ నెట్‌ను సీబీఎస్‌ఈ నిర్వహిస్తుంది. కాలేజీలు/విశ్వవిద్యాలయాల్లో లెక్చరర్ నియామకాల కోసం 2009 నుంచి నెట్‌లో అర్హత తప్పనిసరి చేశారు. దేశవ్యాప్తంగా 91 కేంద్రాల్లో 100 సబ్జెక్టుల్లో నెట్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహిస్తుంది.
- **జేఆర్ఎఫ్:** నెట్ ద్వారా జేఆర్ఎఫ్‌కు అర్హత సాధించినవారు యూజీసీ పరిధిలోని పలు స్కీమ్‌ల కింద ఫెలోషిప్‌నకు అర్హులు. ఆయా విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో పరిశోధనకు అర్హతగా నెట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.
- **అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు (లెక్చరర్‌షిప్):** డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు/లెక్చరర్లుగా పనిచేయడానికి నెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది.
- **అర్హతలు:** కనీసం 55 శాతం మార్కులతో పీజీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు పీజీలో 50 శాతం మార్కులు వస్తే సరిపోతుంది.
- పీజీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసినవారు/రాయనున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- నెట్ ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి రెండేండ్లలోపు అభ్యర్థులు పీజీ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.
- **వయస్సు:** 2018, జూలై 1 నాటికి జేఆర్ఎఫ్ కోసం నెట్ రాసే అభ్యర్థులకు 30 ఏండ్లు మించరాదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఇస్తారు. గరిష్ఠంగా ఐదేండ్లు సడలింపు ఉంటుంది.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (లెక్చరర్‌షిప్) కోసం నెట్ రాసే వారికి గరిష్ఠ వయోపరిమితి లేదు.

గమనిక: సెట్ (స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో 2002, జూన్ 1కి ముందు అర్హత సాధించినవారు నెట్ రాయనవసరం లేదు. 2002, తర్వాత సెట్ క్వాలిఫై అయినవారు కేవలం ఆయా రాష్ట్రాల్లో మాత్రమే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హులు. దేశంలో అన్ని ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు/కాలేజీల్లో పనిచేయాలంటే నెట్‌లో అర్హత సాధించాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ. 1000/-, ఓబీసీ అభ్యర్థులకు రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ. 250/-.
- **పరీక్ష విధానం:** పరీక్షలో రెండు పేపర్లు మాత్రమే ఉంటాయి. గతంలో మూడు పేపర్లు ఉండేవి.

పేపర్ - I:

- 100 మార్కులకు ఉంటుంది. 50 ప్రశ్నలు. అన్ని తప్పనిసరి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. టీచింగ్/రిసెర్చ్ ఆప్టిట్యూడ్‌పై ప్రశ్నలు ఇస్తారు.
- పరీక్ష కాలవ్యవధి 1 గంట (ఉదయం 9.30 నుంచి 10.30 వరకు)

పేపర్ - II:

- 200 మార్కులకు నిర్వహిస్తారు. 100 ప్రశ్నలు. అన్ని తప్పనిసరి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. అభ్యర్థుల ఆప్షనల్ సబ్జెక్టు నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- పరీక్ష కాలవ్యవధి రెండుగంటలు (ఉదయం 11 నుంచి 1 గంట వరకు)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 5 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** మార్చి 5
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** మార్చి 6
- **దరఖాస్తుల్లో తప్పుల సవరణ:** ఏప్రిల్ 25 నుంచి మే 1 మధ్య చేసుకోవాలి.
- **పరీక్షతేదీ:** జూలై 8
- **వెబ్‌సైట్:** www.cbsenet.nic.in

ఎయిర్ ఇండియాలో 60 ఖాళీలు

కోల్‌కతాలోని ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్) ఈస్టర్న్ రీజియన్ పరిధిలో ఖాళీగా ఉన్న యుటిలిటీ హ్యాండీమెన్ (తాత్కాలిక ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



ఏఐఈఎస్ఎల్ అనేది ఎయిర్ ఇండియా లిమిటెడ్ శాఖ ఆధ్వర్యంలో నడిచే సంస్థ.

- **పోస్టు పేరు:** యుటిలిటీ హ్యాండీమెన్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 60 (జనరల్-32, ఓబీసీ-13, ఎస్సీ-13, ఎస్టీ-2)
- **అర్హత:** ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత. ఏవియేషన్ రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 55 ఏండ్లకు మించరాదు
- **పే స్కేల్:** రూ. 15,418/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. సంస్థ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిగా నింపి, సంబంధిత సెల్ఫ్ అటెస్టెడ్ కాపీలతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పర్సనల్ అధికారి వద్ద ఇంటర్వ్యూ రోజున హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 12
- **వెబ్‌సైట్:** www.airindia.in

ఎమ్మెస్సీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ -2018

భారత ప్రభుత్వ సంస్థ నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్ఎంసీటీ) 'ఎమ్మెస్సీ (హెచ్‌ఏ) ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ -2018' నోటిఫికేషన్ విడుదల చేసింది.


వివరాలు:

టూరిజం మంత్రిత్వశాఖ పరిధిలోని ఎన్‌సీహెచ్‌ఎంసీటీ ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)తో కలిసి ఎమ్మెస్సీ కోర్సును అందిస్తుంది.

- **కోర్సు:** ఎమ్మెస్సీ (హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్)
- ఈ కోర్సు ఫుల్‌టైం కోర్సు.

ఎంపిక: జాతీయస్థాయిలో నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా (ఎంట్రెన్స్ లేకుండా కూడా ఈ రంగంలో అనుభవం ఉన్నవారికి సంస్థ నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు)

- **కోర్సును అందించే సంస్థలు:** ఎన్‌సీహెచ్‌ఎంసీటీ అఫిలియేటెడ్ సంస్థలు అయిన..
- **ఐహెచ్ఎం - పుసా, చెన్నై, బెంగళూరు, లక్నో, కోల్‌కతా, ఎన్‌సీహెచ్ఎం: ఐహెచ్ - నోయిడా.**
- **అర్హతలు:** ఎన్‌సీహెచ్ఎం - ఇగ్నో నుంచి బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) లేదా బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్. ఫైనల్ ఇయర్ పరీక్షలు రాయనున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వారి డిగ్రీ సర్టిఫికెట్‌ను అక్టోబర్ 31లోగా దాఖలు చేయాలి.



- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 25
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 19 (ఉదయం 10 నుంచి 12 వరకు)
- **ఫీజు:** జనరల్/ఓబీసీ రూ. 900/-
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ. 450/-
- **వెబ్‌సైట్:** www.nchm.nic.in

ఈసీఐఎల్‌లో టెక్నికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) ఖాళీగా ఉన్న టెక్నికల్ ఆఫీసర్, సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టుల (తాత్కాలిక ప్రాతిపదికన) భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.




- **మొత్తం ఖాళీల సంఖ్య:** 14 (టెక్నికల్ ఆఫీసర్-8, సైంటిఫిక్ అసిస్టెంట్-6)
- **అర్హతలు:** టెక్నికల్ ఆఫీసర్-గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్)లో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 21,000/- (కన్సాలిడేటెడ్ పే)
- **సైంటిఫిక్ అసిస్టెంట్:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 25 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 16,978/-(కన్సాలిడేటెడ్ పే)
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని, దానికి సంబంధిత సర్టిఫికెట్లను జతచేసి ఇంటర్వ్యూ తేదీన పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- **రాతపరీక్ష/ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

ఎన్‌సీఎల్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ (ఎన్‌సీఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



ఎన్‌సీఎల్ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న సంస్థ

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
- **పోస్టు పేరు:**ప్రాజెక్ట్ అసిస్టెంట్ (లెవల్ 2 & 3)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ)లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంబంధిత రంగం/విభాగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** ప్రాజెక్ట్ అసిస్టెంట్ (లెవల్ 2) పోస్టులకు రూ. 25,000/-, ప్రాజెక్ట్ అసిస్టెంట్ (లెవల్ 3) పోస్టులకు రూ. 28,000/-
- **వయస్సు:** 28 ఏండ్లకు మించరాదు (లెవల్ 2 ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులకు 30 ఏండ్లు)
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, కావాల్సిన సర్టిఫికెట్లను జతచేసి పర్సనల్ అధికారికి పంపాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 2
- **వెబ్‌సైట్:** http://recruit.ncl.res.in

అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో

హైదరాబాద్ (విద్యానగర్)లోని అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఐ) తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ ట్రెయినింగ్ స్కీమ్/అడ్వాన్స్‌డ్ వొకేషనల్ ట్రెయినింగ్ సిస్టమ్ కింద ఈ పోస్టులను భర్తీచేస్తారు.

- **పోస్టు పేరు:** జూనియర్ కన్సల్టెంట్
- **అర్హత:** బీఈ/బీటెక్ లేదా డిప్లొమా. సంబంధిత రంగం/టీచింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **పే స్కేల్:** రూ. 30,000/-
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, వ్యక్తిగతంగా/స్పీడ్ పోస్ట్ ద్వారా పర్సనల్ అధికారికి పంపాలి.



చిరునామా: The Director, ATI, Shivam Road, Vidyanagar, Hyderabad

- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.atihyderabad.ap.nic.in